RNI NO.APTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 23.06.2024 | సంపుటి : 10 సంచిక : 344 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

హైల్తటూరిజంగా హైదరాబాద్

అభివృద్ధిలో బాబుతో పోటీపడతాం
శంషాబాద్ సమీపంలో సకలసౌకర్యాలతో మెడికల్ హబ్
బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం : సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా ఏర్పాటు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇక్కడ అత్యంత అధునాతన ఆస్పత్రులు ఉన్నాయని, వాటిని కనెక్ట్ చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం మెడికల్ టూరిజం ప్రతిపాదన ఉందన్నారు. సీఎం హోదాలో తాను నిత్యం 18 గంటలు పనిచేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ 24వ వార్షికోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆలోచనను కుటుంబ సభ్యులు కార్యరూపంలో పెట్టారని చెప్పారు. క్యాన్సర్ ను అరికట్టాలనేది గొప్ప ఆలోచన అని అన్నారు. భవిష్యత్ లోనూ బసవతారకంకు తోడుంటామని చెప్పారు. ఆస్పత్రి విస్తరణకు సహకరిస్తామని చెప్పారు. నిత్యం ఎంతో మందికి ఆస్పత్రి సేవలందిస్తుందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్

మిగతా 2లో..

రైల్వేశాఖ తీపికబురు

రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య నాలుగుకు పెంపు

న్యూఢిల్లీ(జనంసాక్షి): సాధారణ ప్రయాణికులకు ఊరట కలగనున్నది. రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య నాలుగుకు పెరుగనున్నాయి. స్లీపర్, జనరల్ క్లాస్ కోచ్‌లలో విపరీతమైన రద్దీపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్యను రెట్టింపు చేస్తున్నట్లు రైల్వే

మిగతా 10 లో..

బీహార్‌లో కూలిన మరో వంతెన

వారం వ్యవధిలో రెండో ఘటన

పట్నా(జనంసాక్షి): కొన్నేళ్లుగా వాడుకలో ఉన్న ఓ వంతెన ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటన బిహార్‌లో శనివారం చోటుచేసుకుంది. అయితే, ఇందులో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. వారంలో

మిగతా 2లో..

ప్రాయోజిత పథకాలపై కేంద్రం పున:సమీక్షించాలి

విభజన హామీలు అమలు చేయాలి: భట్టి

- కేంద్రప్రభుత్వం రాష్ట్రాలపై పన్నుల వాటా సవరించాలి
- సర్‌చార్జీలు, సెస్ ఛార్జీలు 10 శాతం మించి ఉండొద్దు
- వెనుబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు పెంచాలి
- ఫర్టిలైజర్స్‌పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించాలి
- నిర్మలాసీతారామన్‌తో సమావేశంలో భట్టి ప్రతిపాదనలు

న్యూఢిల్లీ,జూన్22(జనంసాక్షి): విభజన చట్టంలో కేంద్రం నుంచి విడు దల కావాల్సిన రూ. 2200 కోట్లు ఇంకా విడుదల కాలేదని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. .జీఎస్టీ సమావేశంలో పాల్గొన్న భట్టి రాష్ట్రాలకు పన్ను వెసులుబాటు ఇవ్వాలని కోరామన్నారు. మూలధనం వ్యయాన్ని పెంచి పథకాలు కొనసాగించాలన్నారు. ఆదాయ పంపిణీలో అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. కేంద్ర పన్నులతో రాష్ట్రాల ఆదాయం తగ్గిందని చెప్పారు. కొన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలపై పున:సమీక్షించాలని కోరారు. సర్ చార్జీలు, సెస్ లపై 10 శాతం మించి ఉండొద్దన్నారు. స్కిల్ డెవల్ పమెంట్ సెటర్లను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరామని మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. వెనుబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు పెంచాలన్నారు. తెలంగాణకు మరిన్ని నవోదయ పాఠశాలలు పెంచాలన్నారు. మూసీ డెవలప్ మెంట్ ప్రాజెక్టుకు కేంద్ర

మిగతా 2లో..

చిరువ్యాపారులకు ఆర్థికదన్నుగా..

మూడు సేవలపై జీఎస్టీ తగ్గింపు ● జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్రమంత్రి నిర్మల

న్యూఢిల్లీ(జనంసాక్షి): చిన్న వ్యాపారులకు మేలు చేసేలా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు తీసుకున్నదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. త్వరలో బడ్జెట్ పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. జీఎస్టీపై ట్రిబునళ్లు, కోర్టుకు వెళ్లే ట్రాన్సాక్షన్ పరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు సమావేశం తర్వాత నిర్మలా సీతారామన్ మీడియాకు

మిగతా 2లో..

గనుల ప్రయివేటీకరణ జరగడం లేదు

- సింగరేణికి అన్ని విధాలా సహాయ సహకారాలు
- సంస్థను రక్షించాల్సిన బాధ్యత మాపైనా ఉంది
- కార్మికులకు అండగా ఉంటాం ● కేంద్రాన్ని విమర్శిస్తే సహించం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్రమంత్రిగా సింగరేణికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు."సింగరేణి కార్మికులకు అన్ని రకాలుగా అండగా ఉంటా. సింగరేణిని రక్షించాల్సిన బాధ్యత 49 శాతం వాటా ఉన్న కేంద్రంపై కూడా ఉంది. ఆ సంస్థకు లాభం చేకూర్చే పని కేసీఆర్, కేటీఆర్, భారాస ప్రభుత్వం ఏనాడూ చేయలేదు. ఉద్యోగులకు, కార్మికులకు సొంత ఇంటి పథకం అంటూ మభ్యపెట్టారు. వైద్య సదుపాయం, కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజ్, కోల్ ఇండియా కార్మికుల తరహా జీతాలు వంటి హామీలన్నీ తుంగలో తొక్కారు. తెలంగాణ బిడ్డగా సింగరేణి ప్రయోజనాలే నాకు ముఖ్యం. వేర్వేరు రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం ఉన్నా సరే సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతా. రానున్న రోజుల్లో మనం కూడా ఆత్మనిర్భర్‌ను స్ఫూర్తిగా తీసుకొని సొంత కాళ్లపై నిలబడాలి. దేశంలో బొగ్గు ఉత్పత్తి మరింత పెరగాల్సి ఉంది. ఆ దిశగా నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. అభివృద్ధికి అడ్డుపడొద్దని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నా. త్వరలోనే సింగరేణికి సంబంధించిన అన్ని అంశాలపై సమీక్ష నిర్వహిస్తా. కోల్ ఇండియా కూడా వేలంలో పాల్గొంటోంది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం చట్టం చేశాం. రాష్ట్రంలోని బొగ్గు గనులకు వేలం వేసుకోవాలని కేంద్రం ఎన్నోసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రూ.2వేల కోట్ల ఆదాయం కోల్పోయాం. చట్టంతో

మిగతా 2లో..

రైతులకోసం పోరాడుతాం

వెంటనే రైతుబంధు ఇవ్వండి

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్(జనంసాక్షి): యాసంగి పంటకు ఎకరాకు రూ.10వేలతో పాటు రైతు భరోసా పథకం కింద ఎకరాలకు రూ.15వేలు సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం

మిగతా 2లో..

పేపర్ లీకేజీలపై కొరడా

- అమల్లోకి ప్రివెన్షన్ యాక్ట్
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- బాధ్యులపై కఠిన చర్యలు
- లీక్‌చేస్తే 5 నుంచి పదేళ్ల జైలు
- రూ.కోటి వరకు జరిమానా

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశంలో వరుస పేపర్ లీకులతో సతమవుతున్న కేంద్రం ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ మొదలుపెట్టింది. పేపరు లీకేజీలకు కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకుగాను యుద్ధప్రాతిపదికన 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ప్రివెన్షన్ ఆఫ్ అన్ ఫెయిర్ మీన్స్)యాక్ట్-2024ను అమల్లోకి తీసుకొచ్చింది. ఇది జూన్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించి న్యాయశాఖ నిబంధనలు రూపొందిస్తోందని, త్వరలో నోటిఫై చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందప్రధాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోపే కేంద్ర సిబ్బంది, వ్యవహారాలశాఖ ఈ చట్టాన్ని అమల్లోకి తెస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం ఎవరైనా చట్టవిరుద్ధంగా పరీక్ష పేపర్లను అందుకున్నా, ప్రశ్నలు, జవాబులను లీక్ చేసినా, పరీక్ష రాసే వారికి అనుచితంగా సాయం చేసినా, కంప్యూటర్ నెట్‌వర్క్‌ను ట్యాంపరింగ్ చేసినా, నకిలీ పరీక్షలు నిర్వహించినా, నకిలీ ప్రవేశపరీక్ష కార్డులు జారీ చేసినా నేరంగా పరిగణిస్తారు. పేపరు లీక్ చేసేవాళ్లకు 5 నుంచి 10 సంవత్సరాల వరకు జైలుశిక్షతోపాటు రూ.కోటి వరకు జరిమానా విధించే వెసుబాటు ఉంది. ఇందులో భాగస్వాములు వ్యవస్థీకృత నేరానికి పాల్పడినట్లు రుజువైతే.. వారి ఆస్తులనూ జప్తు చేస్తారు. పరీక్ష నిర్వహణకు

మిగతా 2లో..

తరచూ లీకేజీలతో కేంద్రం దిద్దుబాటు చర్యలు

పరీక్షల నిర్వహణ ప్రక్రియలో సంస్కరణలు

ఇస్రో మాజీ చైర్మన్ రాధాకృష్ణన్ కమిటీ

2లో

నీట్ రద్దుతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతారు

అందుకే ఆ నిర్ణయం తీసుకోలేదు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వెల్లడి

జూడాల నిరసన

సమస్యలు పరిష్కరించాలని ఉస్మానియాలో కళ్లకు గంతలతో ఆందోళన

హైదరాబాద్(జనంసాక్షి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళ్లకు గంతలు కట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు దీపాంకర్ మాట్లాడుతూ.. "అధికారుల చుట్టూ తిరగకుండా ప్రతి నెలా నిర్దిష్టమైన తేదీకి స్టైఫండ్ ఇవ్వాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. కానీ, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఉస్మానియా ఆసుపత్రి భవనం మూసి వేసి నాలుగేళు అయ్యింది. పక్కనే ఉన్న మరో భవనంలోకి ఆసుపత్రి మార్చారు. విపరీతమైన రద్దీ కారణంగా ఇన్‌ఫెక్షన్ల శాతం పెరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా డిమాండ్లపై లిఖితపూర్వక హామీ ఇవ్వాలి" అని కోరారు.

అనర్హులు రేషన్ కార్డులు వాపస్ చేయాలి

లేకపోతే అర్హులకు ప్రయోజనాలు దెబ్బతింటాయి

అధికారులు అతి చేస్తే బదీలీలుండవు.. నేరుగా సర్వీసుల నుంచి తొలగిస్తాం

వారు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలి ● మాది పేదల ప్రభుత్వం : మంత్రి పొంగులేటి

ఖమ్మం(జనంసాక్షి): అక్రమంగా, అర్హత లేకున్నా రేషన్‌కార్డ్ కలిగివుంటే సరెండర్ చేయాలని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అనర్హులు కార్డులు పొందితే అర్హులకు ప్రయోజనాలు దెబ్బతింటాయని అన్నారు. అనర్హులైన వారు తప్పుకుంటే మంచిదన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా ప్రభుత్వం ధనుకులకి కాదు బీదవారి ప్రభుత్వమని, ప్రజలకి అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా అధికారులు ఎక్కువ చేస్తే నా పాలనలో ట్రాన్స్ఫర్లు ఉండవు డైరెక్ట్గా రిమూవ్ చేయడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకి ఎంత

మిగతా 2లో..

ఆదివాసీ మహిళపై దాడి..
నిందితులపై కఠిన చర్యలు

బాధితురాలిని పరామర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

2లో

రక్షణ రంగంలో సహకారం

- మరింత బలోపేతం చేసుకునే దిశగా ముందుకు
- బంగ్లా, భారత్ ప్రధానులు షేక్ హసీనా, మోదీ భేటీ

దిల్లీ(జనంసాక్షి): దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునే దిశగా ముందుకు వెళ్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. రెండు రోజుల భారత్ పర్యటనకు వచ్చిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఇరుదేశాల రక్షణ సహకారం, సాయుధ బలగాల ఆధునీకరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విదేశీ నేతలతో మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బంగ్లాదేశ్- భారత్ సరిహద్దులో ఉగ్ర కార్యకలపాలను అడ్డుకోవడంతోపాటు శాంతిస్థాపనకు కృషి చేయాలని ఇరుదేశాలు నిర్ణయించినట్లు

మిగతా 2లో..

ముంచుకొస్తున్న మహాయుద్ధం

ఇజ్రాయిల్, హిజ్‌బుల్లా మధ్య ముదురుతున్న ఘర్షణ

మరో ప్రపంచ యుద్ధానికి దారి తీసే ప్రమాదం

యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్

న్యూయార్క్(జనంసాక్షి): మరో సంక్షోభం దిశగా ప్రపంచ వెళ్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ తెలిపారు. ఇజ్రాయిల్, హిజ్‌బుల్లా మధ్య ముదురుతున్న ఘర్షణ.. మరో ప్రపంచ యుద్ధానికి దారి తీసే అవకాశాలు ఉన్నట్లు ఆయన

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
23.06.2024

పేపర్ లీకేజీలపై కొరడా

అయిన ఖర్చునూ వారినుంచే వసూలు చేస్తారు. ఈ కొత్త చట్టం ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడినా, మాల్ ప్రాక్టీస్ చేసినా, నకిలీ వెబ్‌సైట్లు తెరిచినా గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, ఆర్ఆర్బీ, ఐబీపీఎస్, ఎన్‌డీఏ తదితర పోటీ పరీక్షలతో పాటు నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి ఎంట్రన్స్ టెస్టులకు సైతం చట్టం వర్తించనుంది. పేపర్ లీక్ కేసుల్లో దోషులుగా తేలే వారికి కనీసం మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష పడుతుంది. అయితే పేపర్ లీక్ వ్యవహారాల్లో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిన వారికి ఐదు నుంచి పదేళ్ల జైలుశిక్ష విధించాలని బిల్లులో పెట్టారు. విద్యార్థులు, ఉద్యోగార్థుల భవిష్యత్‌తో ఆడుకోవడమే కాబట్టి.. ఇలాంటి నేరాలు చేసే వారికి భవిష్యత్ లేకుండా చేసేలా శిక్షలు ఉంటాయి. పరీక్షల నిర్వహణ బాధ్యతలను చేపట్టే సర్వీస్ ప్రొవైడర్ సంస్థలు పేపర్ లీక్ చేసినట్లు తేలితే వాటికి రూ.కోటి వరకు జరిమానా విధిస్తారు. పరీక్ష నిర్వహణకు అయిన ఖర్చునంతా సంస్థ నుంచి రికవర్ చేయాలనే ప్రతిపాదనను కూడా ఈ బిల్లు లో పొందుపరిచారు. ఇలాంటి సంస్థపై పరీక్షలు నిర్వహించకుండా నాలుగేళ్ల పాటు బ్యాన్‌ను కూడా విధిస్తారు. పేపర్ లీక్ కేసుల విచారణను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లేదా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్థాయి కంటే తక్కువ లేని అధికారి నిర్వహించాల్సి ఉంటుంది. దర్యాప్తును ఏదైనా కేంద్ర ఏజెన్సీకి అప్పగించే అధికారం కూడా కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. ఈ బిల్లులో పేపర్ లీక్‌తో ముడిపడిన 20 రకాల నేరాలు, అక్రమాలకు పాల్పడే వారికి విధించాల్సిన శిక్షల గురించి ప్రస్తావిం చారు. మాస్ కాపీయింగ్, జవాబు పత్రాలను తారుమారు చేయడం, ఓఎంఆర్ షీట్లను ట్యాంపరింగ్ చేయడం వంటివన్నీ ఈ నేరాల జాబితాలో ఉన్నాయి.

నీట్ రద్దుతో లక్షలాది మంది
విద్యార్థులు నష్టపోతారు

దిల్లీ(జనంసాక్షి): వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్- యూజీ2024 ప్రవేశపరీక్ష దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. పరీక్షకు ముందు రోజే పేపర్ లీకైందంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఏకంగా 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం అనుమానాలను మరింత బలపరుస్తోంది. పేపర్ లీకైనట్లు ఓ వైపు కేంద్రం పరోక్షంగా అంగీకరిస్తున్నా.. పరీక్షను రద్దుకు మాత్రం ససేమిరా అంటోంది. అసలు నీట్ పరీక్షను రద్దు చేయకపోవడానికి గల కారణాలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వివరించారు. నీట్- యూజీ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజ్ వల్ల కొందరు విద్యార్థులు లాభపడి ఉన్నప్పటికీ.. పరీక్షను రద్దు చేస్తే ఎంతో కష్టపడి చదివి రాసిన లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతారని పేర్కొన్నారు. పాసైన వారి కష్టమంతా వృథా అవుతుందని చెప్పారు. 2004, 2015లో ఈ తరహా ఘటనలే చోటు చేసుకున్నాయని, అయితే లీకేజీ వ్యవహారం భారీ ఎత్తున జరగడంతో అప్పట్లో పరీక్షను రద్దు చేసినట్లు గుర్తు చేశారు. అయితే, ఈసారి లీకేజీ కొన్ని సెంటర్లలో మాత్రమే జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు నీట్-యూజీ 2024 కౌన్సెలింగ్ ప్రక్రియను వాయిదా వేసేందుకు సుప్రీం కోర్టు కూడా నిరాకరించింది. జులై 6న నిర్వహించాల్సిన కౌన్సిలింగ్‌ను యథాతథంగా కొనసాగించాలని శుక్రవారం ఆదేశించింది. అంతేకాకుండా పేపర్ లీకేజీపై పెనుదుమారం కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కూడా కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల నిర్వహణ ప్రక్రియలో సంస్కరణల కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఏడుగురు సభ్యులుండే ఈ కమిటీకి ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వం వహించనున్నట్లు తెలిపింది.

తరచూ లీకేజీలతో
కేంద్రం దిద్దుబాటు చర్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): నీట్ యూజీ, యూజీసీ నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీపై పెనుదుమారం కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల నిర్వహణ పక్రియలో సంస్కరణల కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. ఏడుగురు సభ్యులుండే ఈ కమిటీకి ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వం వహించనున్నట్లు తెలిపింది. ఈ కమిటీలో ఎయిమ్స్ దిల్లీ మాజీ డైరెక్టర్ డా.రణ్‌దీప్ గులేరియా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.జె.రావు, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ కె.రామమూర్తి, కర్మయోగి భారత్ సహ వ్యవస్థాపకుడు పంకజ్ బన్సల్, ఐఐటీ దిల్లీ డీన్ (విద్యార్థి వ్యవహారాలు) ప్రొఫెసర్ ఆదిత్య మిత్తల్, కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్ సభ్యులుగా ఉన్నారు. ప్రవేశపరీక్షల నిర్వహణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండటం కోసం ఈ కమిటీని ఏర్పాటుచేసినట్లు కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. పరీక్షల నిర్వహణ విధానంలో సంస్కరణలు, డేటా సెక్యూరిటీ ప్రొటోకాల్స్‌లో పురోగతి, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపై ఈ కమిటీ తగిన సిఫార్సులు చేయనుంది. రెండు నెలల్లోగా తన నివేదికను సమర్పిస్తుందని కేంద్రం తెలిపింది. ఇటీవల నీట్, నెట్ ప్రవేశపరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అవడం తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్రం తాజాగా ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్ 2024ను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఎవరైనా చట్టవిరుద్ధంగా పరీక్ష పేపర్లను అందుకున్నా, ప్రశ్నలు, జవాబులను లీక్ చేసినా నేరంగా పరిగణిస్తారు. బాధ్యులకు 5 నుంచి 10 ఏళ్ల వరకు జైలుశిక్ష, రూ.కోటి వరకు జరిమానా విధించే వీలుంది.

అనర్హులు రేషన్ కార్డులు
వాపస్ చేయాలి

బాధ ఉంటే మీ మీద కంప్లైంట్ చేస్తారు అది అర్థం చేసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అని ఆయన అన్నారు. ప్రజాసమస్యలు పట్టించుకోలేని వారిని ప్రభుత్వ ఉపేక్షించబోదని హెచ్చరించారు. అధికారులంతా సక్రమంగా పనిచేయాలని, కబ్జాకు గురైన వాటన్నిటిని బయటకు తీసి పేదోడికి అప్పజెప్పాలని ఆయన సూచించారు. ఇకనైనా ప్రతిపక్షాలు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని పొంగులేటి తెలిపారు. మూడేళ్లలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నికల వేళ ఇచ్చిన మాట ప్రకారం.. త్వరలోనే రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. రూ.31వేల కోట్లతో రైతుల రుణాలను మాఫీ చేయనున్నామని పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని చెప్పారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం

కొల్లాపూర్(జనంసాక్షి):

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ తాలూకా మొలచింతలపల్లిలో ఆదివాసీ కుటుంబంపై పాశవిక దాడికి పాల్పడిన నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టమని మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను ఆయన పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితురాలిని, ఆమె భర్తను జరిగిన సంఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు."మొలచింతలపల్లిలో ఆదివాసీ మహిళ ఈశ్వరమ్మను నిర్బంధించారు. పది రోజులుగా ఆమెను చిత్రహింసలు పెట్టారు. నిందితులను చట్టపరంగా శిక్షిస్తాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. ఇలాంటి పాశవిక చర్యలు జరగడం బాధాకరం. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించడంతో పాటు వ్యవసాయం చేసుకోవడానికి ప్రభుత్వపరంగా కొంత భూమిని అందిస్తాం. వారి పిల్లలకు ప్రభుత్వ పరంగా విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటాం" అని జూపల్లి కృష్ణారావు తెలిపారు.

హెల్త్ టూరిజంగా హైదరాబాద్

పోర్టుకు పక్కన భూమి తీసుకుని మెడికల్ హబ్‌గా పెద్ద ఆస్పత్రులు కట్టిస్తామని తెలిపారు. హైదరాబాద్ కు వస్తే జబ్బు నయమౌతుందనేలా చేస్తామని అన్నారు. అభివృద్ధి సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు పోటి పడుతాయని తెలిపారు. 24వ వార్షికోత్సవానికి బాలకృష్ణ ఆహ్వానించారని 30 వ వార్షికోత్సవానికి కూడా తానే వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బసవతారకం ఆసుపత్రి లక్షలాది మందికి సేవలందిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిస్వార్థంగా పేదలకు సేవలందించేందుకు ఆసుపత్రిని నిర్మించారని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబుతో అభివృద్ధిలో పోటీపడే అవకాశం నాకు వచ్చింది. ఆయన 18 గంటలు పనిచేసి.. నేను 12 గంటలు పని చేస్తే సరిపోదు. తెలంగాణ రాష్ట్ర నేతలు, అధికారులు కూడా 18 గంటలు పని చేయాల్సిందే. అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు పోటీ పడాలి.. ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని చూస్తున్నాం అని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తెలిపారు. అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు హెల్త్ టూరిజం హబ్ ఉంటుందన్నారు. అందులో బసవతారకం ఆసుపత్రికి తప్పకుండా స్థానం ఉంటుంది. వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచంలోని ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ఎన్టీఆర్ ఆలోచనలో ఏర్పాటైన ఈ ఆసుపత్రి 24 ఏళ్లుగా కోట్లాది మందికి సేవ చేయడం ఆనందదాయకమని రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించేందుకు చంద్రబాబు

నాయుడు ఆసుపత్రిని పూర్తి చేసి పేదలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. నిరుపేదలకు వైద్యసేవలు అందించాలన్న ఎన్టీఆర్ ఆశయాలను అమలు చేయడం చూసి స్వర్గం నుంచి మనల్ని ఆశీర్వదిస్తానన్నారు. నిరుపేదలకు క్యాన్సర్ వ్యాధిని నయం చేసేందుకు వైద్యరంగంలో విశేష కృషి చేసిన ఎన్టీఆర్ బసవతారం ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి సంబంధించి ఎలాంటి సహకారం అందించాలన్నా మా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆసుపత్రి ఛైర్మన్ బాలకృష్ణ హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబు నాయుడుతో పోటీపడే అవకాశం వచ్చిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలన్నారు. ఎన్టీఆర్‌కు రాజకీయాలు, సంక్షేమం వారసత్వంగా వచ్చాయి. రెండు కిలోల బియ్యంతో బసవతారకం ఆస్పత్రిని నిర్మించి పేదలకు అండగా నిలిచారని ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ మొదటి తరం అయితే, రెండో తరం చంద్రబాబు, బాలకృష్ణ అని, మూడో తరం లోకేష్, భరత్ అని రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ మూడో తరం కూడా దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తు న్నట్లు తెలిపారు. నందమూరి తారక రామారావు భార్య, బాలకృష్ణ తల్లి బసవతారకం క్యాన్సర్‌తో మరణించారు. ఆ సమయంలో క్యాన్సర్ చికిత్స అందుబాటులో లేదు. దీంతో కేన్సర్ బారిన పడిన పేదలు వైద్యం చేయించుకోలేకపోతున్నారు. అందుకే పేదలకు వైద్య సహాయం అందించేందుకు ఎన్టీఆర్ ఈ బసవతారకం ఆసుపత్రిని ప్రారంభించారు. డొనేషన్‌తో నడిచే ఈ ఆసుపత్రిలో పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందుతుంది. అందుకే అన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి క్యాన్సర్ రోగులు వచ్చి చికిత్స పొందుతున్నారు. క్యాన్సర్ మహమ్మారి ప్రజలను పట్టి పీడిస్తోందని బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆసుపత్రి సేవల విస్తరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి సహకారం కోరగానే అంగీకరించారని చెప్పారు. దాతల సహకారంతో ఆసుపత్రి ఈ స్థాయికి చేరుకుందని తెలిపారు. సేవలను మరింత విస్తరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, డా.నోరి దత్తాత్రేయుడు పాల్గొన్నారు.

రక్షణ రంగంలో
సహకారం

తెలిపారు. ఈ రెండు దేశాల మధ్య 4096.7 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. భారత్‌కు పొరుగు దేశాలతో ఉన్న సరిహద్దులో ఇదే పెద్దది. 'ఇండియన్ ఓషన్ రీజియన్' అంశంలోనూ భారత్‌కు తోడుగా నిలిచేందుకు బంగ్లాదేశ్ ముందుకు రావడాన్ని మోదీ స్వాగతించారు. 'బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోపరేషన్' తోపాటు ఇతర అంతర్జాతీయ ఫోరమ్‌ల విషయం లోనూ ఇదే సహకారాన్ని కొనసాగిస్తామన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, సహకార సంబంధాల బలోపేతానికి కృషి చేస్తామని మోదీ తెలిపారు. "గత 10 ఏళ్లలో మేం ఇరుదేశాల మధ్య 1965 నాటికి ముందున్న సంబంధాలను పునరుద్ధరించాం. ఇకపై డిజిటల్, ఎనర్జీ కనెక్టివిటీపై దృష్టి పెడతాం. తద్వారా ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలు పటిష్ఠమవుతాయి" అని మోదీ అన్నారు. మొత్తం 54 నదులు భారత్, బంగ్లాదేశ్ మీదుగా ప్రవహిస్తున్నట్లు గుర్తు చేసిన ప్రధాని.. వరదల నిర్వహణ, ముందస్తు హెచ్చరికలు, తాగునీటి ప్రాజెక్టుల విషయంలో పరస్పరం సహకరించు కున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 1996 నాటి గంగా జలాల ఒప్పందాన్నే అనుసరిస్తున్నామని, దీనిలో కొన్ని మార్పులు చేయాలని తాజా సమావేశంలో నిర్ణయించామన్నారు. దీని కోసం భారత్ నుంచి ఓ సాంకేతిక బృందం త్వరలోనే బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి అధికారులతో చర్చలు జరుపుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ఇరుదేశాల ప్రధానులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. బంగ్లాదేశ్ నుంచి చికిత్స కోసం భారత్‌కు రావాలనుకునే వారికి ఇకపై ఈ-వీసా సదుపాయాన్ని కల్పించనున్నారు. దీనికోసం రంగ్‌పుర్‌లో కొత్తగా అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నట్లు మోదీ తెలిపారు. బంగ్లాదేశ్‌లోని వాయవ్య ప్రాంత ప్రజలు సులువుగా భారత్‌కు వచ్చి చికిత్స పొందే వీలుంటుందని చెప్పారు. బంగ్లాదేశ్‌తో సంబంధాలకే భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఈ సందర్భంగా మోదీ స్పష్టం చేశారు.

బీహార్‌లో కూలిన మరో వంతెన

ఇది రెండో ఘటన కావడం గమనార్హం. బిహార్‌లోని సివాన్ జిల్లాలోని గండక్ కాలువపై ఉన్న వంతెన మహారాజ్‌గంజ్ జిల్లాలోని పటేధి బజార్ మార్కెట్‌ను, దర్భంగాలోని రామ్‌గఢ్ పంచాయతీతో కలుపుతోంది. ఈ వంతెనపై నుంచి ప్రతిరోజూ వందల మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కాగా శనివారం ఉదయం ఇది భారీ శబ్దంతో ఒక్కసారిగా కుప్పకూ లిపోయింది. ఈ వంతెన దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిందని, దీని నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్లే కూలిపోయిందని, అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

రైతుల కోసం
పోరాడుతాం

విడత వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకాన్ని ప్రభుత్వం ఇంకా అమలు చేయడం లేదని మండిపడ్డారు. రుతుపవనాలకు ముందు వర్షాలు కురిసి ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ రైతు భరోసా అమలుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయడం లేదని విమర్శించారు. రైతుబంధు లక్ష్యంగా చేసుకుని అధికారంలో ఉన్న వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమి సాగుకు యోగ్యమైందేనన్నారు. ప్రతి రైతు ఆధీనంలో ఉన్న భూమిని రుజువు చేస్తూ పట్టేదార్ పాసుపుస్తకాల ఆధారంగా రైతులందరికీ రైతు బంధు సహాయం అందించడం జరిగిందన్నారు. పంటలు పండించడానికి రైతులను ప్రోత్సహించడానికి పెట్టుబడి సాయం అందించామని.. రాష్ట్రంలో దాదాపు 95 శాతం మంది రైతులు ఐదెకరాలు, అంతకంటే తక్కువ భూమి కలిగి ఉన్నారు. ఐదు నుంచి ఏడు ఎకరాలు కలిగి ఉన్న వారు ఏడుశాతం కంటే తక్కువగా ఉన్నారని చెప్పారు. 20 ఎకరాల నుంచి 54 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు కేవలం 6,488 మంది మాత్రమే ఉన్నారన్నారు. ప్రస్తుత వనకాలం సీజన్‌లో పంట పెట్టుబడికి మద్దతుగా అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం మరింత ఆలస్యం చేయకుండా రైతులకు చెల్లించాలన్నారు. రుణమాఫీ హామీపై ప్రభుత్వం కేబినెట్‌లో చర్చ కొనసాగుతోందని.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తున్నామని చెప్పి ఆగస్టు 15కు మార్చారని, హామీల అమలులో కాలయాపన చేయడం, కేసీఆర్‌ను విమర్శించడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా మారిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో రుణమాఫీ కాకుండా మిగిలింది రూ.4వేల కోట్లు మాత్రమేనని, కేసీఆర్ హయాంలో జరిగిన రుణమాఫీని రేవంత్‌రెడ్డి తక్కువ చేసి చూపుతున్నారన్నారు. రూ.2లక్షల పంట రుణాలు ఎంత మందికి ఉన్నాయనే వివరాలు ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అప్పుడే రుణమాఫీ జరిగిందన్నట్లు మీడియా సంస్థలు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.రైతు భరోసాపై మంత్రివర్గ ఉపసంఘం వేసి జూలై 15 దాకా డెడ్‌లైన్ పెట్టారని, అప్పటికే నాట్లు వేసే పని పూర్తవుతుందని.. సీజన్ అయిపోయాక రైతు భరోసా ఇస్తారా? అని నిలదీశారు. రైతు భరోసాకు అర్హులను ఇప్పటి వరకు ఎందుకు తేల్చలేదని ప్రశ్నించారు. 68.90 లక్షల మందికి 1.52 కోట్ల ఎకరాలకు 11 విడతల్లో రూ.72వేల కోట్లను కేసీఆర్ హయాంలో రైతుబంధు కింద ఇచ్చామని, 2,603 క్లస్టర్లు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. ప్రతి క్లస్టర్‌లో 5వేల ఎకరాలు ఉంటాయని.. డేటా అంతా రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉందని, రైతు భరోసాకు మంత్రివర్గ ఉపసంఘం వేయడం కుంటి సాకు మాత్రమేనని నేతలు మండిపడ్డారు.

ముంచుకొస్తున్న మహాయుద్ధం

హెచ్చరించారు. శుక్రవారం ఈ అంశం గురించి ఆయన స్టేట్మెంట్ ఇచ్చారు. కొన్ని రోజుల క్రితం లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడి చేసిన ఘటనలో హిజ్‌బుల్లా సీనియర్ కమాండర్ హజ్ సామి తలేబ్ అబ్దుల్లా హతమయ్యాడు. ఈ నేపథ్యంలో షియా మిలిటరీ గ్రూపునకు చెందిన అధినేత హసన్ నస్రల్లా ఓ వార్నింగ్ ఇచ్చాడు. వెస్ట్ జెరుసలామ్‌లో పూర్తి స్థాయిలో యుద్ధానికి దిగనున్నట్లు నస్రల్లా వార్నింగ్ ఇచ్చిన సందర్భంగా యూఎన్ సెక్రటరీ జనరల్ స్పందించారు.ఓ మొండి నిర్ణయం, ఓ తప్పుడు అంచనా.. మరో భారీ విపత్తును సృష్టిస్తుందని, అది సరిహద్దుల్ని దాటేస్తుందని, ఊహించని రీతికి వెళుతుందని యూఎన్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తెలిపారు. లెబనాన్‌ను మరో గాజాగా చూడాలన్న కాంక్ష ప్రపంచానికి లేదన్నారు. రెండు దేశాలు శాంతి ప్రక్రియ చేపట్టాలని ఆయన ఇరు వర్గాలను కోరారు. లెబనాన్, ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న ఘర్షణకు మిలిటరీ పరిష్కారం కుదరదన్నారు. ఇటీవల ఇజ్రాయిల్, హిజ్‌బుల్లా .. అనేక సార్లు రాకెట్ దాడులకు పాల్పడ్డాయి. దీని వల్ల 53 వేల మంది ఇజ్రాయిలీలు, లక్షల మంది లెబనీస్‌లు ఇండ్లు విడిచి వెళ్లారన్నారు

గనుల ప్రయివేటీకరణ జరగడం లేదు

మాకేం సంబంధం అని ఇవాళ భారాస నేతలు మాట్లాడుతున్నారు. చట్టం చేసిన సమయంలో వారు సభలోనే ఉన్నారు. దానికి మద్దతు ప్రకటించారు. సింగరేణి విషయంలో ప్రశ్నిస్తున్న నేతలు మైన్స్ వేలంలో ఎందుకు పాల్గొనలేదో సమాధానం చెప్పాలి. ఐరన్ వోర్, సున్నపురాయి గనులకు వేలం వేయకుండా నిర్లక్ష్యం చేశారు. ఓడిపోయామనే బాధలో కేటీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ఆయన వ్యాఖ్యలపై జాలి చూపించాలి" అని కిషన్‌రెడ్డి అన్నారు.

మాదాపూర్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్(జనంసాక్షి): మాదాపూర్‌లో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడింది. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కి డ్రగ్స్ తీసుకొస్తున్న సాయిచరణ్‌ని టీజీ న్యాబ్, మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్‌ని చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కి వచ్చే ట్రావెల్స్ డ్రైవర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న వ్యాపారవేత్తలు మాలిక్ లోకేశ్, సందీప్‌రెడ్డి, రాహుల్, సుబ్రహ్మణ్యంలతో పాటు సాయిచరణ్‌ను నార్కోటిక్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. సాయి చరణ్ నుంచి పెద్ద మొత్తంలో ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ డ్రగ్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు సాయిచరణ్‌ను పట్టుకున్నారు. నిందితుడు హైదరాబాద్, నెల్లూరు, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖలోని వ్యాపారవేత్తలకు సరఫరా చేస్తున్నట్టు దర్యాప్తులో తేలింది.

ప్రాయోజిత పథకాలపై కేంద్రం పున: సమీక్షించాలి

సహకారం కోరామన్నారు. ఫర్టిలైజర్స్ పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర సమస్యలపై మరోసారి నిర్మలాసీతారామన్ ను కలుస్తామని వెల్లడించారు. . హైదరాబాద్ గ్లోబల్ సిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొగ్గు వేలంపై బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని .. వారి వల్లే బొగ్గు వేలం చట్టం వచ్చిందని చెప్పారు. బొగ్గు వేలం ఆపితే ఇల్లందు, సత్తుపల్లి గనులు ఎందుకు పోయాయని ప్రశ్నించారు. సింగరేణికి నష్టం జరిగేలా తమ సొంత వారికీ గనులు వచ్చేలా బీఆర్ఎస్ అధిష్ఠానం వ్యవహరించిందని ధ్వజమెత్తారు. అంతర్గత వనరులు సమీకరించుకుని తాము రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ప్రీ బి÷-జడెట్,జీఎస్టీ కౌన్సిల్ సమావేశం శనివారం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కొంత వెసులుబాటు కల్పించాలని కోరారు. ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా నిధులు ఉపయోగించుకునే అవకాశం ఇవ్వాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమాజంలో అసమానతలు తగ్గించేందుకు సమ్మిళిత అభివృద్ధి చేయాలని కోరారు. సెస్, సర్ ఛార్జ్ పన్నులు పది శాతం మించకుండా చేయాలన్నారు. రాష్ట్రాల నికర రుణపరిమితి సీలింగ్ ముందుగానే చెపితే దానికి అనుగుణంగా బ్జడెట్ పెట్టుకుంటామని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు ఉండాలని కోరారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద గత ఏడాది తెలంగాణకు 1.4 శాతమే నిధులు వచ్చాయని తెలిపారు. ఉపాధి హామీ నిధులు ఆస్తుల సృష్టి పనులకు వినియోగించేలా అనుమతులు ఇవ్వాలని కోరారు. మూసి రివర్ ఫ్రంట్‌కు నిధులు కేటాయించాలని కోరామని భట్టి విక్రమార్క అన్నారు.

చిరువ్యాపారులకు ఆర్థికదన్నుగా..

చెప్పారు. అలాగే వ్యాపారులు జరిమానా చెల్లించడంలో ఆలస్యమైతే, దానిపైన వడ్డీ కూడా చెల్లించాల్సి ఉందని, దీన్ని ఎత్తేయాలని జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయన్నారు.ఇన్ పుట్ క్రెడిట్ టాక్స్ విషయంలో మార్పులు చేయాలని నిర్ణయించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రత్యేకించి, ఇన్ పుట్ క్రెడిట్ టాక్స్ విషయంలో మోసాలు జరుగకుండా ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి అమలు చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. అన్ని రకాల కార్టన్ బాక్సులపై జీఎస్టీ 12 శాతానికి కుదించడం ద్వారా ఆపిల్, ఇతర పండ్ల వ్యాపారులకు మేలు జరుగుతుందన్నారు. స్ప్రింకర్లు, సోలార్ కుక్కర్లపై జీఎస్టీ 12 శాతానికి తగ్గించాలని కూడా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 73 ని

ప్రత్యేకాధికారుల పాలనలో

జీపీల్లో ఆగిన అభివృద్ధి

- కనీస మౌలిక వసతులూ కల్పించని వైనం
- రాజపేట గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ఎంపీడీవో అయ్యుండి?
- చెత్త సేకరించే ట్రాక్టర్ ఖరాబ్ అయితే 20 రోజుల తర్వాత మరమ్మతులు చేశారు?
- గ్రామ పెద్ద సర్పంచులు లేక అవస్థ పడుతున్న జనాలు
- పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో లేని ప్రత్యేక అధికారులు

మర్రిగూడ, జూన్ 22 (జనంసాక్షి) : గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలలో పూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి, సర్పంచుల పదవీకాలం జనవరి 2024 లో ముగిసినది, ఫిబ్రవరి 2 నుండి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది, అప్పటినుండి గ్రామాలలో అభివృద్ధి పూర్తిస్థాయిలో ఆగిపోయింది, కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రత్యేక అధికారులు విఫలమయ్యారు, గ్రామాలలో సర్పంచ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చిన్న పని కోసం కూడా మర్రిగూడ మండల కార్యాలయం చుట్టూ రోజుల తరబడి అధికారులు తిప్పుతున్నారు, అధికారులను ప్రశ్నించే గ్రామ ప్రథమ పౌరుడు లేకపోవడంతో, ఎమ్మెల్యే ఎంపీ నుండి నిధులు తీసుకువచ్చి గ్రామ పంచాయతీ అభివృద్ధి చేసే సర్పంచులు లేకపోవడంతో గ్రామాలలో పూర్తిస్థాయిలో అభివృద్ధి ఆగిపోయింది, ప్రత్యేక అధికారులు చిన్నచిన్న పనులను కూడా సొంతంగా ఖర్చులతోనే చేపియలేని ప్రత్యేక అధికారులు, గ్రామాలలో సర్పంచి ఉంటే గ్రామపంచాయతీ నిధులు ఉన్నా లేకున్నా తన సొంత డబ్బులు పెట్టుకొని పనులు చేయిస్తారు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిపాలన కొనసాగిస్తారు, గ్రామ పంచాయతీలలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే వాడే సర్పంచులు,

మర్రిగూడ మండలంలోని రాజాపేట తండాలో గ్రామపంచాయతీలో 20 రోజుల క్రితం చిత్త సేకరించే ట్రాక్టర్ పరమత్తులు చేయలేక 20 రోజుల నుండి చిత్త సేకరించడం మానేశారు, ముందే వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది, ఈ గ్రామ పంచాయతీకి ఎంపీడీవో ప్రత్యేక అధికారిగా ఉండి కూడా పరిస్థితి ఇలా ఉందంటే మరి మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిస్థితి ఏమిటి?

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేకపోతున్న ప్రత్యేక అధికారులు గ్రామాలలో పూర్తిస్థాయిలో అభివృద్ధి నిలిచిపోయింది , చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయలేని ప్రత్యేక అధికారుల పాలన ఎందుకు? అని ప్రశ్న ప్రతి ఒక్కరి నుండి ఉత్పన్నమవుతుంది, రాష్ట్రంలో ప్రభుత్వం ఉండి ప్రత్యేక పరిపాలన ఎందుకు? వెంటనే సర్పంచ్ ఎలక్షన్లు నిర్వహిస్తే గ్రామ పాలన సజావుగా సాగుతుంది సాగుతుంది.

జెడ్పీటీసీ పసునూరి సరస్వతమ్మను సన్మానించిన మంత్రి కోమటిరెడ్డి

కొండమల్లేపల్లి, జూన్ 22 (జనంసాక్షి) : నల్లగొండ జిల్లా పరిషత్ పాలకమండలి చివరి జనరల్ బాడీ సమావేశం శనివారం ఘనంగా జరిగింది పాలకమండలి ఏర్పడి జూలై 4తో ఐదు సంవత్సరాల కాలపరిమితి పూర్తి కానుంది దీంతో శనివారం జరిగిన జనరల్ బాడీ సమావేశం చివరి సమావేశం అయింది ఈ సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తో పాటు కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొత్తగా ఎన్నికై న ఎంపీలు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు నూతనంగా వచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తోపాటు శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు పాల్గొనున్నారు ఈ సమావేశం జెడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు ఆఖరి సమావేశం కావడంతో సభ్యులు, అధికారులు అందరూ పాల్గొన్నారు ఈ సందర్భంగా కొండమల్లేపల్లి జడ్పిటిసి పసునూరి సరస్వతమ్మ ను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ పసునూరి సరస్వతమ్మను శాలువాతో ఘనంగా సన్మానించి ఆమె చేసిన సేవలకు జ్ఞాపికను అందించారు.

ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించిన మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు

- కరీంనగర్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్

కరీంనగర్ బ్యూరో, (చిగురుమామిడి) జూన్ 22 (జనం సాక్షి) : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని లంబాడి పల్లె గ్రామానికి ఆర్టీసీ బస్ సర్వీస్ ను శనివారం రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్ మాట్లాడుతూ... లంబాడిపల్లె గ్రామం నుండి ముల్కనూర్ మోడల్ స్కూల్ కు దాదాపు 25 మంది విద్యార్థులు వెళుతుంటారని, చిగురుమామిడి బస్టాండ్ నుండి దాదాపు 2 కీ. మీ నడిచి వెళ్లడం ఇబ్బందిగా ఉండేదన్నారు. కుక్కలు , కోతుల బెడదా ఉండేదన్నారు. ఇట్టి విషయాన్ని గ్రామస్తులు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్య పట్ల సానుకూలంగా స్పందించి ఆర్టీసీ అధికారులకు చెప్పగానే అధికారులు యుద్ధ ప్రాతిపదికన రెండు రోజుల్లో బస్ సౌకర్యం కల్పించారన్నారు. చిగురుమామిడి మండలములోని పలు గ్రామాలకు కూడా ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పిస్తామని, గతములో నడిపిన బస్సులను పునరుద్దరిస్తామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారన్నారు. పిల్లల సమస్య పట్ల సానుకూలంగా స్పందించి బస్ సౌకర్యం కల్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ అధికారులకు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంది తిరుపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిటమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, దాసరి ప్రవీణ్, చిటుమల్ల శ్రీనివాస్, గ్రామం శాఖ అధ్యక్షులు సందేవేణి సంపత్, పూదరి వేణు, పోటు మల్లారెడ్డి, బెజ్జంకి అంజయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో అవినీతి!

- తెలంగాణ తల్లి, చొక్కారావు విగ్రహాలు ఏమైనట్టు?
- రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్

కరీంనగర్ బ్యూరో, జూన్ 22 (జనం సాక్షి) : నగర అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ రివ్యూను స్వాగతిస్తున్నామని, కానీ అందులో ఆయన చాలా విషయాలను మరిచి పోయారని, స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా వన్ టౌన్ ఎదురుగా ఉన్న తెలంగాణ తల్లి, మాజీ ఎంపీ చొక్కారావు విగ్రహాలను తొలగించి నేటికీ ఏర్పాటు చేయకపోవడం భాధకరమని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ అన్నారు. కరీంనగర్లోని ఓ పంక్షన్ హల్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ తల్లి, చొక్కారావు ఎక్కడి విగ్రహాలు అక్కడే యధావిధిగా పెట్టించాలని కోరారు. లేకుంటే తెలంగాణ తల్లి విగ్రహాన్ని తామే ఏర్పాటు చేసుకుంటామని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థలో చేసిన అభివృద్ధి అవినీతిమయమైందని స్వయంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రివ్యూలో చెప్పారని అధికారులు తయారు చేసిన డిజైన్లో విగ్రహాలు లేవని అన్నారు. నగర పాలక సంస్థ అవినీతిపై విచారణకు సిట్ ఏర్పాటుతో పాటు మున్సిపల్ పాలక వర్గాన్ని రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాయాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బొమ్మకల్ జంక్షన్ అభివృద్ధికి నిర్ణయం తీసుకున్న మున్సిపల్ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ అభివృద్ధిలో అవినీతి జరిగిందని బండి సంజయ్ ఇదివరకే కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశారని, స్మార్ట్ సిటీ అభివృద్ధిలో ఆయన పాత్ర ఏమాత్రం లేదని అన్నారు. కరీంనగర్కు స్మార్ట్ సిటీ హోదా, నిధులు మాజీ ఎంపీ వినోద్ కుమార్ వల్లే వచ్చాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెంసారం తిరుపతి, రాము, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపు అంచున బంగారు చిలక కిన్నెరసాని నది వంతెన

మట్టి పోయిస్తున్న ఎస్ఐ ప్రవీణ్ ఫైల్ ఫోటో

- కొట్టుకుపోతున్న కట్టమట్టి
- గత ఎస్ఐ ప్రవీణ్ చేపట్టిన తాత్కాలిక పనులతో తప్పిన ప్రమాదం
- సంబంధిత శాఖ అధికారుల చర్యలు శూన్యం

కొత్తగూడెం, జూన్ 22 (జనంసాక్షి) : నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి మండలం బంగారు చిలక లో ప్రవహిస్తున్న కిన్నెరసాని నదిపై ఏర్పాటు చేసిన వంతెన ప్రమాదకరంగా మారింది. నది ప్రవాహానికి గత ఏడాది చాలా ప్రమాదకర స్థితికి చేరింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కిన్నెరసాని నది పొంగి ప్రవహించటంతో బ్రిడ్జి మొదటిలో మట్టి అంతా కొట్టుకుపోయి భారీ ఎత్తున గుంట ఏర్పడటంతో ప్రమాదాన్ని ముందే పసిగట్టిన అప్పటి లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ జై. ప్రవీణ్ ఎలాంటి ప్రమాదం జరగకముందే స్పందించి వందలాది ట్రిప్పుల మట్టిని గుంటలో పోయించి మట్టి కొట్టుకుపోకుండా ఇసుక బస్తాలు వేయించారు. అప్పటినుంచి ఇప్పటిదాకా అధికారులు ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో మొన్న కురిసిన చిన్న వర్షానికి నది పొంగడంతో మరల ప్రమాదకర స్థితికి చేరుకుంది. ఇప్పటికైనా స్పందించకపోతే పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతోపాటు ఏదైనా జరగరానిది జరిగితే అందుకు ఎవరు బాధ్యులంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అయితే బ్రిడ్జి కు మరమ్మతులు చేపట్టకపోవడంతో గత రెండు సం వత్సరాలుగా కురుస్తున్న భారీ వర్షాలకు బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ప్రతి నిత్యం ఈ వంతెన మీదుగా వందలాది వాహనాలు, వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక వర్షాకాలం, ఏ సమయాన భారీ వర్షాలకు బ్రిడ్జి కొట్టుకుపోతాయో అని భయాందోళనలను గ్రామీణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రహదారులు, భవనాల శాఖాధికారులు బ్రిడ్జి కి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా బోళ్ల వెంకటరెడ్డి ప్రమాణం

- పాల్గొన్న రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్లగొండ బ్యూరో, జూన్ 22 (జనం సాక్షి) : నల్గొండ డీసీఎంఎస్ చైర్మన్ గా ఎన్నికైన బోళ్ల వెంకటరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రోడ్లు భవనాలు సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని అభినందించారు. అధికారులు, డిసిఎంఎస్ డైరెక్టర్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఘన స్వాగతం పలికారు.డీసీఎంఎస్ అధికారులు. డీసీఎంఎస్ చైర్మన్ గా ఎంపికైన బోళ్ల వెంకట్ రెడ్డికి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చైర్మన్ చాంబర్ వరకు తీసుకెళ్లి చైర్మన్ సీట్ లో కూర్చోబెట్టి ఎంపిక పత్రాన్ని అందజేశారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.గత కొంతకాలంగా వైస్ చైర్మన్ గా ఉన్న దుర్గంపూడి నారాయణరెడ్డి చైర్మన్గా ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డీసీఎంఎస్ లో ఉన్న డైరెక్టర్లందరూ ప్రస్తుతం కేతపల్లి పిఎసిఎస్ చైర్మన్ గా వ్యవహరిస్తున్న బోళ్ల వెంకట్ రెడ్డిని చైర్మన్ గా ఎన్నుకోవడంతో ఆయన నూతన చైర్మన్ గా నల్గొండ పట్టణంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా పలువురు డైరెక్టర్లు నూతనంగా ఎంపికైన చైర్మన్ బోళ్ల వెంకట్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం నల్గొండ డీసీఎంఎస్ పాలక వర్గంలో చైర్మన్గా బోల్ల వెంకట్ రెడ్డి,వైస్ చైర్మన్ గా దుర్గంపూడి నారాయణరెడ్డి, డైరెక్టర్లుగా గుడిపాటి సైదులు, ధనాపత్ జయరాం,దొంగర వెంకటేశ్వర్లు,నెల్లూరు ఉషారాణి,ఎస్ అనురాధ, కొండ సరిత,కర్నాటి లింగయ్య లు ఉన్నారు.ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో డి సి ఓ కిరణ్ కుమార్ డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ నాగిళ్ల మురళి,సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చిట్యాలలో ఫ్లై ఓవర్‌కు శంకుస్థాపన

- జాతీయ రహదారిపై ఫ్లైఓవర్‌పై భూమిపూజ చేయనున్న మంత్రి కోమటిరెడ్డి
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

చిట్యాల, జూన్ 22 (జనంసాక్షి) : జాతీయ రహదారి 65 పై జరుగుతున్న ప్రమాదాల నివారణకై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన కృషి ఫలించింది. జాతీయ రహదారి 65 చిట్యాల పట్టణంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేడు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా చిట్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తో కలిసి పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత మంత్రి వెంకట్ రెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల గురించి ఎన్‌హెచ్ఏఐ కేంద్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు కేంద్రమంత్రి నితిన్ గట్కరి దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదల చేయించడం జరిగిందని ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఇప్పటివరకు నకిరేకల్ నియోజకవర్గానికి రోడ్ల భవనాల శాఖ నుండి 110 కోట్ల వరకు నిధులు మంజూరు చేశారని, చిట్యాల నుండి నేరడ మీదుగా నల్లగొండకు వెళ్లే రోడ్డు మార్గాన్ని త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని, చిట్యాల నుండి భువనగిరి నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రపోజల్ పంపించడం జరిగిందని అతి త్వరలోనే రోడ్డు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు. శనివారం జరిగిన నల్లగొండ జిల్లా జడ్పీ సమావేశంలో కూడా నియోజకవర్గంలో పలు సమస్యల గురించి ప్రస్తావించడం జరిగిందని ముఖ్యంగా ఫిలాయిపల్లి ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణాలు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నిరంధించాలని కోరానని దానికి మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులను ఆదేశించారని తెలిపారు. పలు గ్రామాలలో సమస్యలు ఉన్నాయని ప్రజలు రైతులు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారని ముఖ్యంగా లోవోల్టేజీ సమస్య గురించి కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో లోవోల్టేజీ పరిష్కారానికి అవసరమైన ట్రాన్స్ఫార్మర్లకి అయ్యే ఖర్చును అంచనా వేసి వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

బొగ్గు బ్లాకులు నేరుగా సింగరేణికే కేటాయించాలి

- వేలంపాటకు వ్యతిరేకంగా 28, 29న ధర్నాలకు సీపీఐ(ఎం) పిలుపు

హైదరాబాద్, జూన్ 22 (జనంసాక్షి) : బొగ్గు బ్లాకులను నేరుగా సింగరేణికే కేటాయించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయడం రాష్ట్రాన్ని అధోగతి పట్టించడమేనన్నారు. రాష్ట్రం నుంచి కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి, హైదరాబాద్‌లోనే ఈ ప్రక్రియ ప్రారంభించటం ఆందోళనకరమన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొనటం ఆశ్చర్యకరమని, ఒకవైపు బొగ్గు బ్లాకును వేలం వేస్తూ, మరొకవైపు సింగరేణిని ప్రైవేటీకరించబోమని మంత్రి కిషన్‌రెడ్డి బుకాయిస్తున్నారని, ఇది ఓట్లు వేసి గెలిపించిన తెలంగాణ ప్రజలను మోసం చేయటమేనని తెలిపారు. తక్షణం వేలంపాట రద్దు చేయాలనీ, రాష్ట్రంలో బొగ్గు తవ్వే సంస్థగా సింగరేణికే బొగ్గు బ్లాకులు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో రెండు ప్రైవేటు సంస్థలకు కేంద్రం కట్టబెట్టిన రెండు బొగ్గు బ్లాకులు కూడా తిరిగి సింగరేణికే అప్పగించాలని కోరారు. ఈ విషయంపై ఈనెల 28,29 తేదీలలో అన్ని జిల్లా కేంద్రాలలో ధర్నాలు చేయాలనీ, వేలాదిగా ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర సంపదను ప్రయివేటు సంస్థలకు కట్టబెడుతున్నదని, రాష్ట్రంలో బీజేపీకి 8 పార్లమెంటు, 8 శాసనసభ స్థానాలిచ్చిన ప్రజలకు వీరు ఇస్తున్న బహుమానం ఇది. బొగ్గు బ్లాకులు ప్రైవేటుపరం అయిన తర్వాత సింగరేణి నష్టాలపాలు చేస్తూ మూతపడే స్థితికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం నెట్టుతున్నదని, మరోవైపు సింగరేణి కూడా వేలంపాటలో ప్రైవేటు సంస్థలతో పోటీ పడాలట! ఇందుకు సింగరేణి యాజమాన్యం సిద్ధపడటం ఆందోళనకరమని, ఒకవైపు నేరుగా ఈ బొగ్గు బ్లాకులు సింగరేణికే అప్పగించాలని చెబుతూనే, మరోవైపు వేలంపాటలో పాల్గొనడానికి రాష్ట్ర కాంగ్రెసు ప్రభుత్వం అనుమతిస్తున్నదని, వేలంపాటలో సింగరేణికి బొగ్గు బ్లాకు దక్కవచ్చు, దక్కకపోనూ వచ్చని, రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా డిమాండ్ చేయటం తగదని అన్నారు. వేలంపాట రద్దు చేయాలనీ, సింగరేణికే బొగ్గు బ్లాకులు నేరుగా అప్పగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం మోడీ ప్రభుత్వం మీద వత్తిడి చేయాలని, అఖిలపక్షాన్ని కూడగట్టి కేంద్రంతో చర్చించాలని, తెలంగాణ గుండెకాయ సింగరేణిని కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రజలను కదిలించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం సింగరేణిని బలహీనపరుస్తున్నది

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

బొగ్గు బ్లాకులు ప్రైవేటుపరం చేస్తూ సింగరేణిని కేంద్ర ప్రభుత్వం బలహీన పరుస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. మరోవైపు సింగరేణిని ప్రైవేటీకరించబోమని కేంద్ర బొగ్గుగనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డి బుకాయిస్తున్నారని అన్నారు. బొగ్గు గనుల వేలంపాట కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొనడం సరైంది కాదని, ఇప్పటికైనా వేలం పాట రద్దు చేసి సింగరేణికే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం మీద వత్తిడి చేయాలని డిమాండు చేశారు.

ఎగతాళి చేయకండి ఎవరినీ...



ఎగతాళి చేయకండి ఎవరినీ...
చులకనగా చూడకండి దేన్నీ...
ఓ నా ప్రియమిత్రులారా..!
చిన్నదే కదాని దేన్నీ
చూలకనగా చూడకండి..!
ఒక అగ్గిపుల్ల కారడివిని కాల్చి
బుగ్గిచేస్తుందని గుర్తుంచుకోండి..!
మొక్కేకదాని పీకెయ్యకండి..!
తోటమాలొకడు మీ పీక
పిసికేస్తాడని గుర్తుంచుకోండి..!
గేటు సైతం తాకలేరని
ఎవరినీ ఎగతాళి చేయకండి..!
ఏకంగా ఒక సునామీలా
ఒక రామబాణంలా
అసెంబ్లీలోకి దూసుకొస్తారని
డిప్యూటీ సిఎం సీటునే కౌవశం
చేసుకుంటారని గుర్తుంచుకోండి..!
అధికారముందని
ప్రతిపక్ష హోదా సైతం
మీకు దక్కనివ్వమని
ఎవరినీ బెదిరించకండి..!
అదికూడా దక్కని చెడు
రోజొటి మన కోసం కాచుకు
కూర్చుందని గుర్తుంచుకోండి..!
ఈ సీటు ఈ చోటు
ఈ కోట ఈ సెక్యూరిటీ కలకాలం
మానదేనంటూ కలలు కనకండి..!
వాటి మీద ఆ దైవం
మరొకరి పేరును వ్రాసిపెట్టి
వున్నాడేమో గుర్తుంచుకోండి..!
ఓ నా ప్రియమిత్రులారా..!
పిచ్చోడికి సైతం ఒక మంచిరోజు
వస్తుందన్నది ఒక పచ్చినిజమని...
అది పరమాత్మ వరమని
మరువకండి..!

పోలయ్య కవి కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్...
9110784502

పదేండ్లలో 70 పేపర్ లీక్‌లు!



దేశంలో గత పది ఏండ్లలో 15 రాష్ట్ర ల్లో 70 పేపర్ లీక్లు కాగా, అందులో 18 దాకా అతి పెద్ద కేంద్రం పరిధి ఉద్యోగాలకు సంబందించినవి!1.5 కోట్ల మంది మీద ఈ ప్రభావం పడింది.నీట్ పేపర్ లీక్ ఇప్పుడు వాడి, వేడి అయ్యింది. గత పది ఏండ్ల బీజేపీ, ఎన్డిఏ పాలనలో, డబుల్ ఇంజన్ సర్కార్ లో ఒక్క రిక్రూట్మెంట్ కూడ సరిగా జరుగలేదు.దేశంలో చదువుకున్న నిరుద్యోగులు 24 కోట్ల మంది వరకు ఉండగా, చదువులు తక్కువ చదివిన వారు, చదువు లేని నిరుద్యోగులు 35 కోట్ల వరకు అదనంగా ఉంటారు. పని దొరికినపుడు ఉపాధి హామీ కూలి పనులు, వలస కూలీలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పనులు, భవన నిర్మాణం పనులు, ఇతర అమాలి పనులు చేసుకుంటు ఉంటారు వీరంతా!

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

22 కోట్ల మంది దరఖాస్తు దారులు!

ఉద్యోగాల నోటిఫికెషన్స్ వచ్చిన సందర్భంగా, ఇతర సమయాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు సుమారు 22 కోట్లు ఉంటారు. 2014 నుంచి 2022 వరకు 80 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చాము అంటున్నారు, కేంద్ర, రాష్ట్ర సర్కార్ల వారు! గడచిన రెండు ఏండ్లలో 8 లక్షల మంది ఉపాధి కోసం, చదువుల పేరిట, చివరికి ఇజ్రాయిల్, రష్యా లాంటి యుద్ధ భూమిలోకి దేశం వదిలి వెళ్లిన వారు ఉన్నారు.ఇదంతా ఉపాధి కోసమే! బతుకు తెరువు కోసమే! దేశంలో ఉపాధి ఉంటే, ప్రాణాపాయం ఉందని తెలిసి కూడ విదేశాలకు ఎందుకు వెలుతారు! దేశంలో ఖాళీలు భర్తీ చేయరు! ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ, ప్రధాని నరేంద్ర మోడీ పది ఏండ్ల ఆయన పాలనలో ఏడాదికి రెండు కోట్ల చొప్పున 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి, కాని పది లక్షలు కూడ ఇవ్వలేదు. ప్రకటించిన ప్రతి నోటిఫికేషన్ అనంతరం పేపర్ లీకులే నాయె! ఒక్క విషయం ను అయినా పీఎం పట్టించుకున్నారా?అసలు యువత ఉపాధి మీద పీఎం శ్రద్ధ ఎన్నడైన చూపారా? పైగా ప్రభుత్వ ఒడి లోని గోది మీడియా అయిన ఆజ్ తక్ యాంకర్ సుధీర్ చౌదరి తో ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం కూర్చుని జీతాలు తీసుకోడానికి మాత్రమే కోరుకుంటారని చెప్పిస్తారు. నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగం ఆశించి కష్టపడి చదివే వారు ఆయన దృష్టిలో పనికి రాని వారని అర్థమా?

40 ఏండ్లలో ఎన్నడూ లేని నిరుద్యోగం!

ఒక వైపు దేశంలో నిరుద్యోగం గత 40 ఏండ్లలో ఎన్నడూ లేని విధంగా పెరిగింది. ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయదు.మూడు ఖాళీలలో ఒక చోట అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగి పని చేసే పరిస్థితి ఉన్నది.పీఎం మోడీ ఎన్నికల్లో ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారం లోకి వచ్చిన తర్వాత, ఆ మాటే ఎత్తడం లేదు! నల్ల ధనం వెలికి తీసి ప్రతి పౌరుడి ఖాతాలో 15 లక్షల రూపాయలు వేస్తామని చెప్పిన పీఎం మోడీ ఆ విషయాన్ని ఒక ముచ్చట చేసే సారు. దేశంలోని 80 కోట్ల మంది పేదలకు,5 కేజీ ల ఉచిత రేషన్ మాత్రమే, అన్నింటికీ పరిష్కారం లా చెబుతూ ఉంటారు, మన పీఎం మోదీజీ!మూడోసారి



బీజేపీ కి ఒంటరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసే మెజారిటీ రాలేదు, ఎన్డిఏ పక్షాల మద్దతు తో తిరిగి మోడీ ప్రధాని అయ్యారు.

ఉపాధిపై శ్రద్ధ చూపాలి!

కనీసం ఈ టర్మ్ లో నైనా, ఉపాధి పై శ్రద్ధ చూపుతారా? లేదా, చూడాలి! బీజేపీ ప్రధాన మిత్రపక్షం అయిన టీడీపీ, జెడియూ లైనా అందుకు సంబంధించి ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తారా? వేచి చూడాలసంఖ్య ఈ పేపర్ లీక్ ల రాజ్యం తో యువత విసిగి పోయి ఉన్నారు. పార్లమెంట్ లో మంచి భారీ సంఖ్య లో ఉన్న కాంగ్రెస్, ఇండియా కూటమి పై విషయాలలో నిలదీస్తుందని, ఆశిద్దాం! కాంగ్రెస్ ఈ సారి ప్రతిపక్ష హోదాలో పార్లమెంట్ లోకి ప్రవేశిస్తున్నది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పైన ప్రజలకు మంచి నమ్మకం ఉన్నది! పీఎం మోడీ ఏకపక్ష నిర్ణయాలకు అవకాశం ఉండదు అనే నమ్మకం ఉన్నది! ప్రజల్లోను మోడీ పేస్ వాల్యూ తగ్గింది. ఇప్పుడు హీరోగా రాహుల్ గాంధీ కనిపిస్తున్నారు. అందుకే ఆయన మీద ప్రజల ఆకాంక్షలు పెరుగు తున్నాయి! అనక తప్పదు!అధికార పక్షం అయినా, ప్రతిపక్షం, విపక్షం అయినా, ముందు పేదోడి జీవనోపాదికి కష్టపడి జీవించే విధంగా అవకాశాలు మెరుగు పర్చే, చూయించే మార్గం కనుగొనండి. అసమానతలు తగ్గించండి! తాత్కాలిక అయిదు కేజీ ల ఉచిత రేషన్ లాంటి పథకాలు,పేదల జీవితాలను మార్చలేవు. అనే విషయాన్ని గుర్తించాలి!

ఉపాధ్యాయ లోకానికి ఆదర్శం గిజూబాయ్

విద్యారంగంలో అత్యంత ప్రధానమైన మూడు ప్రశ్నలు వున్నాయి. అవి ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఎలా నేర్పించాలి? ఈ మూడు ప్రశ్నల పరిష్కారం పైనే విద్య ప్రయోజకత్వం ఆధారపడి వుంది. విద్యకు సంబంధించిన ఏ ప్రణాళికలోనైనా, ఏ పద్ధతిలోనైనా ఈ మూడు అంశాలు తప్పకుండా గమనింపబడాలి. ఈ మూడింటిని చర్చగా సమన్వయ పరచినపుడే ఫలితాలు మంచివిగా మనకందగలవు. ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఈ రెండూ వ్యక్తి అవసరాలు, సమాజ అవసరాలు, దేశ అవసరాలపై ఆధారపడి వుంటాయి. ఈ అవసరాలు కూడా తాత్కాలికమైనవిగాను, శాశ్వతమైనవిగాను రెండు రకాలుగా వుంటాయి. అందువల్ల మనం నేర్పించదలచుకున్న దాని పద్ధతి మారుతూ వుంటుంది. ఈ కారణం చేతే విద్యా ప్రణాళిక కూడా ఎల్లప్పుడూ మారుతూనే వుంటుంది. అలాగే విద్య నియమనిబంధనలు కూడా, పద్ధతులు కూడా, ఫలితాలు కూడా నిర్ధారించటానికి విద్యావేత్తలు, మేధావులు నిరంతరం ప్రయత్నిస్తూ వుంటారు.ఇలాంటి భావాలకు మొదట రూపకల్పన చేసినవారు గిజూబాయి.



నవంబర్ 15, 1885 న జన్మించి తన జీవితాన్ని విద్యార్థులకు,ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా తన అనుభవాలను ఉపయోగించి భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని ఎన్నో అమూల్య సూచనలు, సలహాలతో భారతీయ విద్యావిధానంలో ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఎలా ఉండాలనే విషయాల్ని తెలుపుతూ ప్రత్యేకంగా వసతిని ఏర్పాటు చేసి వాటిని అమలు చేసి ఆదర్శంగా నిలిచిన మహానుభావుడు గిజుబాయి.ఎన్నో సముచిత మార్గాలను ఉపాధ్యాయులకు సూచించి జూన్ 23,1939 న తనువు చాలించిన మహాజ్ఞాని గిజుబాయ్.

సులభమైన భాషలో యథార్థ విద్యాపరిస్థితులను విశ్లేషించడంలో గిజూభాయి సాటి ఎవరూ లేరు. ఆయన ఉపాధ్యాయుల పరిమితులను, ఇబ్బందులను కూడా బాగా అర్థం చేసుకున్న వారు. ఉపాధ్యాయులను బంధించి వుంచిన ఈ వ్యవస్థ కూరత్వం కూడా ఆయనకు బాగా తెలుసు."స్కూలు అనే ఎడారిలో పిల్లలు పడే బాధలు" ఆయన చూడలేక పోయారు. వారి బాధల నివారణకే ఆయన విద్యారంగంలో కొత్త కొత్త ప్రయోగాలు ఆవిష్కరించారు.

పిల్లల వికాసాన్ని దగ్గరగా వుండి చూడడానికి, సూక్ష్మంగా ఆలోచించడానికి తాను అనుకున్న విద్యా విలువలు నిరూపించటానికి ఆయన భావనగర్లో ఒక ప్రయోగశాల రూపంలో 'దక్షిణామూర్తి బాలమందిరం' స్థాపించారు. పిల్లల అవసరాలు, పిల్లల అభిరుచులు, పిల్లల శక్తిసామర్థ్యాలు మున్నగువాటిని గమనంలో పుంచుకుని ఆయన అక్కడ అనేక ప్రయోగాలు చేశారు. తదనంతరం వాటినన్నింటి సారాన్ని 'నూతన శిక్షణ' రూపంలో గిజూభాయి మనకు అందించారు. క్రొత్త దృక్పథం, క్రొత్త చైతన్యం, క్రొత్త జాగృతికి చిహ్నమైన గిజుభయ్ జీవితం అందరికీ ఆదర్శం.

పుట్టినప్పటి నుండి పిల్లలు తమ తల్లిదండ్రుల నుంచి,తమ కుటుంబం నుంచి వారు పడే కష్టాలు, పొందే వేదనలు, బాధలు, దుఃఖాలు ఇన్నీ అన్నీ కావు. పిల్లలు ఎలాంటి నేరగాళ్ళు కారు వారు అత్యంత అమాయకులు అయినప్పటికీ మనం మన అజ్ఞానంచేత, తెలివిలేని తనం చేత, మనకు సాధారణంగా వున్న బలహీనతల చేత, మన పిల్లలనే రాత్రింబవళ్ళు వేధిస్తూవుంటాము.మాటి మాటికీ అవమానిస్తూ, కొడుతూ, తిడుతూ వారి జీవితాన్ని నరకప్రాయం చేస్తూవుంటాము. ఒక్కసారి ఆలోచిద్దాం... మన పిల్లలను మనము చీటికీ మాటికీ తిడుతున్నామా లేదా? కొడుతున్నామా లేదా? చెప్పిన మాట వినలేదని దండిస్తున్నామా లేదా? మరీ మనకు కోపము హెచ్చితే ఇంటి నుంచి వారిని తరిమిగొడుతున్నామా లేదా? వీటికి ఏమైనా హద్దూ పద్దూ ఉందా? సాధారణంగా మన ఇళ్ళల్లో పెద్దవాళ్ళమైన మన చేతులే పైన ఉంటాయి. కానీ పాపం పిల్లలు బిక్కు బిక్కుమని అమాయక చూపులతో ఇంటిలోని ఒక మూలలో ఒదిగి పడిఉంటారు.ఇలాంటి కుటుంబాలు కోకొల్లలు.ఇది నాటి కాలపు పరిస్థితి కానీ నేడు మార్పు జరిగింది.అప్పటి ఆలోచన విధానం పై ఆనాటి రచనలు కొనసాగాయి.

అలాంటి అసంఖ్యాకమైన పిల్లలను రక్షించడానికి అన్నట్లు ఆవిర్భవించిన గుజరాతీ మహోపాధ్యాయుడు "గిజూభాయి బధేకా".గుజరాత్ లో పిల్లల మనోహరమైన శిక్షణా సంస్థ స్థాపించి! మాంటిసోరీ పద్ధతిలో నవీన బోధనకు శ్రీకారం చుట్టిన మహానుభావుడు గిజుబాయ్.తల్లిదండ్రులకు, నూతన ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా సుమారు 17 ఉత్తమ పుస్తకాలను రచించారు.వీటిలో బాల మనస్తత్వ శాస్త్రం, వారి పెంపకం, వారి శిక్షణ, ప్రేమపూర్వకంగా వాత్సల్యంతో నిండి ఎలా చేయాలో మనకు ప్రబోధించారు. ఈ పుస్తకాలన్నింటినీ తెలుగు ప్రజలకు, ఉపాధ్యాయులకు అందడం కొరకు తర్జుమా చేసి 7 సంపుటాలుగా రూపొందించి 2010 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి పాఠశాలకు ఉపాద్యాయుల కొరకు పంపిణీ చేశారు.రాజల్ దేసర్ (రాజస్థాన్)లోని మాంటిసోరి బాల శిక్షణా సమితి హిందీలో ప్రచురించిన 17 భాగాల సంకలనంను పాఠకుల సౌలభ్యం కోసం వాటిని 7 సంపుటాలుగా ప్రచురించడం జరిగింది.

గిజూబాయి రచించిన పుస్తకాలలో తల్లితండ్రులకు,తల్లితండ్రుల ప్రశ్నలు, తల్లితండ్రులు కావడం కఠినం,తల్లితండ్రుల తల నొప్పి,ప్రాథమిక పాఠశాలలో భాషాశిక్షణ, ఉపాధ్యాయులు అయినప్పుడు శిక్షణ.. నా భావనలు,ప్రాథమిక పాఠశాలల్లో బోధనా పద్ధతులు,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు,ప్రాథమిక పాఠశాలలో లేఖా వాదనం,మాంటిసోరి పద్ధతి – భాగం–1 ,మాంటిసోరి పద్ధతి – భాగం–2,ప్రాథమిక పాఠశాలల్లో చేతి వృత్తుల శిక్షణ – భాగం–1 ,ప్రాథమిక పాఠశాలల్లో చేతి వృత్తుల శిక్షణ – భాగం–2,కథా బోధనా పద్ధతి,అడుతూ.. పాడుతూ అనేవి ముఖ్యమైనవి.

పుస్తకాలలో 'మాంటిసోరి పద్ధతి', 'పగటికల', 'కథా బోధనా పద్ధతి' అత్యంత విలక్షణమైనవి. విద్యారంగంలో ఈ మూడు పుస్తకాలు చాలా మౌలికమైనవని భావింపబడుతాయి. ఇవి గిజూభాయి విద్యారంగానికి ఇచ్చిన కానుకలుగా గుర్తించబడినది. వీటిలో గిజూభాయి తన మేధస్సును, మనస్సును పూర్తిగా మేళవింపుచేసి రాయడం వల్ల వీటిని చదివిన వారు బాలల శిక్షణను పూర్తిగా అర్థం చేసుకొని వాటిలోని అర్థాన్ని గ్రహించగలిగే ఎన్నోఅంశాలు నిండివున్నాయి. ఇవి బాలల జీవితాలను లోతుగా అధ్యయనం చేయడానికి ఎంతగానో దోహదపడు చున్నాయి. ఈ పుస్తకాలు దేశములోని ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు తమ బాలలకు సంబంధించిన పరిజ్ఞానాన్నీ, శిక్షణా పద్ధతులను సమగ్రంగా అందిస్తాయని, కనుక వీటిని చదివి ,ఆచరణలో పెట్టడం వల్ల తమ పిల్లలను మంచి పద్ధతిలో పెంచుతారని గిజూభాయి ఆశించారు. మన దేశంలో "గిజూభాయి ఐరేకా" బాలల శిక్షణ కొరకు ఒక ఆందోళన ప్రారంభించారు. విద్య అంటే ఆయన దృష్టిలో ఎంతో విస్తృతమైన అర్థం కలిగి, దాన నిర్మాణం, రచన, వ్యవస్థ, సాధన, సంస్కారం మొదలగు ఎన్నో అర్థాలనిచ్చి వ్యక్తి వికాసం పెంపొందించుకుని,అలాగే ఒక వ్యక్తిత్వాన్ని రూపుదిద్దటానికి కూడా అతనిని ఎంతో సంస్కారవంతుడిగా మార్చాల్సి రావడం, అతడి వ్యక్తిత్వం అందంగా, తేజోవంతంగా, మారడమే విద్య అని భావించిన మేధావి

గిజూభాయి ఐరేకా.

ఇటీవలి కాలంలోనే విద్యావేత్తలు విద్యా పద్ధతుల్లో శాస్త్రీయత వుండాలనే దిశగా ఈ ఆలోచించసాగారు. వారు అప్పటి వరకు వున్న అభివృద్ధి చెందిన విద్యా పద్ధతులన్నింటినీ సమీక్షించారు. వీటితో పాటే ఎన్నో క్రొత్త విద్యా పద్ధతులనీ ఆవిష్కరించారు. వాటిని అమలులో పెట్టి ఎన్నో విజయాలు కూడా సాధించారు. ప్రస్తుతం విద్యా రంగంలో విభిన్న బోధనా పద్ధతులు, వాటిలోని మంచి చెడులు – వీటన్నిటి గురించి ఆలోచించడానికే ఈ పుస్తకాలు ఉపయోగపడుచున్నవి. సామాన్యంగా మనస్తత్వ శాస్త్ర సిద్ధాంతాల ఆధారంగానే బోధనా పద్ధతి నిర్ణయింపబడుతూవుంటుంది. అయితే మొత్తంగానే మనస్తత్వ శాస్త్రాన్ని అనుసరించే బోధనా పద్ధతి వుండదు. ఇందులో ఆ శాస్త్రంతో పాటు వ్యక్తిగత భావాలు కూడా సమానంగానే నిండి వుంటాయి. కనుక మనస్తత్వ శాస్త్రం, వ్యక్తిగత వికాసం ఈ రెండింటి సమన్వయంలోనే బోధనా పద్ధతి పునాది పడుతుంది.

ఇళ్ళల్లో తల్లి తన పిల్లవాడితో ఎక్కువ సమయం గడుపుతుంది. అందువల్ల ఆమే వాడికి అత్యంత సన్నిహితురాలు. తన బిడ్డను అర్థం చేసుకోవడానికి ఓర్పు, నేర్పు, శక్తి సామర్థ్యాలు తల్లిలోనే ఎక్కువగా వుంటాయి. స్వర్గీయ గిజూభాయి గారు కూడా తల్లి లాంటి సూక్ష్మ దృష్టితో, మమత నిండిన కళ్ళతో పిల్లలను చూచారు. వారి వ్యక్తిత్వాన్ని జాగ్రత్తగా వికసింపజేసే ప్రయత్నం చేశారు. గిజూభాయి రచనలన్నీ అన్ని దేశ భాషలలోనూ రావలసి వుంది. ఆ రచనలు మన దేశ బాలల శిక్షణకు దిశానిర్దేశం చేసేవి. విద్యకు సంబంధించిన సిద్ధాంతాలను, బోధనా పద్ధతులను అర్థం చేసుకోవాలంటే ఆ రచనలు చదవడం అత్యవసరం. ఇంత కాలం తర్వాత కూడా ఆ పుస్తకాలు ఇందువల్లే ఉపయోగకరంగానూ, సందర్భోచితంగాను వున్నాయి. ఎందుకంటే అవన్నీ ఒక అనుభవం నిండిన ఉపాధ్యాయుడి అనుభవాల నుంచి వెలువడ్డాయి. ఆ కాలం నాటి జాతీయ నేపథ్యంలో, మానవత్వ నేపథ్యంలో ఆ రచనలు చేయబడ్డాయి. కావునా వారి జీవితాన్ని,వారి రచనలు చదివి విద్యార్థితో ఎలా మసలుకోవాలో తెలుసుకొని చిన్నారులను ప్రేమతో చూసుకొని వారిని ఉత్తములుగా తయారు చేస్తారని ఆశిద్దాం.

గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
9963499282
raghupatiraog@gmail.com

ఆలోచిస్తే..?

అంతరంగంలోకి తొంగి చూస్తే..?
ఆలోచిస్తే...?మన
అంతరంగంలోకి
లోతుగా తొంగి చూస్తే..?
ఆ పంచభూతాలే...
ఆ ప్రకృతిలోని
ఆ అదృశ్యశక్తులే...
కోబోలు మనకు...పాఠాలు చేప్పే...
గుణపాఠాలు నేర్పే...గురుదేవుళ్ళు ..!
ఆలోచిస్తే...?మన
అంతరంగంలోకి
లోతుగా తొంగి చూస్తే...?
ఆ చీకటి వెలుగులే...
ఆ సూర్యాస్తమయాలే...
సకల జీవుల
సుఖ జీవనానికి
సూత్రధారులు...
నరుల నడకలకు
మార్గ దర్శకులు...
శక్తిస్వరూపులు...కాబోలు
సదా మనకు స్ఫూర్తిప్రదాతలు..!

పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్
9110784502

అరుంధతీ రాయ్ అక్షరాలు

నర్మదా నదిమీద నాట్యం చేస్తూ,
విస్తాపనుల విలునామాలు
ఆ..... అక్షరాలు !
అడవితో అల్లుకుపోయి
ఆకాశం అంచులదాకా
ఎగభాకుతూ,
ఉప్పొంగే నది అలలమీద
ఊరకలేస్తూ,
అలుపెరగని ఆ...అక్షరాలు,
పచ్చని పైరులమీద ఊరికే
తూనీగలు !
పచ్చిక బైళ్ళమీద వాలే
సీతాకోకచిలుకలు !
గరికపోసలను హత్తుకునే
మంచు బిందువులు !
ఆదివాసీలా అర్థానాధలై
ఆకాశమంతా మెరిసిపోతున్న
అరుంధతీ నక్షత్రాలు !
ఆ.... అక్షరాలు,
మదిలో ఆలాపన ఆవేదనలుగా
–
మన మనసులో వేల ఆలోచనల
సంఘర్షణలై
అక్షరాలు ఐక్యమౌతాయ్ !
ఢిల్లీలో విద్యార్థులకు
పోరు దారులు !
ఘల్లీలో మహిళలకు
షహన్ భాగ్ లు !
యూనివర్సిటీలల్లో
పోరు కెరటాలు
అరుంధతీ అక్షరాలు!
కల్లోల కాశ్మిర్ లో
కావాతులు !
లడ్దాఖ్ లో లాడాయిలు!
భారములా ప్రజల బాధలు!
కార్గిల్ కనుమల
కాంతి రేకలు
అరుంధతీ అక్షరాలు!
పాలకుల ఫాసిజాన్ని
పఠా పంచలు చేస్తూ,
పెట్టుబడుదారుల
గుట్టువిప్పుతూ,
మైనింగ్ మాఫియాలా
మాయలు చెపుతూ,
అంబాని ఆదానీల
అంగల్ల మర్మాన్ని
నిర్మొహమాటంగా నిగ్గుతేలుస్తూ,
సామ్రాజ్యవాదుల
కంచుకోటలను పెకిలించే,
మరఫిరంగులు
అరుంధతీ అక్షరాలు!
ఆయుధాల అమ్మకమే యుద్ధమై,
ఆనాడు ఇరాక్, ఇరాన్
నేడు రష్యా, ఉక్రెన్ –
ఇజ్రాయిల్, పాలస్తినా
యుద్ధ మరణాలు, శరణార్థుల
కన్నీటి దారలు
పలాస్తీనలో ప్రాణాలోదిలిన
పసిపాపల
ముసి ముసి నవ్వులే
అరుంధతీ అక్షరాలు !
జాతీయ అంతర్ జాతీయ
వేదికల్లో ప్రకంపనలే
అరుంధతీ రాయ్ అక్షరాలు!
అక్షరాలను బంధిస్తే
బంధీఖానాలకు బంధువులై
ఉరితాళ్లపై
ఊయలలూ గుతూ
సునామిలై చుట్టేస్తాయ్!
కారు చీకటిలో మినుగురులు
కాదు,
భారతవనిలో అరుణతరాలు
అరుంధతిరాయ్ అక్షరాలు!

-వసంత
(అరుంధతీ రాయ్ పైన ఉపా
కేసును నిరసిస్తూ)

టిపిసిసి లిగల్ సెల్ వైస్ చైర్మన్‌గా తిరుపతి వర్మ

హైదరాబాద్ జూన్ 22 (జనం సాక్షి)

తెలంగాణ ఉద్యమకారులు తిరుపతి వర్మకు కాంగ్రెస్ లిగల్ సెల్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యయారు. ఈ మేరకు లిగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ తిరుపతి వర్మకు నియమక పత్రాన్ని అందించారు. తెలంగాణ జాగృతి స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు తిరుపతి వర్మ పనిచేసశారు. ఇటీవలే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ అస్తిత్వం కోసం న్యాయవాద వృత్తిలో ఉండి, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించారు తిరుపతి వర్మ. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలకు అత్యంత చేరువ కావడంతో ఆరోగ్యానికి స్కీములు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. న్యాయవాదులు సంక్షేమానికి 100 కోట్లు ఇచ్చిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పదములో నడుస్తుందని తిరుపతి వర్మ ఆశాభాగం వ్యక్తం చేశారు. తెలంగాణ సబ్బండ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అభయాస్తం ఎంతో తోడ్పాడు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా పనిచేస్తానని తిరుపతి వర్మ తెలిపారు.

ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీపై హర్షం

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

తాండూరు జూన్ 22(జనం సాక్షి)

రాష్ట్రంలోని రైతులందరికీ గడువులోగా ఏకకాలంలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు రుణమాఫీకి సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే జారీ కానున్నాయని దీని ద్వారా నియోజకవర్గంలో చాలా కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రైతు రుణమాఫీ చేస్తున్నట్లుగా స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు అందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. రైతుల తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర మంత్రిమండలికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు వేయాలని కాలనీవాసుల ఆందోళన

మల్కాజిగిరి, జూన్ 22 (జనం సాక్షి)

మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీ హనుమాన్ నగర్ ప్రధాన రహదారిలో గత 8 నెలల క్రితం సిసి రోడ్ నిర్మాణ పనుల గురించి ఇంజనీరింగ్ అధికారులు రోడ్డును తవ్వి అర్ధంతరంగా నిలిపివేశారు. ఆనాటి నుంచి కాలనీవాసులు, వృద్ధులు, విద్యార్థులు, పాదచారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని శుక్రవారం రోడ్ పై బైటయాంచి ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రోడ్డు తవ్వి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఇంతవరకు రోడ్డు వేయలేదని ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు మోహన్ యాదవ్, కాలనీ అధ్యక్షుడు మహేష్ యాదవ్, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాపాలన కేంద్రాలను ఉపయోగించుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు

మెదక్ బ్యూరో జూన్ 22 (జనం సాక్షి)

ఎన్నికల కోడ్ సందర్భంగా నిలిపివేసిన ప్రజా పాలన సేవా కేంద్రాలు పునః ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మెదక్ జిల్లాచేగుంట ఎంపీడీవో కార్యాలయంలో గల ప్రజా పాలన సేవా కేంద్రాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆగిపోయిన ప్రజాపాలన కేంద్రాలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజాపాలన కేంద్రాలను జిల్లా ప్రజలు సద్వినియోగం

చేసుకోవాలని అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలలో ఉన్న సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ ప్రజా పాలన సేవా కేంద్రాలలో గతంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులలో తప్పొప్పులు ఉన్నట్లయితే ఈ సేవా కేంద్రాల ద్వారా సరిదిద్దుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట చేగుంట మండల అభివృద్ధి అధికారి తదితరులు పాల్గొన్నారు.

రెవిన్యూ అధికారులు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా చేగుంట,చిన్న శంకరంపేట తాసిల్దార్ కార్యాలయాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా పరిశీలించారు. చేగుంట తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్, డి.టి విధులకు హాజరు కాలేదని సిబ్బంది ద్వారా తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెవిన్యూ అధికారులకు సిబ్బందికి తగు సూచనలు చేస్తూ సమయపాలన, విధుల యందు క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు.

మిషన్ భగీరథ ఇంటింటా సర్వే 97%పూర్తి

జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌లపై ఇంటింటి సర్వేలో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి మెదక్ జిల్లా మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల పై ఇంటింటా సర్వే నిర్వహణ తీరును సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నల్లాల సర్వే మండలాల వారిగా ప్రణాళిక బద్ధంగా ఈ సర్వే అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ గూగుల్ మీట్‌లో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య,సంబంధిత ఎంపీడీవోలు,ఎంపిఓలు,మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుండి పాలీసెట్ ధ్రువపత్రాల పరిశీలన

పాలీసెట్ నాగర్ కర్నూల్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. విద్యా రాణి

నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జూన్ 22 (జనంసాక్షి):

తెలంగాణ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న కౌన్సిలింగ్‌లో భాగంగా ఆన్ లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు 23 వ తేది నుండి 25 వ తేది వరకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెంలో గల శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుతుందని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ పాలెం శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. విద్యారాణి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్లాట్ బుకింగ్లో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు ఈ కేంద్రాన్ని ఎంచుకున్న విద్యార్థులు తమ విద్యార్హతలు గల ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు రెండు సెట్లు జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. సర్టిఎ కెట్స్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే విద్యార్థులు పాలిసెట్ ర్యాంకు కార్డు, పాలిసెట్ హాల్ టికెట్, ఆధార్ కార్డు, పదవ తరగతి లేదా సమాన విద్యార్హత క్వాలిఫైయింగ్ సర్టిఫికెట్, నాల్గవ తరగతి నుండి పదవ తరగతి వరకు బోనోఫైడ్ సర్టిఫికెట్స్, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం,ఇ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ లను తీసుకుని హాజరు కావాలని తెలిపారు.

చైతన్య నగర్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్

ఎల్బీనగర్, జూన్ 22 (జనం సాక్షి)

బియన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో బియన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలు మరియు అభివృద్ధి గురించి కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. స్పందించిన కార్పొరేటర్ కాలనీలోని రోడ్డు శుభ్రత వెంటనే పరిష్కారం కావాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగింది మరియు త్వరలోనే ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జలంధర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, సంజీవరెడ్డి, సెక్రటరీ జగదీశ్వర్ రెడ్డి మరియు రంగారెడ్డి జిల్లా బీజేవైఎం సెక్రటరీ పవన్ రెడ్డి, జిహెచ్ఎంసి ఏఈ నరేందర్ తేజ, వాటర్ వర్క్స్ మేనేజర్ రవీందర్ రెడ్డి, జిహెచ్ఎంసి అర్జున్ ఉద్దీన్ జవాన్, రాంచందర్, వాటర్ వర్క్స్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత కాలంలో రోజుకో రకం సైబర్ మోసాలు

- **అవగాహన కల్పిస్తున్న పోలీసులు**
- **సైబర్ నేరగాల చేతిలో డబ్బు పోగొట్టుకున్న బాధితులు**
- **1930 నెంబర్ కాల్ చేసి మీ డబ్బును తిరిగి పొందవచ్చు**

దౌల్తాబాద్ జూన్, 22 (జనం సాక్షి):

తెలంగాణలో ప్రస్తుత కాలంలో రోజుకో రకం సైబర్ మోసాలు వెలుగు చూస్తున్నాయి. సులభంగా డబ్బు సంపాదించేందుకు కొందరు కేటుగాళ్లు మోసాల బాట పట్టారు. మాయమాటలతో అమాయకులను నమ్మించి అందిన కాడికి దోచుకుంటున్నారు. గిఫ్టులు, కేవైసీ అప్డేట్, క్యాష్ బ్యాక్ ఆఫర్లు, ఓఎల్ఎక్స్, లాటరీల పేరుతో చీట్ చేస్తున్నారు. ఎక్కువగా మహిళలు, వృద్ధులనే టార్గెట్ చేస్తూ నేరాలకు పాల్పడుతున్నారు. మహిళలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి వేధిస్తున్నారు. ప్రొఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసి, అసభ్యకరంగా మార్చి ఇతర సైట్లలో, గ్రూపుల్లో పంపకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కొందరు కేటుగాళ్లైతే డేటింగ్ సైట్లలో ఫొటోలు, ఫోన్ నెంబర్ ఇతర వివరాలు పెట్టి మహిళలను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొన్ని మ్యాట్రిమొనీ సైట్ల ద్వారా కూడా సైబర్ నేరగాళ్లు వేధింపులకు పాల్పడుతున్నారు.హనీ ట్రాప్ ద్వారా వృద్ధులను, యువకులను టార్గెట్ చేస్తున్నారు. న్యూడ్ వీడియో కాల్స్ చేయించి డబ్బు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేలా దౌల్తాబాద్ మండలంలోని ఆయా అ గ్రామంలో పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ముతరాజు మాట్లాడుతూ బాధితులకు ప్రత్యేక హెల్ప్‌లైన్ అందుబాటులోకి తీసుకొచ్చారని ఎవరైనా డబ్బులు సైబర్ నెరగల చేతిలో పడ్డ వెంటనే 1930 నెంబర్ కీ కాల్ చేయాలన్నారు. మా అకౌంట్లో నుండి డబ్బులు పోయిన

మరుక్షణమే కాల్ చేస్తే ఆ అకౌంట్ ఓల్డ్ ఉండడం వలన సైబర్ నేరగాడు అమౌంట్ తీసుకోవడానికి రాదని తద్వారా బాధితుడు కోర్టు ద్వారా ఆ అమౌంట్ను తిరిగి పొందవచ్చు అన్నారు. అలాగే తెలియని నంబర్ల నుంచి మెసేజ్‌లు, కాల్స్ వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలనారు. గుర్తు తెలియని ఇంటర్నేషనల్ కాల్స్ లిఫ్ట్ చేయవద్దని కొందరు కేటుగాళ్లు విదేశీ కోడ్ నంబర్ల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని అలాంటి కాల్స్ పట్ల అలర్ట్‌గా ఉండాలని అన్నారు. మెసేజ్‌లు, స్పామ్ కాల్స్ వస్తే వెంటనే బ్లాక్ చేయాలని అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవటం కన్నా.. అప్రమత్తంగా ఉండటం ముఖ్యమని చెబుతున్నారు. అవసరమైతే అలాంటి కాల్స్, మెసేజ్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

కరాటే ధైర్యసాహసానికి, సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం కేఎల్ డిమ్డ్ టూబీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ

మొయినాబాద్, జూన్ 22 (జనం సాక్షి):

విద్యార్థులు కరాటేతో పాటు యోగా ఆసనాలు చేసినప్పుడే శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని కేఎల్ డిమ్డ్ టూబీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ అన్నారు. మండల పరిధిలోని అజీజ్నగర్ గ్రామ సమీపంలో గల కేఎల్ డిమ్డ్ టూబీ యూనివర్సిటీ కళాశాలలో కరాటేతో పాటు యోగా కార్యక్రమాలను వారం రోజులుగా నిర్వహించారు. చివరిరోజు విద్యార్థులందరికి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వైస్ ఛాన్సలర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ శరీరధారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా కరాటే ఆత్మరక్షణకు, వ్యక్తిగతంలో ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ ఆకెళ్ల, డాక్టర్ కోటేశ్వర్రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైకోర్టులో మాకు న్యాయం జరుగుతుంది:మిత్రకృష్ణ

రాజేంద్రనగర్, జూన్ 22 (జనం సాక్షి)

గండిపేట మండం గంధం గూడ సర్వే నెంబర్51లో ఉన్న 9 ఎకరాల 36 గూంటాల భూమి ప్రభుత్వానికి సంబంధించినదికాదని, ప్రైవేటు వ్యక్తులదని మిత్రకృష్ణ పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఇది ప్రభుత్వ భూమి అని.. అధికారులు ఇక్కడ ఉన్న షెడ్లను తొలగించారని తెలిపారు. గత ఐదు దశాబ్దాల నుంచి ఈ భూమి ప్రైవేటు వ్యక్తుల పేర్లపైనే ఉందని, జాగీర్ అని కనిపించగానే ఇది ప్రభుత్వ భూమి అనడం సరైంది కాదని, పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. అన్ని ఆధారాలు, డాక్యుమెంట్లు పరిశీలించిన తరువాతనే కలెక్టర్ హరీష్ మ్యుటేషన్ చేశారని మిత్రకృష్ణ వివరించారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానంలో మాకు న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ఉందని తెలిపారు. పట్టాదారులంతా కలిసి నా పేరుపై జిపిఏ చేశారని వివరించారు. ప్రస్తుత కలెక్టర్ పై ఎవరో ఒత్తిడి తెస్తున్నట్లు అనిపిస్తుందని, నన్ను రాజకీయంగా దెబ్బతీయడానికి మిత్ర కృష్ణ ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ భూమిని ఎవరు చేశారు, నాకు జిపిఏ చేశారో.. వంటి పూర్తి డాక్యుమెంట్లు గౌరవ హైకోర్టులో సమర్పించానని, త్వరలోనే మాకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇది ప్రభుత్వ భూమి కాదని ట్రిబ్యునల్ లో అధికారులు స్పష్టం చేశారని మిత్ర కృష్ణ వివరించారు. త్వరలోనే.. ఈ భూమి మాదే అని హైకోర్టు నుంచి ఆర్డర్ వస్తుంసని, ఆర్డర్ వచ్చాకనే.. తిరిగి ఇక్కడ పనులు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నసీరుద్దీన్ ఖాన్, మహబూబ్ అలీ, షబ్బీర్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల సరఫరా రాకెట్టు గుట్టు రట్టు

1.53 లక్షల ఎండిఎంఏ మత్తు పదార్థం స్వాధీనం

శేరిలింగంపల్లి, జూన్ 22 (జనం సాక్షి) :

గుట్టు చప్పుడు కాకుండా నగరవాసులకు మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న ఓ కరడు కట్టిన నేరస్తుడిని, మత్తుకు బానిసైన నలుగురు వ్యక్తులను సైబరాబాద్ మాదాపూర్ పరిధిలో మాదకద్రవ్యాల నిరోధ విభాగం పోలీసు అధికారులు శనివారం అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించిన ఘటన చోటుచేసుకుంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..నెల్లూరు జిల్లాకు చెందిన గోసంగి వెంకట సాయి చరణ్ అలియాస్ చరణ్ ఉన్నత చదువుల నిమిత్తం కర్ణాటక బెంగళూరుకు వెళ్లి ఇంజనీరింగ్ లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. జల్సాలకు అలవాటు పడి మత్తుకు బానిస అయ్యి తాను మాదకద్రవ్యాలను వినియోగించడమే కాకుండా తనకు తెలిసిన పరిచయాల ద్వారా వాటిని విక్రయిస్తూ గత కొన్ని సంవత్సరాలుగా కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 50 మందికి పైగా రెగ్యులర్ కస్టమర్లను తయారు చేసుకొని వివిధ పద్ధతులలో వారికి మాదకద్రవ్యాలను చేరవేస్తుండేవాడు. ఇందుకోసం తన వ్యవహారమంతా బెంగళూరు నుంచి కొనసాగిస్తూ ప్రైవేటు బస్సు డ్రైవర్లకు కొంత మొత్తం సొమ్మును చెల్లించి హైదరాబాదుకు వెల్లిన తర్వాత సదరు వ్యక్తులు వచ్చినప్పుడు వారికి పార్శిల్లను అందచేయాలని వారికి నచ్చజెప్పి గుట్టు చప్పుడు కాకుండా మాదకద్రవ్యాల సరఫరాను కొనసాగిస్తుండేవాడు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదకద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులు నిందితుడు కోసంగి వెంకట సాయి కదలికలను కనిపెడుతూ శనివారం నగరానికి వచ్చి కొంతమంది డ్రగ్ పెడలర్స్ ను కలిసి మాదకద్రవ్యాలను అందజేయనున్నట్లు గ్రహించి వలపందాలు. అనుకున్నట్టుగానే నగరానికి వచ్చిన వెంకట సాయి చరణ్ ను పోలీసులు నిర్బంధంలోకి తీసుకొని తనిఖీ నిర్వహించగా అతని వద్ద 1.53 లక్షల రూపాయల విలువ చేసే 12.72 గ్రాముల ఎండిఎంఏ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది. దీనిని కొనడానికి వచ్చిన మాదాపూర్ ప్రాంతానికి చెందిన మల్లిక్ లోకేష్ (25), ఎ. సందీప్ రెడ్డి(30), బి రాహుల్ (30), సనత్ నగర్ ప్రాంతానికి చెందిన ఎస్. సుబ్రహ్మణ్యం (25) లను అదుపులోకి తీసుకొని కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా నార్కోటిక్ విభాగం పోలీసులు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మానసిక ఒత్తిళ్లను అలుసుగా తీసుకొని మత్తుకు బానిస కావద్దని, ఒత్తులు ఇప్పటికే కొన్ని వేల కుటుంబాలు చిత్తయ్యాయని... కనిపెంచిన తల్లిదండ్రులను, నమ్ముకున్న కుటుంబాన్ని పక్కనపెట్టి జీవితాలను సర్వనాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

అనతి కాలంలోనే నిందితులను పట్టుకున్నాం

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

మేడ్చల్ జూన్ 22 (జనం సాక్షి)

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జగదంబ జువెలరీ షాపులో ఈనెల 20న జరిగిన దోపిడిలో పాల్పడిన నిందితులను అనతికాలంలో పట్టుకున్నట్లు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సైబరాబాద్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సబరవ సిపి అవినాష్ మహంతి ఐపీఎస్ మాట్లాడుతూ మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 20వ తేదీన జగదాంబ జ్యువెలరీ షాపులో ముగ్గురు నిందితులు దోపిడీకి పాల్పడగా అందులో ఇద్దరిని అరెస్టు చేశామని మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ దోపిడీలో ముగ్గురు నిందితులు పాల్గొని ఇద్దరు షాపులో చొరబడి కత్తితో షాపు యజమానిని పొడిచి, డబ్బులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. నిందితులలో ఒకరు సంచిలో చాకు పెట్టుకుని బుర్కా ధరించి రాగా, మరొకరు హెల్మెట్ ధరించి వచ్చారని అలాగే మరొకరు కాపాలాగా ఉన్నారని అన్నారు. మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి ఆధ్వర్యంలో 16 బృందాలను పోలీసు బలగాలను ఏర్పాటు చేసి నిందితులను అణితకాలంలోనే పట్టుకున్నామని అన్నారు. నిందితులకు గతంలో నేరచరిత్ర కలదని అలాగే నిందితులు బంగారు దుకాణాలను లక్ష్యంగా చేసుకొని రెక్కీ నిర్వహించి మరి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. అనంతరం మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి మాట్లాడుతూ పోలీసు బలగాలు 16 బృందాలుగా ఏర్పడి సమన్వయంతో నిందితులను సకాలంలో పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులు ఉపయోగించిన పల్సర్ బైక్ వల్లనే దొంగలు దొరికినట్లు పోలీసులు తెలిపారు. డిసిపి కోటిరెడ్డి కథనం మెరుగు నిందితులు వాడిన బైకును దోపిడీ అనంతరం డబుల్పూర్ చౌరస్తాలో వదిలి నిందితులు పారిపోగా పోలీసులు సీసీ కెమెరాలు ఇన్ అండ్ ఔట్ ఎగ్జిట్లలో పరిశీలించి ఆ బైకు యజమాని ఇంటికి వెళ్లగా ఆ బైకును దొంగలు అపరించుకుపోయినట్లు తాను గతంలోని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు సీసీ కెమెరాలు క్షుణ్ణంగా పరిశీలించి నిందితులను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కోటాడి నజీమ్ అజీమ్



ఎ2 షైక్ సోహెల్

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
23 జూన్ 2024

బాధిత కుటుంబానికి అండగా మంత్రి జూపల్లి

- మొలచింతల పల్లి ఆదివాసీ బాధిత మహిళను పరామర్శించిన మంత్రి
- రూ. 2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించిన మంత్రి
- నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం

నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జూన్ 22 (జనం సాక్షి):

నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మొలచింతలపల్లి తాండకు చెందిన ఆదివాసీ బాధిత మహిళను ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. ఇటువంటి ఘటన బాధాకరమన్నారు. ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. బాధిత మహిళ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చెంచు మహిళపై జరిగిన దాష్టీకాన్ని హేయమైన ఆటవిక చర్యగా అభివర్ణించారు. నలుగురు వ్యక్తులు బాధిత మహిళలపై పాశవికంగా దాడి చేసి అమానవీయంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. నిందితులకు కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పాశవిక ఘటన జరిగిన వెంటనే స్పందించామని.. జిల్లా ఎస్పీతో పాటు ఇతర పోలీసు అధికారులకు ఫోన్ చేసి నిందితులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు. నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, రూ. 2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. వారి ముగ్గురు ఆడపిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్ లో విద్యను అందిస్తామని చెప్పారు.

ఆర్థిక స్వావలంబన దిశగా విద్యా వ్యవస్థను బలపరుస్తాం

పెబ్బేరు మండలంలో మంత్రి జూపల్లి సుడిగాలి పర్యటన

వనపర్తి బ్యూరో జూన్ 22 (జనం సాక్షి)

ఆర్థిక స్వావలంబన దిశగానే రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలపరుస్తాం. అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం పెబ్బేరు మండలంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తోడి మెగా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సుడిగాలి పర్యటన చేశారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్, ఆశయ సాధనను కొనసాగించాలన్నారు. మండల పరిధిలోని సుగూరు గ్రామంలో నూతనంగా చేపట్టిన డా. బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి,జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ,,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కొరకు స్ఫూర్తి పొందాలని ప్రజలను సూచించారు. విద్యా ప్రమాణాలకు పెద్దపిట్ట వేశారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సమాజంలో గౌరవం, ఆర్థిక స్వావలంబన సాధించడానికి విద్య ఒక్కటే మార్గమని చెప్పారు. పేదవారు సైతం ప్రైవేట్ స్కూల్ లో పిల్లలను చదివించి లక్షల రూపాయలు దారపోస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన ఉపాధ్యాయులు లేక నాణ్యమైన విద్య ఉండదని, అదే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. పాఠశాలలకు అన్ని మౌలిక సదుపాయాలు సైతం సమకూర్చిన్నందున తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించి గొప్ప వారిని చేయాలని సూచించారు. స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ, భావి తరాలకు అవసరాలు ఉంటాయి అనేది అంబేద్కర్ ఆ రోజుల్లోనే తెలుసుకొని దానికి అనుగుణంగా రాజ్యాంగం రాశారని కొనియాడారు. సుగురు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గ్రామానికి అవసరమైన మౌళిక వసతులు, నల్లవాగు చెరువు కట్ట పనులు, ఇతర సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు పెబ్బేరు మండల అభివృద్ధి కార్యాలయంలో మండల సమావేశాన్ని నిర్వహించారు. మండల సమావేశాన్ని నిర్వహించి ప్రజాప్రతినిధులను కులమాల శారదలతో సన్మానించారు. అనంతరం 40 మంది కళ్యాణ లక్ష్మి, శాదిముబారక్ లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి ఎంపిపి శైలజ, కురుమూర్తి జడ్పీటీసీ పద్మా వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ కరుణ శ్రీ సాయినాథ్, వైస్ చైర్మన్ కర్రె స్వామి, కాంగ్రెస్ నాయకులు రాజేంద్రప్రసాద్ అక్కి శ్రీనివాస్ గౌడ్, సుగురు మాజీ సర్పంచులు వెంకటస్వామి, కొత్త సుగురు వెంకటేష్, వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్ ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు..

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- ప్రతి పిర్యాదు పట్ల స్పందిస్తాం
- ప్రజలకు 24 గంటలు అందుబాటులో పోలీస్
- విలేఖరుల సమావేశంలో జిల్లా ఎస్పీ తోట శ్రీనివాస రావు

గద్వాల నడిగడ్డ, జూన్ 22 (జనం సాక్షి)

జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ ప్రజల భద్రత ప్రధాన లక్ష్యంగా పని చేస్తామని జిల్లా ఎస్పి తోట శ్రీనివాస రావు అన్నారు. జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఎస్పి మాట్లాడుతూ జిల్లా పరిధిలోని సామ్యాసుడిని దృష్టిలో పెట్టికోని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ వుంటుందని, శాంతి భద్రతల విషయంలోను కఠినంగా వుంటామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, విద్వేషాలను రెచ్చగోట్టేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాము అని అన్నారు. మహిళలు రక్షణ కోసం, మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతామని, అలగే దొంగతనాల నిరోధానికి మరిన్ని సిసి కెమేరాలు ఏర్పాటు చేయించడంతో పాటు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందుకు ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చొరవ తీసుకుంటానని అన్నారు. చెడు పనులను ఎవరు ప్రోత్సహించిన ఉపేక్షించేది లేదని ఎస్పీ అన్నారు. ఈ మీడియా సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా ప్రధాన జడ్జి అబ్దుల్ రఫీ.

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని నారాయణపేట జిల్లా జడ్జి అబ్దుల్ రఫీ అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శని వారం జిల్లా కోర్టులో జరిగిన కోఆర్డినేషన్ మీటింగ్ లో సెప్టెంబర్ 14న జరగబోయే 3వ జాతీయ లోక్ అదాలత్‌ను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడాతు జూన్ 8 న జరిగిన లోక్ అదాలత్‌లో నిర్దేశించిన కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ప్రధాన న్యాయ మూర్తి అభినందించారు. సెప్టెంబర్ 14 న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించబడుననీ పోలీస్ అధికారులకు తెలిపారు. ఈ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే కేసులు త్వరగా పరిష్కారమై సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ లోనూ ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజలు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని తమ తమ కేసులను రాజ మార్గం ద్వారా, పరిష్కారం పొందేలా చూడాలన్నారు. రాజీమార్గం ద్వారా అధిక సంఖ్యలో కేసులను పరిష్కారం చెయ్యాలని, కోర్టులో ఇదివరకు పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఇంతకు ముందు నిర్వహించిన లోక్ అదాలత్‌లో జిల్లాలోని మహబూబ్ నగర్, జోగులాంబ గద్వాల్, వనపర్తి జిల్లాల కంటే ఎక్కువ కేసులను పరిష్కరించి మన జిల్లానే ముందు వరుసలో ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. సెప్టెంబర్ 14 న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో కూడా మిగతా జిల్లాల కంటే ఎక్కువ కేసులను పరిష్కరించే విధంగా పోలీసు అధికారులు ఇప్పటి నుంచే ప్రతి రోజు రెండు, మూడు కేసులను పరిష్కరింప చేసేందుకు ముందస్తు ప్రణాళికతో తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లాలోని మొత్తం 14 పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న సివిల్, క్రిమినల్ కంపోండబుల్, సైబర్ క్రైమ్స్, హిట్ అండ్ రన్ కేసులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని వచ్చే లోక్ అదాలత్‌లో త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జ్ జి శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఉమర్, జకీయా సుల్తానా, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆకుల బాలప్ప, సురేష్ కుమార్, విజయ భాస్కర్, జిల్లాకు చెందిన సిఐలు, అన్ని పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీరో బిల్లులు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్ మిట్టల్

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కింద అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మాయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. శనివారం మరికల్ ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ నిర్వహణ తీరును, అధికారులు, ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం కార్యాలయంలోని ప్రజా పాలన ఆన్ లైన్ సర్వీస్ సెంటర్‌లో జీరో విద్యుత్ బిల్లు రాని వినియోగదారుల వివరాలను కంప్యూటర్‌లో ఎలా నమోదు చేస్తున్నారో పర్యవేక్షించారు. వచ్చే నెల నుంచి అర్హులైన వినియోగదారులందరికీ జీరో విద్యుత్ బిల్లు వచ్చేలా సమగ్ర వివరాలన్నింటిని అన్ లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఆయన వెంట మరికల్ ఎంపీడీవో పావని, కార్యాలయ అధికారులు ఉన్నారు.

డ్రైనేజీ ఫుల్ పారిశుద్ధ్య సేవలు నిల్

- తుక్కాపూర్ గ్రామపంచాయతీలో కంపు కొడుతున్న డ్రైనేజీ వ్యవస్థ
- పట్టించుకోని అధికారులు

కొల్చారం జూన్ 22 (జనం సాక్షి)

కొల్చారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు కొనసాగుతున్నాయి. గత కొంతకాలంగా తుక్కాపూర్ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో మురికి కాలువలు ఎక్కడికక్కడ పేరుకుపోయి దురుగంధం వెదజల్లుతున్నాయి. దోమలు స్వైర విహారం చేయడంతో గ్రామస్తులు వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామాలు పరిశుభ్రంగా చూసుకోవలసిన పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కౌలు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- గుర్తింపు కార్డులు ,రుణాలు ఇవ్వాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22 (జనం సాక్షి)

కౌలు రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ కౌలు రైతుల సంఘం రాష్ట్ర గొల్లపల్లి జయరాజు అన్నారు. శనివారం సంగారెడ్డి కేకే భవన్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి అరగంటకూ ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారని, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షా 67 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో 60శాతం మంది కౌలు రైతులేనని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులను గుర్తిస్తామని, పంట బీమా ఇస్తామని వాగ్దానం చేసి వాటిని అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో గత ప్రభుత్వం కౌలుదారులను గుర్తించి కార్డులు ఇచ్చి ఎకరాకు రూ.7500 ఖాతాల్లో జమ చేసిందన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ,రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు . ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించిన బీజేపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి. చెప్పారన్నారు. రైతాంగ పోరాటాలు జరిగిన రాష్ట్రాల్లో ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బ తగిలిందని, 20 శాతం ఓట్లను కోల్పోయిందని చెప్పారు. ఆ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని న్యాయమైన హక్కుల సాధన కోసం కౌలు రైతులు సంఘటితంగా పోరాడి హక్కులను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కే.రాజయ్య, బి నర్సింహ రెడ్డి వ్యకాస జిల్లా కార్యదర్శి యం.నర్సింలు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని వాణిజ్య షాపులు కు లైసెన్సులు తీసుకోవాలి

నాగర్ కర్నూల్ ఆర్సీ జూన్ 22(జనం సాక్షి):

నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వాణిజ్య షాపులకు సంబంధించిన లైసెన్సులు తీసుకొని పట్టణాభివృద్ధికి సహకరించాలని నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ కమిషనర్ నరేష్ బాబు పట్టణ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, పట్టణంలో ఉన్న షాపుల యజమానులు లైసెన్సులు తీసుకోవాలని అన్నారు. ఇందుకు సంబంధించి నాలుగు టీములను ఏర్పాటు చేయడం జరిగిందని, షాపుల వద్దకు వచ్చే పురపాలక సిబ్బందికి సహకరించి షాపులకు సంబంధించిన లైసెన్సులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ యాదయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ మురళి, జూనియర్ అసిస్టెంట్ శివశంకర్ తో పాటు పురపాలక సంఘ సిబ్బంది ఉన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి..!

- నాగర్ కర్నూలు పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి
- నాగర్ కర్నూల్ శాసనసభ్యులు కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి
- అచ్చంపేట శాసన సభ్యులు డాక్టర్ వంశీకృష్ణ

నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,జూన్ 22(జనం సాక్షి):

నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట శాసన సభ్యులు డాక్టర్ వంశీకృష్ణలతో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌ను కలవడానికి విచ్చేయగా జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్, పార్లమెంట్ సభ్యులకు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలోని వివిధ సమస్యలపై కలెక్టర్‌తో, నీటిపారుదల వైద్య ఆరోగ్య, విద్య, పౌరసరఫరాలు, విద్యుత్ శాఖల అధికారులతో వారు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు అధికారులతో మాట్లాడుతూ, వైద్య రంగానికి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది అని , జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కావలసిన వసతుల ఏర్పాట్ల రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి బడ్జెట్, సిబ్బంది నియామకం అంశాలపై చర్చించి, ఏర్పాటు చేస్తామన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో 27 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 340 ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి త్వరితగతిన ఖాళీల నియామకాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై నీటిపారుదల అధికారులతో సమీక్ష జరిపారు. జిల్లాలో కల్వకుర్తి డిండి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఉన్న ఏఏ ప్రాజెక్టుల్లో ఎంతవరకు పని జరిగిందని, అందుకు పూర్తి చేసేందుకు కావలసిన బడ్జెట్ తదితర అంశాల వారిగా నివేదికలు తయారు చేయాలని, జిల్లాలో సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేసేందుకు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి జిల్లా ప్రజలకు త్రాగునీరు, ప్రతి ఎకరానికి సాగు నీటిని ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేలా ప్రధానంగా జిల్లాలో ప్రాజెక్టు అంశంపై పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని నీటిపారుదల శాఖల ఆదేశించారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఎంత మంది తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారు. ఇప్పటివరకు ఎన్ని కుటుంబాలకు ప్రభుత్వ సబ్సిడీతో సిలిండర్ అందుతుందని, డీఎస్ఓను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎన్ని కుటుంబాలకు ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సిలిండర్లు అందాల్సి ఉందని, అందుకు పూర్తి నివేదికలను రూపొందించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, ఇంకా జిల్లాలో లబ్దిదారులైన ఎన్ని గృహాలకు 200 యూనిట్లు అందించాల్సి ఉందని విద్యుత్ శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని శాఖల అభివృద్ధి నివేదికలపై అధికారులతో త్వరలో పూర్తిస్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని, అందుకు అనుగుణంగా శాఖల వారీగా సమగ్రస్థాయిలో నివేదికలను రూపొందించి, జిల్లా స్థాయిలో నిర్వహించే సమీక్షకు హాజరు కావాలని వారు కోరారు.

మంత్రి కొండ సురేఖను కలిసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

దౌల్తాబాద్ జూన్ 22(జనం సాక్షి)

తెలంగాణ సెక్రటేరియట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కలిసి దుబ్బాక నియోజకవర్గం పలు అభివృద్ధి పనులు, దుబ్బాక మున్సిపల్ పెండింగ్ నిధుల గురించి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గొడుగుపల్లి మాజీ ఎంపీటీసీ మద్దెల స్వామి, టిపిసిసి స్టేట్ సోషల్ మీడియా సెక్రటరీ గణేష్ పంచమి, దొమ్మట గ్రామ అధ్యక్షుడు స్వామి, మైనార్టీ నాయకులు అభిద్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కార్యాలయాన్ని సందర్శించిన నామాజీ

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):

నారాయణపేట మండలం కోటకొండ లో బిజెపి కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేసిన అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర నేత నాగురావు నామాజీ డిమాండ్ చేశారు. శనివారం ఆయనతో పాటు జిల్లా బిజెపి అధ్యక్షుడు పి.శ్రీనివాస్,ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కెంచే.శ్రీనివాస్, మండల నాయకులు సాయిబన్న,కొంగరి రాములు పార్టీ కార్యాలయాన్ని సందర్శించి ధ్వసం అయిన ఫర్నిచర్ ను పరిశీలించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శుక్రవారం జరిగిన ఏరువాక కార్యక్రమంలో కొందరు తాగుబోతులు పంచాయితీలో పనిచేస్తున్న చంద్రప్పపై దాడి చేశారని తెలిపారు. దాంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఆ కక్షతో శనివారం ఉదయం తాగుబోతు గ్యాంగ్ తిరిగి చంద్రప్ప పై దాడి చేయడమే కాక ఎస్సీ వాడలో ఇల్లిల్లూ తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. కొందరు ఎస్సీలు బిజెపి కార్యాలయంలో తలదాచుకోగా విషయం తెలుసుకుని పార్టీ కార్యాలయం తలుపులు ధ్వంశం చేసి వారిపై దాడి చేసి తీవ్రంగా గాయరిచారనీ తెలిపారు. వారంతా పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ సంఘటన వివరాలను ఎస్సీ, సిఐ, డిఎస్పీ, ఎస్పి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దోషులపై చర్యలు తీసుకుంటామని అన్నారని వివరించారు. చర్యలు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని తీవ్ర స్థాయిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

'మిళింద'తో కాసేపు

మానస ఎండ్లూరి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార్ గ్రహీత ఒక నెలలో ఏడు కథలతో సాహితీ లోకంలోకి దూసుకొచ్చిన నవకెరటం మానస ఎండ్లూరి. తాను చదివిన సాహిత్యంలో తను కనిపించకపోవడం ఆమెను కలం అందుకునేలా చేసింది. తెలుగు సాహిత్యంలో తన సమూహ జీవితానికి చోటు కల్పించింది. ఆ జీవితాల కథల సమాహారం 'మిళింద'. తాను చెప్పాలనుకున్న విషయం స్పష్టంగా, సూటిగా చెప్పే మానస సాహితీ స్వరం ప్రత్యేకమైనదని, భిన్నమైనదని కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తించింది. యువ పురస్కారం ప్రకటించింది. రచయితగా, సంపాదకు రాలిగా, సాహిత్య విమర్శకురాలిగా, చిత్రకారిణిగా బహుముఖంగా ఎదుగుతున్న మానస ఎండ్లూరి మంచి వక్త, గాయకురాలు కూడా. మానస దృక్పథంలో సాహిత్య, సామాజిక అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.



కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్న మీకు హార్దిక అభినందనలు. సాహిత్యంలోకి వెళ్ళేముందు మీ గురించి చెబుతారా? అమ్మ సొంత ఊరైన నెల్లూరులో పుట్టాను. నాన్నది హైదరాబాద్. ఆయన ఉద్యోగరీత్యా రాజమండ్రిలోనే పెరిగాను. ఏలూరు సెయింట్ థెరెస్సా మహిళా కళాశాలలో సైకాలజీ, ఆంగ్ల సాహిత్యంలో డిగ్రీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో భాషాశాస్త్రంలో పీజీ చేశాను. ప్రస్తుతం విహంగ మహిళా సాహిత్య పత్రిక సంపాదకురాలిగా ఉన్నాను.

సాహిత్యంతో పరిచయం ఏ వయసులో జరిగింది, ఎలా?

నా తల్లిదండ్రులు కీ.శే. డా. పుట్ల హేమలత, ఎండ్లూరి సుధాకర్ ఇద్దరూ చిన్న వయసులోనే రచనలు చేయటం ప్రారంభించారు. దాంతో నేను చిన్నప్పటి నుంచి పుస్తకాలతోనే పెరిగానని చెప్పవచ్చు. సాహితీకారులు ఎంతోమంది ఇంటికి వస్తూ పోతూ ఉండేవారు. అమ్మా నాన్నల రచనలు తరచూ పత్రికల్లో రావడం చూస్తూ పెరిగాను. మీపై బాగా ప్రభావం చూపిన రచయితలు, రచనలు. నేను రాసినవన్నీ అస్థిత్వ రచనలు కాబట్టి ఎవరి ప్రభావం లేదనే అనుకుంటున్నాను. జీవితం చూపించిన అనుభవాలే నా కథలన్నీ. డిగ్రీలో ఉన్నప్పుడు హెన్రీ డేవిడ్‌తోరో రాసిన వాల్డెన్ చదివి అంత సామన్యంగా బతకడం సాధ్యమేనా అని ఆశ్చర్యపోయే దాన్ని. కానీ ఒకరిలా ఉండాలని ఎప్పుడూ తపించలేదు.

కథతో ప్రేమలో ఎప్పుడు పడ్డారు? ఎందుకు రాయాలనిపించింది? మీ కథలకు స్ఫూర్తి? మీ మొదటి కథ, బాగా పేరు తెచ్చిన కథ?

తెలుగు కథలు పత్రికల్లో, సంపుటాల్లో అప్పుడప్పుడూ చదువుతూ ఉండేదాన్ని. ఎక్కడా విరివిగా నేనంటూ కనబడలేదు, వినబడలేదు. బహుశా ఆ అసంతృప్తే నన్ను రచనలెపు నడిపింది. నా కథలకు స్ఫూర్తి నా చుట్టూ ఉన్న జీవితమే. 2015లో మొదటి కథ 'గౌతమి' రాశాను. తెలంగాణా, ఆంధ్ర విడిపోతున్న సమయంలో ఎంతో మానసిక వత్తిడికి లోన్కె రాసిన కథ. నాకు బాగా పేరు తెచ్చిన కథ 'అమ్మకో లేఖ'. ఈ కథ 2016లో 'చినుకు' మాసపత్రికలో వచ్చింది. ఈ కథను హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వారు 'సవలేఖన' అనే కథా సంకలనంలో వేశారు. ఆ కథలన్నీ ఇంగ్లీషుతో సహా పద్దెనిమిది భారతీయ భాషల్లోకి అనువదించబడ్డాయి.

మీ కథల్లో బొట్టు కథలు ఎక్కువగా కనిపిస్తాయి. బొట్టు లేని మొహాలు మనకి మన సమాజంలో చాలానే కనిపిస్తాయి. అవి ముస్లింలవి కావచ్చు, క్రిస్టియన్స్‌వి కావచ్చు. అంతే కాకుండా ఈ రోజుల్లో చాలామంది పెట్టుకోవడం లేదు. కానీ దళిత క్రిస్టియ న్ మహిళల కథలే కనిపిస్తాయి. ఎందుకలా? ఈ మధ్య వచ్చిన "ఊరికి దక్షిణాన", మీ అనువాద నవల. అనువాద క్రమంలో మీరు ఎదుర్కొన్న సవాళ్ళ గురించి చెప్తారా?

స్త్రీవాదం ఇంకా ఉందనుకుంటున్నా రా? అది ఈ మధ్య చాలామంది అంటున్న మాట. మీరేమంటారు? మనిషి ఉన్నంతకాలం స్త్రీవాదం ఉంటుంది. స్త్రీలలో ఉండే పురుషాధిపత్య భావజా లం పోగొట్టుకోవడంలోనే స్త్రీవాదాన్ని నిలబెట్టుకోవడం ఉంటుందని నమ్ముతాను. బహుజన, దళిత, మైనారిటీ స్త్రీల సాహిత్యం బలంగా ఉందా? మరింత బలమైన భావజాలంతో రావలసిన అవసరం కనిపిస్తోందా? ఎనబై, తొంబైలలో ఉన్నంత ఉధృతంగా ఇప్పుడు లేకపోయినా మెర్సీ మార్గరెట్, అరుణ గోగులమండ, నస్రీన్‌ఖాన్, పద్దమ్ అనసూయ వంటి వారు వారి అస్తిత్వ, ఆత్మగౌరవ రచనలు చేస్తున్నారు. అయితే సంఖ్యా పరంగా రచయిత్రులు తక్కువగా ఉన్నారు. వారి సంఖ్య ఎంత పెరిగితే ఈ బలహీన వర్గాలకి అంత బలం చేకూరుతుంది. సమాజాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడంలో, మంచి రచనలు చేయడంలో మహిళల భాగ స్వామ్యం? తెలుగు సాహిత్యంలో మహిళల చోటు ఎక్కడ? తెలుగు సాహిత్యంలో మహిళల చోటును కూడా పురుషులే స్వాధీనం చేసుకుంటు న్నట్లు అనిపిస్తుంటుంది. స్త్రీ ఎలా ఆలోచిస్తుంది, ఆమె మనసు, ఆమెకు ఏం కావాలన్న విషయాలపై పురుషులు ఎక్కువగా కవితలు, కథలు రాయడం ఆశ్చర్యంగా ఉంటుంది. నిజానికి ఎంతోమంది పురుష రచయితలు వారి ఆలోచనల్ని, అస్తిత్వాన్ని రాయడం మాని స్త్రీలపై రాస్తున్నారు. వేదికలు కూడా వారితోనే నిండిపోతున్నాయి. స్త్రీ మరింత బాధ్యతగా రాయాల్సిన అవసరం ఉంది. దళిత మహిళల వ్యథలు, గాథలు రాయాల్సిన బాధ్యత దళిత మహిళలదేనా? దళిత పురుషులది కూడా.

తెలంగాణా, ఆంధ్ర, సీమాంధ్ర నుంచి దళిత రచయతలు ఎన్నో రచనలు చేశారు. ఇప్పుడున్న యువ దళిత రచయితలు కూడా రాస్తున్నారు. దళితేతర రచయితలు రాసినప్పుడు అవి సానుభూతి సాహిత్యంగా మిగిలిపోయే అవకాశం ఉంటుంది. రిజర్వేషన్లు నిచ్చెన మెట్ల కులవ్యవస్థను పెంచి పోషించడమే అన్న వాదనకి మీ స్పందన? కుల వ్యవస్థను కూల్చే బాధ్యత ఎవరిది? కుల వ్యవస్థ వల్ల లాభాలు పొందుతున్నవారి నుంచే ఇటువంటి వాదనలు, వ్యాఖ్యలు వస్తాయి. స్త్రీలకి కూడా ప్రైవేటు రంగంలో ప్రత్యేక రిజర్వేషన్లు ఉండి ఉంటే ఈపాటికి ఎంతో అభివృద్ధి చెందేవారు.



అందర్నీ ఒకే గాటన కట్టేస్తే జోగినీ, ఆదివాసీ, ముస్లిం, గిరిజన, సంచార, దళిత తదితర వర్గాలకు చెందిన వారి గురించి తెలుసుకునే అవకాశం ఉండేది కాదు. ఉదాహరణకి బహుజన సాహిత్యాన్నే తీసుకుంటే రకరకాల కులాలు, కుల వృత్తులు, వారిలో ఉండే విభిన్నమైన జీవన శైలులు తెలిపే రచనలన్నింటినీ కలిపే బహుజన సాహిత్యం అంటాం. అలా వద్దనుకుంటే స్త్రీవాదం ఉండేదా? మరి స్త్రీవాదం అని మనం పురుషుల నుంచి ఎందుకు వేరుబడి రచనలు చేస్తున్నట్టు?

అకాడమీలు ఇచ్చే బహుమతులు, పురస్కారాలు ప్రాంతీయ భాషా సాహిత్య సృజనకు దోహదం చేస్తున్నాయని అనుకుంటున్నారా? ఎలా? కచ్చితంగా చేస్తున్నాయనే చెప్పవచ్చు. కేంద్ర సాహిత్య అకాడమీనే పెద్ద ఉదాహరణ. అలాగే, తెలంగాణా సారస్వత పరిషత్ వారు, ఇతర సాహితీ వేదికలు రచయితలకు పారితోషికం ఇవ్వడం ఒక ప్రోత్సాహమే. పుస్తకాలు అచ్చు వేసుకోవడానికి ఈ గుర్తింపు,ఉత్సాహంతో మరిన్ని రచనలు చేయడానికి ఈ పురస్కారాలు ఉపయోగపడతాయి.

గతంలో మీకు వచ్చిన అవార్డులు, రివార్డులు కేంద్ర సాహిత్య అకాడమీ వారు 2016లో త్రిపురలో, 2018లో అస్సాంలో నిర్వహించిన అఖిల భారత యువ రచయితల సమ్మేళనం కి స్వీయ రచనా పఠనానికి తెలుగు రచయిత్రిగా ఆహ్వానం అందుకున్నాను.

2018లో నా 22 కథలతో 'మిళింద' అనే కథా సంపుటి తెచ్చాను.

2017లో స్మైల్ స్మారక పురస్కారం

2017లో వెంకట సబ్బు స్మారక పురస్కారం

2021లో మాడభూషి పురస్కారం

భవిష్యత్ అంతర్జాల పత్రికలదే. మీ సంపాదకత్వంలో వస్తున్న విహంగ అంతర్జాల పత్రిక భవిష్యత్ రూపం ఎలా ఉండబోతోంది? 'విహంగ' ప్రధానంగా కొత్త రచయితలు, పరిశోధకులపై దృష్టి పెడుతుంది. విహంగకు నెంబర్ ఉండడం వల్ల పరిశోధన వ్యాసాలకు ఒక ప్రాముఖ్యత ఉంటుంది. పత్రిక మొత్తం స్త్రీల అంశాలతోనే నడుస్తుంది. ఇక ముందు కూడా అంతే. ముఖ్యంగా కొత్త రచయిత్రులను పరిచయం చేసే ఉత్సాహంతోనే ఉంటాం. కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీతగా నవతరం రచయితలకు మీరిచ్చే సూచనలు మన జీవితాల గురించి మనం రాయాలి. ఊహించి రాసేవి వాస్తవాల కంటే ఎక్కువ థ్రిల్ ఇవ్వవు. నీ గురించి, నీ మూలాల గురించి నువ్వు నిజాయితీగా రాసినప్పుడే నువ్వు విలక్షణంగా కనిపిస్తావు.

చివరగా మీరు మంచి పాఠకులా? రచయితా? నేను మంచి రచయితనా కాదా అన్నది నా పాఠకులు చెప్పాలి. జీవితాన్ని సరిగ్గా చదువుతున్న మంచి పాఠకురాలినే. విహంగ అంతర్జాల పత్రిక ముఖ చిత్రాలతో పాటు, తన అనువాద నవల 'ఊరికి దక్షిణాన' పస్తక ముఖచిత్రంతో చిత్రకారిణిగా కూడా పరిచయమైన మానస ఎండ్లూరి గారు భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలు అందుకోవాలని కోరుకుంటూ ధన్యవాదాలు.

బిఆర్ఎస్ నాయకులు కావాలనే లేనిపోని ఆరోపణలు

ఇచ్చిన మాట ప్రకారం రైతులకు 2లక్షల రుణమాఫీ హర్షణీయం
గతంలో రైతులకు లక్ష రుణమాఫి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే
ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో అబివృద్ధిపరుగులు
కాంగ్రెస్ పార్టీ నేతలు

తాండూరు జూన్ 22(జనంసాక్షి) : మార్కెట్ కమిటీ రీజర్వేషన్‌లపై బిఆర్ఎస్ నాయకులు కావాలనే లేనిపోని ఆరోపనలు తగదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖండించారు.శనివారం తాండూరు పట్టణం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న ,డిసిసిబి చైర్మన్ రవిగౌడ్, యాలాల పిఎసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ .మార్కెట్ కమిటి రిజర్వేషన్ల పై.పచ్చి కామెర్లు ఉన్నోడికి లోకమంతా పచ్చిగానే కనిపిస్తుందన్నట్టుగా, బి ఆర్ ఎస్ నాయకుల ఆరోపనలు తగదన్నారు. ఎమ్మెల్యే నాయకత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా బ్రహ్మాండమైన పాలన సాగుతూ ఉంటే చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు మార్కెట్ కమిటీపై తప్పుడు ప్రచారం చేయడం జరుగుతుందన్నారు.ఈ వేదిక నుంచి తప్పుడు ప్రచారం చేస్తున్న నాయకులకు మీము తెలియజేయడం ఏమిటంటే రిజర్వేషన్ ఏది ఉందో తెలుకోలేనంతగా మీము లేమని అనుకోవడం మీ సిగ్గు చేటు అన్నారు.

కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర కల్గిన పార్టీ అందులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అపారమైన అనుభవం ఉన్న వ్యక్తి ఎవ్వరికి ఎప్పుడూ ఏ పదవి ఇవ్వాలో బాగా తెలిసిన వ్యక్తి. మర్కెట్ కమిటీ రిజర్వేషన్ల పై తప్పుడు ప్రచారం చేస్తూ అసత్యాలు ప్రచారం చేస్తున్న నాయకులు గమనించాలన్నారు. బిసి- బి నుండి బి-డి కి మారిన విషయం తెలుసుకోలేక పోవడం మీ తెలివి తక్కువ తనానికి నిదర్శనం అన్నారు. ఏది ఏమైనా రాష్ట్రం లో మార్పు మొదలైందన్నారు. ముఖ్యంగా మన తాండూర్ మరింతగా మార్పు స్పష్టంగా కనిపిస్తుందన్నారు.

గతంలో మాదిరిగా కాకుండా ఎమ్మెల్యే స్వయంగా ప్రజల వద్దకు వెళ్ళి సమస్యలు వింటున్నారు. పార్టీలు ఎవి అని చూడకుండా ఎవరైనా హాస్పిటల్ లో ఉంటే ఎల్ఎస్సీలు ఇస్తున్నారు, వారి ఆరోగ్యానికి అండగా ఉంటున్నారని చెప్పవచ్చున్నారు.అదేవిధంగా శుక్రవారం క్యాబినెట్ మీటింగ్ లో రైతు రుణమాఫీ పై ముఖ్యమంత్రి స్పష్టంగా 2 లక్షల వరకు రైతురుణమాఫీ చేయడం జరుగుతుందని చెప్పడంచాలా సంతోషకరమైన విషయం అన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రులకు మా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కి తాండూర్ రైతుల తరుపున ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది రాష్ట్రంలో రైతులకు మంచి రోజులు వచ్చాయని వేల్లడించారు. గతంలో లక్షరూపాయలు రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వతమే ఇప్పుడు 2 లక్షల రూపాయలు కూడా రుణమాఫీ చేస్తుంది.కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని రైతులు గమనించలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు ,విజయ దేవి ,ప్రవీణ్ ,ప్రభాకర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు అబిబ్ లాల, నాయకులు జుబెర్ లాల,నాగు, నర్సిరెడ్డి, తదితరులు ఉన్నారు.

పదేళ్లు పందికొక్కుల మెక్కి..

కాంగ్రెస్‌పై విమర్శలా?

- **హౌసింగ్ బోర్డ్ స్థలం లీజుకు తీసుకొని సబ్ లీజుకు ఇచ్చే బ్రోకర్లు**
- **ఫిష్ మార్కెట్లో బెస్త సోదరుల కడుపు కొడుతుంది బిఆర్ఎస్ చోటామోటా నాయకులే**
- **అంబేద్కర్ నగర్ వద్ద టిప్పర్ల దారుల వద్ద మామూళ్లు వసూలు చేసేది మీరు కాదా?**
- **కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు**

కూకట్ పల్లి జూన్ 22(జనంసాక్షి): గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడి ప్రజల రక్తం పిలుస్తూ అక్రమ సంపాదనకు తెగబడ్డ బిఆర్ఎస్ నేత అఘోరా సామాన్య ప్రజలను పట్టిపీడించి వినకపోతే వారి పై కేసులు పెట్టించిన వైనం అఘోరది కాదా, అక్రమ నిర్మాణాల దగ్గర అందరినీ మేనేజ్ చేస్తా అంటూ లక్షలు దండుకొని తన పబ్బం గడుపుకున్న మాట నిజం కాదా, ఇంకా చెప్పుకుంటూ పోతే అఘోరావి ఇంకా ఎన్నో ఘోరాలు ఉన్నాయని సమయం వచ్చినప్పుడు ఇంకా దాగి ఉన్న నిజాలను ముందుకు తెస్తాం, అఘోర దగ్గర ఎంగిలి మెతుకులు తినే సాయి, రాజేష్ రాయ్‌లు కూకట్పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డిని విమర్శిస్తారా అని కెపిహెచ్‌బి డివిజన్ కాంగ్రెస్ నాయకులు నాగ మల్లేశ్వరరావు, అరవింద్ రెడ్డి, మేకల మైఖేల్‌లు విమర్శించారు. గత పదేళ్లుగా టిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అక్రమ సంపాదనకు తెగబడి కోట్లాది రూపాయలు సంపాదించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ నెక్సస్ మాల్ సమీపంలో హౌసింగ్ బోర్డ్ స్థలం లీజుకు తీసుకొని సబ్ లీజుకు ఇచ్చింది మీరు కాదా అని ప్రశ్నించారు. బెస్త సోదరులకు సంబంధించిన ఫిష్ మార్కెట్లో బినామీ పేర్లతో స్టాల్స్ తీసుకొని వారి వద్ద అక్రమంగా వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. అంబేద్కర్ నగర్ వద్ద టిప్పర్ల వద్ద మామూళ్లు వసూలు చేస్తూ చివరకు రోడ్డు పక్కన నర్సరీలు పెట్టుకునే అమాయకుల వద్ద కూడా అక్రమ వసూళ్లు చేసింది టిఆర్ఎస్ నేతలు కాదని ప్రశ్నించారు. భవిష్యత్తులో టిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం పై నాయకులపై విమర్శలు చేస్తే అఘోర తోపాటు వారి బినామీలైన జన్ను సాయి, రాజేష్ రాయ్‌ల అక్రమ దందాల వివరాలతో విలేకరుల సమావేశం పెడతామని హెచ్చరించారు.

డబ్బుల కోసం గొడవపడి అన్నను హత్య చేసిన తమ్ముడు

మోమిన్ పేట జూన్ 22 (జనం సాక్షి) : తమ ఇంట్లో నుంచి అన్న డబ్బు దొంగతనం చేశాడని తమ్ముడు తన సొంత అన్నపై దాడి చేసి హత్య చేసిన సంఘటన మోమిన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత కోల్కొంద గ్రామంలో జరిగింది. మోమిన్‌పేట ఎస్‌హెచ్‌ఓ అరవింద్ తెలిపిన వివరాలు ప్రకారం శుక్రవారం రాత్రి మోమిన్ పేట మండలం పాత కోలుకుంద గ్రామానికి చెందిన బండారి రాజశేఖర్ రోజువారి పనులు నిమిత్తం బయటకెళ్ళి పనులన్నీ ముగించుకొని రాత్రి ఇంటికొచ్చేసరికి తన ఇంట్లో ఉన్న డబ్బులు కనిపించడం లేదని తన అన్న బండారి శ్రీనివాస్ (35) మృతుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ గొడవపడ్డారు. వారి గొడవను చూసి పెద్దన్న నర్సింలు కల్పించుకొని వారిద్దరికీ సమాధాన పరచడంతో వారి ఇరువురు ఎవరి ఇళ్లకు ఆరు వెళ్ళిపోయారు అనంతరం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో రాజశేఖర్ కర్రతో వచ్చి మళ్లీ గొడవ పడ్డారు ఈ గొడవలో బండారి శ్రీనివాస్‌కు కాళ్లకు తలకు కట్టేతో కొట్టడంతో బలమైన రక్త గాయాలు అయ్యాయి. రాత్రిపూట అవడంతో శనివారం ఉదయం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు మృతుని భార్య స్వప్న ఫిర్యాదు మేరకు మోమిన్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హెచ్ ఓ అరవింద తెలిపారు

"చెంచు మహిళపై దాష్టీకమైన దాడి జరిగింది. నిందితులను చట్టప్రకారం శిక్షిస్తాం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. ఇలాంటివి జరగడం బాధాకరం. బాధిత కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటాం. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిస్తాం. ప్రభుత్వపరంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం."

- జూపల్లి కృష్ణారావు, మంత్రి

రూ.25 లక్షలు చెల్లించాలి

బాధితురాలు ఈశ్వరమ్మ ఫ్యామిలీకి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని చైతన్య మహిళా సంఘం కో కన్వీనర్ శ్రీదేవి డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. గిరిజన మహిళపై దాడికి పాల్పడిన వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కస్తూరి, శాంతమ్మ పాల్గొన్నారు.

చెంచు మహిళపై దాష్టీకం

నిందితులను వదిలేది లేదు : జూపల్లి

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ తాలూకా మొలచింతలపల్లిలో ఆదివాసీ కుటుంబంపై పాశవిక దాడిపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడికి పాల్పడిన నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టమని హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను ఆయన పరామర్శించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితురాలిని, ఆమె భర్తను జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ నిందితులను చట్టపరంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి పాశవిక చర్యలు జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయంతో పాటు ప్రభుత్వపరంగా వ్యవసాయం చేసుకోవడానికి కొంత భూమిని అందిస్తామని హామీ ఇచ్చారు. బాధిత పిల్లలకు ప్రభుత్వపరంగా విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అసలేం జరిగిందంటే : నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మ-ఈదన్న దంపతులు. కొల్లాపూర్‌లోని ఓ వ్యక్తి వద్ద రూ.30 వేలు తీసుకుని కూలీ పనికి కుదిరారు. వారు పని సక్రమంగా చేయడం లేదంటూ ఆ యజమాని ఇబ్బందులు పెట్టేవాడు. అతని బాధను తట్టుకోలేని దంపతులు తమ సొంత భూమిని కౌలుకు తీసుకున్న బండి వెంకటేశ్ అనే వ్యక్తి వద్ద నుంచి రూ.30 వేలను తీసుకొని కొల్లాపూర్‌కు చెందిన వ్యక్తికి చెల్లించారు.

ఈ క్రమంలో ఈశ్వరమ్మ, ఈదన్నలను వారి సొంత పొలంలోనే వెంకటేశ్ వారిని కూలీ పనికి పెట్టుకున్నాడు. వారికి కూలీ డబ్బులు చెల్లించకుండానే వెట్టిచాకిరి చేయించుకునేవాడు. చేయకపోతే ఇబ్బందులు పెట్టేవాళ్లు. వారు అక్రమంగా నడిపే ఇసుక ఫిల్టర్ కేంద్రంలో పనికి పంపేవాడు. ఆమెతో గంటలోనే ట్రాక్టర్ లోడ్ ఇసుకను నింపాలని ఆదేశించేవాడు. ఒకవేళ అలా చేయకపోతే దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడేవాడు. వాటిని తట్టుకోలేని బాధిత మహిళ తన భర్తతో గొడవపడి పుట్టింటికి చుక్కాయిపల్లికి వెళ్లిపోయింది.

గదిలో బంధించి చిత్రహింసలు : ఈ క్రమంలో ఆమె పుట్టింటికి వెళ్లిన విషయాన్ని తెలుసుకున్న బండి వెంకటేశ్, అతని కుటుంబ సభ్యులు 10 రోజుల కిందట ఆమెను మొలచింతలపల్లికి తీసుకొచ్చి తమ ఇంట్లోనే బంధించి దారుణంగా కొట్టారు. కళ్లు, జననాంగాల్లో కారం పోశారు. శరీరంపై కాల్చి, వాతలు పెట్టారు. అప్పటి నుంచి ఆమెను వారి ఇంట్లోనే పెట్టి గ్రామంలోని ఓ ఆర్ ఎంపీతో వైద్యం చేయించారు. ఈ విషయం తెలుసుకున్న ఈదన్న గ్రామస్థులతో కలిసి ఈశ్వరమ్మను పంపించమని బండి వెంకటేశ్‌ను కోరాడు. దీంతో అతను బెదిరింపులకు పాల్పడ్డాడు. ఎలాగోలా కుటుంబసభ్యులు ఆమెను ఇంటికి తీసుకొని రాగా, ఆ చెంచు మహిళపై జరిగిన దాష్టీకం బయటకు వచ్చింది.

ఈ విషయం బయటకు రావడంతో జాతీయ ఆదివాసీ సాలిడార్టి సంస్థ కౌన్సిల్ సభ్యులు, పోలీసులు, సఖి సభ్యులు ఆమె గ్రామానికి వెళ్లి బాధితురాలిని కొల్లాపూర్ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు తీవ్రగాయాలు కావడంతో నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె ఒంటిపై ఉన్న గాయాలను చూసి వైద్యులు కూడా నివ్వెరపోయారు. నిందితుల పేర్లను వెల్లడించేందుకు బాధితురాలు భయపడిందంటే నిందితుల ఆగడాలు ఆమెపై ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

సోషల్ మీడియాలో వీడియో వైరల్ : శుక్రవారం వెలుగులోకి వచ్చిన సంబంధిత వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బాధితురాలి భర్త ఈదన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ సంఘటనపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. కీలక సూత్రధారి ఒక ప్రధాన పార్టీకి మద్దతుదారు కావడంతో ఆయనతో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేయడం లేదని చెంచులు ఆరోపిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
23 జూన్ 2024
తెలంగాణ

ఎన్‌టీఆర్ స్ఫూర్తితో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వైద్య సేవలు

అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు విస్తరణ

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి

సీఎం రేవంత్ రెడ్డి , మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మం జూన్ 22 (జనంసాక్షి):
ప్రపంచంతో పోటీ పడే విధంగా హైదరాబాద్ లో హెల్త్ టూరిజం హబ్ ను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసే క్రమంలో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సేవలను కూడా వినియోగించు కుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జరిగిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి 24వ వార్షికోత్సవం లో నామ నాగేశ్వరరావు తో కలిసి ఆయన మాట్లాడారు. అద్భుతమైన సౌకర్యాలతో ఏర్పాటు చేసే ఈ హెల్త్ టూరిజం హబ్ లో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి పాత్ర కూడా ప్రముఖంగా ఉంటుందని చెప్పారు. ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు సభ్యులు, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సేవలు మరింతగా విస్తరించేందుకు కావాల్సిన 10 ఎకరాల స్థలాన్ని ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి నందుకు సీఎం కు ప్రత్యేకించి, కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆస్పత్రి సేవలను మరింతగా విస్తరిస్తామని సీఎం ను కోరగా సానుకూలంగా స్పందించారని అన్నారు. ఇందుకు సంబంధించిన భవనాల అనుమతులు కూడా త్వరగా వచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇవ్వడం పట్ల నామ ధన్యవాదాలు తెలిపారుముఖ్యమంత్రి సహకారంతో ఆస్పత్రి పెండింగ్ సమస్యలన్నీ పరిస్కారమయ్యాయని చెప్పారు. భవన నిర్మాణ అనుమతులన్నీ సకాలంలో ఇచ్చేలా సీఎం ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నామ పేర్కొన్నారు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఒక ఘన చరిత్ర ఉంది.... ఆనాడు ఎన్ టీ ఆర్ పేదలకు సేవ చేయాలనే మహా ఆశయం... ఉన్నత సంకల్ప%శీ%తో ప్రారంభించిన ఈ ఆస్పత్రి నేడు దిన దిన ప్రవర్ధమానమై దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో పేదల సేవలో వర్ధిల్లుతుందని నామ పేర్కొన్నారు. ఆనాడు యన్ టీ ఆర్ స్ఫూర్తిని నేడు చంద్రబాబు నాయుడు, బాలకృష్ణ మరింతగా కొనసాగిస్తూ పేద వర్గాలకు అత్యున్నత స్థాయి లో సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఆస్పత్రి అందిస్తున్న మెరుగైన సేవలను టైమ్స్ మ్యాగజైన్, అవుట్ లుక్ వంటి ప్రముఖ పత్రికలు సైతం ప్రముఖంగా ప్రచురించడం ఆస్పత్రి స్థాయిని ప్రతిబింబిస్తుందని తెలిపారు..ఆస్పత్రి చైర్మన్ బాలకృష్ణ కు ఎప్పుడూ పేదలకు మరింత మెరుగైన రీతిలో సేవలందించి, వారి ఆరోగ్యాలను కాపాడాలనే ఆలోచనే ఉంటుందని నామ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ బాలకృష్ణ, సీఈవో కె. కృష్ణయ్య, ట్రస్ట్ బోర్డు సభ్యులు భరత్ తో పాటు నారా బ్రాహ్మణి, దత్తాత్రేయుడు, రాఘవరావు, దశరథ రామిరెడ్డి,శివరాం ప్రసాద్ ,సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడంలో వెనక్కు తగ్గే ప్రసక్తే లేదు..!

వచ్చే నెల నుంచి రూ.31 వేల కోట్లతో రుణమాఫీ అమలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

నేలకొండపల్లి ,జూన్ 22 (జనంసాక్షి) :
పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఇందిరమ్మ ప్రభుత్వం వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని, ఎన్నికల సమయంలో ఏ హామీలను ఇచ్చామో వాటన్నింటిని విడతల వారిగా నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండల పర్యటనలో భాగంగా మోటాపురం, శంకరగిరి తండా, రాజేశ్వరపురం, అమ్మగూడెం, కోరట్లగూడెం, కోనాయిగూడెం, అరెగూడెం, ఆచార్లగూడెం, బోదులబండ, మంద్రాజుపల్లి తదితర గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ కోసం అన్ని సమకూరుస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో వచ్చేనెల జూలై నుంచి రుణమాఫీ అమలవుతుందని తెలిపారు. రూ.31 వేల కోట్లతో రైతుల రుణమాఫీ జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వం చేయబోయే రుణమాఫీని తట్టుకోలేక ప్రతిపక్షం వాళ్లు నోరుజారి ఏవేవో మాట్లాడు తున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పేదవాళ్లలో అతిపేదవాళ్లకు ముందు మంజూరు చేస్తామన్నారు. లిఫ్ట్ లు రిపేరు చేయించి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. రాజేశ్వరపురం గ్రామంలో నేలకొండపల్లి మండల కళ్యాణ లక్ష్మి లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం రద్దు

నల్లగొండ బ్యూరో, జూన్ 22,(జనంసాక్షి) :
జిల్లా కలెక్టర్ తో సహా అదనపు కలెక్టర్లు,ఇతర జిల్లా స్థాయి అధికారులు అందరూ మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతున్న దృష్ట్యా సోమవారం జిల్లా స్థాయిలో జరిగే ప్రజావాణి ని రద్దు చేశామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారఉ. ఈ సోమవారం నుండి మండల స్థాయిలోనే జిల్లా స్థాయిలో నిర్వహించినట్లుగానే ప్రజావాణి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నందున జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని,ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఫిర్యాదుదారులు జిల్లా కేంద్రంలో ఫిర్యాదులు సమర్పించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సోమవారం నుండి నల్గొండ జిల్లాలోని 33 మండలాలతో పాటు,నల్గొండ, దేవరకొండ, మిర్యాలగూడ మున్సిపాలిటీలలో సైతం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఆయా మండలంలోని ప్రజలు వారికి సంబంధించిన ఫిర్యాదులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించాలని కోరారు. మండల స్థాయిలో సైతం జిల్లా లో మాదిరిగానే ఉదయం10:30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, మధ్యాహ్నం 2 గంటలకు ముగుస్తుందని, మండల స్థాయిలో అన్ని రకాల సమస్యలను ప్రజావాణిలో సమర్పించవచ్చని తెలిపారు. ముఖ్యంగా అభివృద్ధి,సంక్షేమకార్యక్రమాలతో పాటు, భూములు ఇతర సమస్యలను సైతం ఈ ప్రజావాణి కార్యక్రమాల్లో సమర్పించవచ్చని పేర్కొన్నారు.మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఎంపీడీవో అధ్యక్షతన జరుగుతుందని, మండల ప్రత్యేక అధికారి తహసిల్దార్,మండల విద్యాధికారి,వ్యవసాయ అధికారి,ఏపిఎం తోపాటు,ఇతర అధికారులు మండల ప్రజావాణి కార్యక్రమంలో ఉంటారని,జిల్లాలో మాదిరిగానే ఫిర్యాదుదారులకు రసీదు ఇవ్వడం జరుగుతుందని,అంతేకాక ప్రతి ఫిర్యాదుకు ఒక ఒక ఐడి నెంబర్ ను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.మండల స్థాయిలో పరిష్కారం కానీ ఫిర్యాదులు15 రోజుల తర్వాత జిల్లా స్థాయి ప్రజావాణిలో సమర్పించ వచ్చని ఆయన స్పష్టం చేశారు.జిల్లా స్థాయిలో తిరిగి ప్రజావాణి కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

సాధారణ కాన్పులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
ఆరోగ్య సమస్యలపై వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు, నాణ్యమైన వైద్యం అందాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. అనంతరం హాజరు శాతం పతిశీలించి, దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రిలో వచ్చిన రోగులను అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఐసీయులో బెడ్స్, డ్రగ్స్, నిరంతరం శానిటేషన్ చేపట్టాలని, ప్రసూతి కోసం వచ్చే గర్భిణీలకు ఎక్కువగా సాధారణ కాన్పులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆసుపత్రులలో ఎక్కడ కూడా మందుల కొరత లేకుండా చూడాలని అన్నారు.ఆసుపత్రిలోని జనరల్ క్యాజువాలిటి, ఆర్థో వార్డులను తనిఖీ చేసి రోగులతో అందుతున్న వైద్యం సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అత్యవసరంగా కావాల్సిన వాటిని ఒక నివేదిక రూపంలో అందజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళ శక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలి

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):
మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళ శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో డిపిఎంలు, ఏపీఎంలు, సీసీలు, మండల సమాఖ్య ప్రెసిడెంట్, సెక్రటరీలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.మహిళలను ప్రత్యేక లక్ష్యంతో వచ్చే ఐదేళ్లలో బలోపేతం చేయడమే లక్ష్యంగా మహిళా శక్తి ద్వారా 14 రకాల కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు.అందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు, పాఠశాలలు తెరిచే సమయానికి ఏకరూప దుస్తులు అందించి జిల్లాకు మంచి పేరు తెచ్చారని పేర్కొన్నారు.సెర్ఫ్ లో ఉన్న సామర్థ్యం ఎవరికీ లేదని,వారి సామర్థ్యాన్ని వారి లక్ష్యంపై పెట్టాలని సూచించారు.మహిళ శక్తి క్రింద మైక్రో ఎంటర్ప్రైజెస్, కుట్టు కేంద్రాలు,పాడి పశువులు, బ్యాక్ యాడ్ పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ అవుట్లెట్లు, మిల్క్ ప్యాలెస్, మీ సేవా, ఈవెంట్ మేనేజ్మెంట్, మహిళా క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు ,ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, కస్టం హైరింగ్ కేంద్రాలు వంటి 14 రకాల కార్యక్రమాలు చేపట్టుటకు మండలాల వారిగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యచరణ ప్రకారం వివిధ మండలాల్లోని 579 గ్రామ సమాఖ్యలోని 17647 మంది స్వయం సహాయక సంఘాల ద్వారా 86 కోట్ల పెట్టుబడులతో 8623 యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా ఇప్పటి నుండే శ్రమించాలని,ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇక్కడ జరిగిన కార్యక్రమంలోని విషయాలను, మండలాలు ,క్లస్టర్ వారిగా సమావేశాలు నిర్వహించి, యూనిట్స్ గురించి తెలపాలని అన్నారు.లబ్ధిదారుల ఎంపిక చాలా ముఖ్యమైందని, జాగ్రత్తగా ఎంపిక చేయాలని, ట్రైనింగ్ ఇప్పించి సకాలంలో గ్రౌండింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. యూనిట్ గ్రౌండింగ్ సత్వర చర్యలు తీసుకొని బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ యూనిట్లు గ్రౌండ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ పిడి మధుసూదన్ రాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి టి.రూపేందర్ సింగ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పి.సరస్వతి , సెర్ఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో

మార్కెట్ యార్డును పునఃనిర్మించాలి

అధికారులకు సూచించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

ఖమ్మం జూన్ 22 (జనంసాక్షి):
ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీలో ప్రస్తుతం ఉన్న మిర్చి యార్డు నిర్మాణం 15 ఎకరాలలో నిర్మించబడింది. మార్కెట్ యార్డు ఏర్పాటైన తొలినాళ్లలో మిర్చి, పత్తి పంట సాగు తక్కువగా ఉండటంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు. కానీ కాలక్రమేణా మిర్చి, పత్తి పంట సాగు పెరుగుతూ వచ్చింది. అయితే గత 10 ఏళ్ళలో తెలంగాణ అంతటా మిర్చి, పత్తి పంట సాగు గణనీయంగా పెరిగింది. అంతేకాకుండా పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల నుండి కూడా మార్కెట్ యార్డుకు సరుకుల రాబడి పెరిగింది. దీనివలన ప్రస్తుతం ఉన్నటువంటి మిర్చియార్డు సరియైన పద్ధతిలో లేనందున రైతులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. సీజన్ సమయాలలో 1 లక్ష కంటే ఎక్కువ బస్తాల పంట మార్కెట్ కి వస్తుంది. ఇలాంటి పరిస్థితులలో మార్కెట్ యార్డు స్థలం తక్కువగా ఉండటం మరియు సరియైన మౌళికసదుపాయాలు లేకపోవడం వలన రైతులు తమ పంటను రోడ్లపై వేసుకోవడం జరుగుతుంది. కొన్నిసార్లు 1 కి.మీ కు పైన రోడ్ల మీద రైతులు తమ పంటను ఉంచుకోవడం జరుగుతుంది. 2017 లో దాదాపు 1,50,000 మిర్చి బస్తాలు మార్కెట్ యార్డుకి వచ్చాయి. కానీ సరియైన సదుపాయాలు లేనందున వీటిని రోడ్డుపై వేశారు. ఇది సామాన్య ప్రజలకు అలాగే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుంది. అంతేకాకుండా సరియైన సదుపాయాలు లేని కారణంగా కొంతమంది రైతులు వేరే మార్కెట్ యార్డుకి తరిలిపోవడం వలన ఖమ్మం మార్కెట్ యార్డుకి నష్టం కూడా వాటిల్లుతుంది. ఈ విషయాలన్ని దృష్టిలో ఉంచుకొని, రైతుల సౌకర్యార్థం అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ యార్డును పునఃనిర్మించుటకు మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. తదనుగుణంగా ఈ రోజు మార్కెటింగ్ శాఖ వారు ప్రతిపాదిత డిజైన్లను మంత్రిగ పరిశీలనార్థం చూపెట్ట దానిలో కొన్ని మార్పులను గౌరవమంత్రిగారు ప్రతిపాదించడం జరిగింది. అన్ని సాంకేతికపరమైన అంశాలను పరిగణలోనికి తీసుకోవల్సిందిగా మంత్రిగ అధికారులకు సూచించారు. ప్రతిపాదిత నమూనాతో మార్కెటింగ్ శాఖ అధికారులు అన్ని మౌళికసదుపాయాలతో 148.5 కోట్ల అంచనా విలువతో నివేదికను ఈరోజు ప్రభుత్వ ఆమోదానికి పంపించడం జరిగింది.

బిజెపి పార్టీకి ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పిన వినోద రావు

పార్టీ కార్యకర్తకు ఏ ఆపద వచ్చినా ఆదుకుంటాం

రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తాం

కొత్తగూడెం, జూన్ 22 (జనంసాక్షి):
జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బిజెపి పార్టీ గుర్తుపై ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన తాండ్ర వినోద్ రావ్ మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలోని ప్రజలు ఇటీవలజరిగిన ఎన్నికల్లో ఎంతో ఆదరణ చూపినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, ప్రజా సమస్యల ఎజెండాగా పనిచేయాలని నిర్ణయించామని పెండింగ్ లో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం లోని ఎయిర్పోర్టుపై సంబంధిత మంత్రులతో చర్చించటం జరిగిందని ఉమ్మడి జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని నిర్ణయించామని మారుమూల గ్రామాలలో కూడా మమ్మల్ని ఆదరించినందుకు ఎంతో ఆనందంగా ఉందని ఏ పార్టీకైనా ప్రజా తీర్పే ముఖ్యమని రాబోయే జెడ్పిటిసి ఎంపీటీసీ పంచాయతీ ఎన్నికల్లో పార్టీలోని అందరు కార్యకర్తల నాయకుల సహకారంతో ఎక్కువ స్థానాలు గెలిచేలా పార్టీ బలోపేతం అయ్యేలా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, గాంధీ పలు జిల్లా మండల నాయకులు కార్యకర్తలు బిజెపి అభిమానులుపాల్గొన్నారు.

'ఏరువాక' అంటే దుక్కి ప్రారంభ దినం

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

సత్తుపల్లి, జూన్ 22 (జనంసాక్షి) :
సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామంలో సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఎద్దులకు పూజ చేసి నాగలితో పొలం దున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏరువాక పున్నమి ప్రతి సంవత్సరం జ్యేష్ఠ పూర్ణిమనాడు రైతులందరూ ఈ పండుగను జరుపుకుంటారని, ఏరు అంటే ఎడ్లను కట్టి దున్నడానికి సిద్ధపరచిన నాగలి, 'ఏరువాక' అంటే దుక్కి ప్రారంభ దినం అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయానికి సిద్ధంగా ఉంచే ఒక గొప్ప పండుగ ఏరువాక పౌర్ణమి అని ఈ ఏడాది కూడా వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయం రైతులకు పండుగగా మారాలని ఆకాంక్షించారు. అలాగే పొలంలో దుక్కి దున్నడంతో ప్రారంభించి, వ్యవసాయ పనులను ప్రారంభించన ఈ సందర్భంగా ఈ ఏరువాక పూర్ణిమ పర్వదినాన ఎడ్లు, నాగలి, ఇతర వ్యవసాయ పనిముట్లను పూలు, పసుపు, కుంకుమ,ధూప దీపాలు మొదలైన వాటితో పూజించి, దుక్కి దున్నడంతో ప్రారంభమైన వ్యవసాయ పనులు,ఎటువంటి ఆటంకాలు లేకుండా మంచి పంటలు పండాలని భగవంతుని కోరుకుంటు ఈ ఏరువాక పౌర్ణమి రోజున వ్యవసాయ పనులు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం అన్నారు. ఉత్తమ రైతులను శాలువతో సన్మానించారు. అదే విధంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి మాట ఇచ్చిన ప్రకారం వచ్చే ఆగస్టు 15వ తేదీ లోపు రైతులకు 2లక్షలు రుణమాఫీ ఖచ్చితంగా చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు..

కనీసం నలుగురు పిల్లలుంటే..
జీవితాంతం ట్యాక్స్ కట్టక్కర్లేదు
హంగేరీ ప్రధాని విక్టోర్ అర్బన్

ఓవైపు ప్రపంచ జనాభా నానాటికీ పెరుగుతుంటే.. కొన్ని దేశాలను మాత్రం జననాల క్షీణత సమస్య వేధిస్తోంది.
ఆర్థిక, వృత్తిపరమైన సవాళ్లతో అక్కడి యువత పెళ్లిళ్లపై అనాసక్తి చూపడంతో భవిష్యత్ తరం తగ్గిపోతోంది. దీంతో వలసలపై ఆధారపడాల్సి వస్తోంది. ఐరోపా దేశం హంగేరీ (%ఎబఅస్ట్రుతీఎ%) ప్రస్తుతం ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటోంది. దీంతో జనాభాను పెంచుకునేందుకు ఆ దేశ ప్రభుత్వం వినూత్న ఆలోచనలు చేస్తోంది. ఇందులోభాగంగానే ఎక్కువమంది సంతానం ఉన్నవారు జీవితాంతం ఆదాయపు పన్ను కట్టాల్సిన అవసరం లేదని స్వయంగా దేశ ప్రధానే ప్రకటించడం గమనార్హం.
"ఐరోపాలో జననాలు చాలా తక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా పశ్చిమ దేశాల్లో ఈ సమస్యకు వలసలు పరిష్కారంగా మారుతున్నాయి. జనాభాను పెంచుకునేందుకు వలసదారులను ఆహ్వానించాల్సి వస్తోంది. అందుకే మేం విభిన్న ఆలోచనలతో ముందుకొచ్చాం. కనీసం నలుగురు లేదా అంతకంటే ఎక్కువమందిని కనే మహిళలకు తమ జీవితకాలం వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు కల్పిస్తాం" అని హంగేరీ ప్రధాని విక్టోర్ అర్బన్ తాజాగా ఆసక్తికర ప్రకటన చేశారు.
దీంతోపాటు పెద్ద కుటుంబాలు పెద్ద పెద్ద కార్లు కొనుగోలు చేసేందుకు వీలుగా సబ్సిడీని కూడా ఇవ్వనున్నట్లు హంగేరీ ప్రభుత్వం (%ఎబఅస్ట్రుతీఎ +శీజవతీఅఎవత్%) వెల్లడించింది. అంతేగాక, పిల్లల పెంపకం కోసం దేశవ్యాప్తంగా 21వేల క్రెచ్‌లను ప్రారంభించినట్లు తెలిపింది. ఇలాంటి మినహాయింపులతో పెళ్లిళ్లు, కుటుంబవ్యవస్థను ప్రోత్సహించినట్లవుతుందని అక్కడి సర్కారు అభిప్రాయపడుతోంది.
హంగేరీ ప్రభుత్వం గతంలోనూ ఇలాంటి బంపరాఫర్లు ప్రకటించింది. పెళ్లిళ్లు, జననాల రేటు ను పెంచేందుకు 2019లో ఓ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. దానికింద, 41ఏళ్లు రాకముందే పెళ్లి చేసుకునే అమ్మాయిలకు 10 మిలియన్ ఫోరింట్స్ (హంగేరీ కరెన్సీ) సబ్సిడీ రుణాలు కల్పించింది. పెళ్లయిన తర్వాత ఆ మహిళ ఇద్దరు పిల్లలకు జన్మనిస్తే రుణంలో మూడోవంతును మాఫీ చేస్తామని తెలిపింది. ఒకవేళ ముగ్గురు అంతకంటే ఎక్కువ సంతానం కలిగితే మొత్తం రుణాన్ని మాఫీ చేస్తామని ఆఫర్ ఇచ్చింది. ప్రస్తుతం హంగేరీ జనాభా 96.4లక్షలుగా ఉంది.

గుడ్ల ధరలు

హైదరాబాద్	వరంగల్
₹ 5.15	₹ 5.17

బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్
₹66,350 (22 క్యారెట్లు)
₹72,380 (24 క్యారెట్లు)
చెన్నై
₹66,950 (22 క్యారెట్లు)
₹ 73,040 (24 క్యారెట్లు)

వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 96,500

ఆహార పదార్థాల ధరల వల్లే ద్రవ్యోల్బణం తగ్గడంలో జాప్యం
ఆర్‌బీఐ గవర్నరు

ముంబయి:
రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం నెమ్మదించడానికి ఆహార పదార్థాల ధరలే కారణమని, ఇటీవలి పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో ఆర్‌బీఐ గవర్నరు శక్తికాంతదాస్ అభిప్రాయపడినట్లు ఆ సమావేశ ముఖ్యాంశాలు వెల్లడించాయి.
వరుసగా ఎనిమిదో ద్వైమాసిక సమీక్షలోనూ రెపో రేటును 6.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించేందుకు ఎంపీసీ సభ్యుల్లో నలుగురు అనుకూలంగా, ఇద్దరు వ్యతిరేకంగా ఓటేశారు. 'వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం తగ్గుతున్నప్పటికీ.. అది నెమ్మదిగానే ఉంది. అందువల్ల ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్యాన్ని అందుకోవడం ఆలస్యం కావొచ్చు'ని దాస్ పేర్కొన్నారు.
ఆహార పదార్థాల ధరల్లో హెచ్చుతగ్గుల వల్లే, ద్రవ్యోల్బణం దిగిరావడం ఆలస్యం అవుతోందని దాస్ తెలిపారు. సరఫరా పరమైన అవరోధాలు ఆహార పదార్థాల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించడం కొనసాగుతూనే ఉందని అన్నారు. సాధారణ వర్షపాత అంచనాలు కార్యరూపం దాల్చితే, కొన్ని కీలక ఆహార పదార్థాల ధరలపై ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు.

యూట్యూబ్‌లో కొత్త ఫీచర్..డీప్‌ఫేక్ వీడియోల ఆటకట్టు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిపోయింది. ప్రతి రంగంలోనూ ఈ సాంకేతికతను చాలా మంది దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు.
దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. మరోవైపు తమ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లో వచ్చే డీప్‌ఫేక్ కంటెంట్‌ను అరికట్టడటంలో భాగంగా యూట్యూబ్ ముందడుగువేసింది.కొందరు కంటెంట్ క్రియేటర్లు తమ ఫాలోవర్లను ఆకట్టుకోవడంలో భాగంగా లేనిది ఉన్నట్టుగా.. ఉన్నది లేనట్టుగా చూపిస్తున్నారు. దీంతో ఏది నిజమైన వీడియోనో.. ఏది ఏఐ సాయంతో రూపొందించిన వీడియోనో తెలుసుకోలేక తికమకపడుతున్నారు. వ్యక్తులకు తెలియకుండా వారి వాయిస్‌ను ఉపయోగించి కంటెంట్‌ను అందిస్తున్నారు. దీనికి చెక్‌పెట్టేందుకు యూట్యూబ్ సరికొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. కంటెంట్ క్రియేటర్లు తమ వీడియోలో ఏఐని వినియోగిస్తుంటే ఆ విషయాన్ని యూజర్లకు స్పష్టంగా తెలియజేయాలని పేర్కొంది. తాజాగా మరికొన్ని ఫీచర్లు జోడించింది. వీటి సాయంతో వినియోగదారులు డీప్‌ఫేక్ కంటెంట్‌పై రిపోర్ట్ చేయొచ్చు.ఇకపై లైవ్‌స్ట్రీమ్ ప్రారంభించాలంటే సబ్‌స్క్రిప్షన్ ఉండాల్సిందే..! 'ఎక్స్'లో కీలక మార్పు ఇకపై యూట్యూబ్‌లో మీ ఫొటో లేదా వాయిస్‌ని ఉపయోగించి రూపొందించిన కంటెంట్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయొచ్చు. యూజర్ల అభ్యర్థన మేరకు ఆ వీడియోలను పరిశీలించి, కంటెంట్ వాస్తవానికి విరుద్ధంగా ఉందా? అనే విషయాన్ని ధృవీకరించి సదరు వీడియోలను తొలగిస్తుంది. దీంతో యూజర్ల డీప్‌ఫేక్ వీడియోలను అరికట్టొచ్చని పేర్కొంది. యూజర్ల గోప్యతను పెంచడంలో భాగంగానే వీటిని తీసుకొచ్చినట్లు తన బ్లాగ్‌పోస్ట్‌లో పేర్కొంది.

ఇకపై లైవ్‌స్ట్రీమ్ ప్రారంభించాలంటే సబ్‌స్క్రిప్షన్ ఉండాల్సిందే..!

బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం 'ఎక్స్'.. తన ప్రీమియం సబ్‌స్క్రైబర్లను పెంచుకొనే పనిలో పడింది. అందులోభాగంగా త్వరలో కొత్త మార్పును తీసుకు రానున్నట్లు ప్రకటించింది. ఇకపై లైవ్‌స్ట్రీమ్‌ను ప్రారంభించాలంటే కచ్చితంగా ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ఉండాలని పేర్కొంది.
ఈవిషయాన్ని లైవ్ ప్రొఫైల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది.ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, టిక్‌టాక్.. వంటి సోషల్‌మీడియా వేదికల్లోనూ లైవ్ స్ట్రీమింగ్ సదుపాయం ఉంది. అయితే వీటిలో ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రారంభించాలంటే ఎటువంటి ప్రీమియం సభ్యత్వం అవసరం లేదు. రానున్న రోజుల్లో ప్రీమియం సబ్‌స్క్రైబర్లు మాత్రమే 'ఎక్స్'లో లైవ్ స్ట్రీమ్ చేసే సదుపాయం ఉండనుంది. అయితే ఎప్పటినుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయనే విషయం తెలియదు. 'ఎక్స్' బేసిక్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ధర నెలకు రూ.215 నుంచి ప్రారంభమవుతుంది. వాణిజ్య ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం సైతం పడిపోతున్నట్లు చాలాకాలంగా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈనేపథ్యంలో సబ్‌స్క్రైబర్ల ద్వారా వచ్చే ఆదాయంతో నష్టాన్ని పూడ్చుకునేందుకు మస్క్ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే తాజా మార్పులు చేయనున్నట్లు సమాచారం. మరోవైపు.. మైక్రోబ్లాగింగ్ సైట్‌లో కొత్త యూజర్లు చేసే పోస్ట్‌తో పాటు, లైక్, రిప్లయ్, బుక్‌మార్క్ చేయాలన్నా చిన్న మొత్తంలో ఫీజు చెల్లించాల్సి రావొచ్చని మస్క్ వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటికే ఫిలిప్పీన్స్, న్యూజిలాండ్‌లోని కొత్త యూజర్లకు ఈ రుసుములు వసూలుచేయడం ప్రారంభించింది. అయితే ఫాలో, బ్రౌజింగ్ ఉచితంగానే చేయొచ్చని పేర్కొంది.

బ్రిటన్‌లో టాటా స్టీల్ కార్మికుల సమ్మె

లండన్: బ్రిటన్‌లో టాటా స్టీల్‌కు చెందిన దాదాపు 1500 మంది కార్మికులు సమ్మెకు దిగనున్నారు. 2800 ఉద్యోగాల కోత, బ్లాస్ ఫర్నేస్‌ల మూసివేత వంటి కంపెనీ ప్రణాళికలకు వ్యతిరేకంగా జులై 8 నుంచి వీరు సమ్మె చేయనున్నారు.
వేల్స్‌లోని పోర్ట్ టాల్‌బోట్, లాన్‌వెర్న్ ప్లాంట్‌లకు చెందిన ఉద్యోగులు ఇందులో ఉన్నారు. బ్రిటన్‌లో ఉక్కు కార్మికులు సమ్మె చేయనుండటం గత 40 ఏళ్లలో ఇదే తొలిసారని కార్మిక సంఘాలు తెలిపాయి. సమ్మె కార్యరూపం దాలిస్తే, టాటా స్టీల్ బ్రిటన్ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. టాటా స్టీల్ కార్మికులు తమ ఉద్యోగాల కోసం పోరాడటం లేదని, భవిష్యత్ కోసం పోరాడుతున్నట్లు యునైట్ జనరల్ సెక్రటరీ షారోన్ గ్రాహమ్ అన్నారు.
బహిరంగ మార్కెట్ లావాదేవీల ద్వారా యాక్సిస్ బ్యాంక్‌లో 0.5 శాతం వాటాకు సమానమైన 1.7 కోట్ల షేర్లను రూ.2,083 కోట్లకు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ కొనుగోలు చేసింది.

యులిప్‌లను పెట్టుబడి పథకాలుగా ప్రచారం చేయొద్దు
బీమా సంస్థలకు ఐఆర్‌డీఏఐ మార్గదర్శకాలు

దిల్లీ: జీవిత బీమా సంస్థలు అందించే యూనిట్ ఆధారిత బీమా పాలసీ (యులిప్)లను పెట్టుబడి పథకాలుగా పేర్కొంటూ ప్రకటనలు జారీ చేయొద్దని భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) పేర్కొంది.ఈ మేరకు మాస్టర్ సర్క్యులర్‌ను జారీ చేసింది. యూనిట్ ఆధారిత, ఇండెక్స్ ఆధారిత బీమా పాలసీలను ఇక నుంచి పెట్టుబడి పథకాలుగా ప్రచారం చేయొద్దని బీమా సంస్థలకు సూచించింది. సంప్రదాయ పాలసీలతో పోలిస్తే, మార్కెట్ ఆధారిత బీమా పథకాలకు నష్టభయం ఉంటుందనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలనీ ఆదేశించింది. పార్టిసిపేటింగ్ (బోనస్ ఇచ్చే పాలసీలు) ఎండోమెంట్ పాలసీలు ఇచ్చే బోనస్‌లకు సంబంధించి ఇచ్చే ఉదాహరణలు వాస్తవం కాదని, ఎలాంటి హామీ ఉండదనీ తెలియజేయాలి. వేరియబుల్ యాన్యుటీ పథకాల విషయంలోనూ నష్టభయానికి సంబంధించిన వివరాలతో ప్రకటనలు ఉండాలని పేర్కొంది. యూనిట్ ఆధారిత ఫండ్లు లేదా ఇండెక్స్ ఫండ్లను కొత్తగా తీసుకొచ్చారా, ఇప్పటికే ఉన్నాయా అనే వివరాలూ ప్రకటనల్లో ఉండాలి. జీవిత బీమా విలువ, అనుబంధ పాలసీల వివరాలు లేకుండా పత్రికా ప్రకటనలూ విడుదల చేయొద్దని మాస్టర్ సర్క్యులర్‌లో ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది.

బుగాటి.. రూ.34 కోట్ల హైబ్రిడ్ హైపర్ కార్
గరిష్ఠ వేగం 445 కిలోమీటర్లు

ఫ్రాన్స్‌కు చెందిన విలాసవంత కార్ల తయారీ సంస్థ బుగాటీ ఆటో మొబైల్స్, తోబియాన్ హైపర్-జీటీ హైబ్రిడ్ కారును ఆవిష్కరించింది. గంటకు 445 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో, ప్రపంచంలోనే రోడ్లపై అత్యంత వేగంగా ప్రయాణించే వాహనంగా ఇది గుర్తింపు పొందనుంది. 40 మిలియన్ డాలర్ల (సుంకాలు కాకుండా సుమారు రూ.34 కోట్ల) ధర పలికే ఈ అత్యాధునిక కారుకు 8.3 లీటర్ వీ16 ఇంజిన్ అమర్చారు. దీనివల్ల 1000 హెచ్‌పీ శక్తినిస్తుంది. క్వాడ్ టర్బో డబ్ల్యూ 16 విద్యుత్తు మోటార్‌తో అదనంగా 800 హెచ్‌పీ శక్తి లభిస్తుంది. 25 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఉంది. 1995 కిలోల బరువు మాత్రమే ఉండే ఈ కార్లను మొత్తం 250 మాత్రమే రూపొందిస్తామని కంపెనీ ప్రకటించింది.

వాణిజ్య వాహనాల కోసం కొత్త టైర్లు
విపణిలోకి విడుదల చేసిన జేకే టైర్

హైదరాబాద్: మారుతున్న రవాణా రంగ అవసరాలకు అనుగుణంగా వాణిజ్య వాహనాల కోసం సరికొత్త టైర్ల శ్రేణిని జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ ఆవిష్కరించింది.శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీటిని సంస్థ ప్రెసిడెంట్ అనూజ్ కథారియా విపణిలోకి విడుదల చేశారు. ఇందులో జెట్‌వే జేయూఎం ఎక్స్‌ఎం, జెట్‌వే జేయూసీ ఎక్స్‌ఎం, జెట్‌స్టీల్ జేడీసీ ఎక్స్‌డీతోపాటు విద్యుత్ బస్సుల కోసం ప్రత్యేకంగా జెట్‌వే జేయూఎక్స్‌ఈ టైర్లు ఉన్నాయి. దేశంలో వాణిజ్య వాహనాల టైర్లు ఏడాదికి దాదాపు 1.20 కోట్ల మేరకు అమ్ముడవుతున్నాయని, ఏటా 5% వృద్ధి లభిస్తోందన్నారు. ఇందులో తాము నాయకత్వ స్థానంలో ఉన్నామన్నారు. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా రూ.1,400 కోట్ల మేరకు పెట్టుబడులు పెడుతున్నామని వివరించారు. మొత్తం 500 రకాల టైర్లను అందిస్తున్నామని, ఇందులో 12 అడుగుల ఎత్తువీ ఉన్నాయన్నారు.

ఉక్రెయిన్‌కు ఆయుధాలిచ్చి తప్పు చేయకండి
దక్షిణ కొరియాకు పుతిన్ హెచ్చరిక

మాస్కో: ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయాలన్న నిర్ణయం తీసుకుంటే అది దక్షిణ కొరియా చేసే అతి పెద్ద తప్పిదం అవుతుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు.
వియత్నాంలో రెండు రోజుల పర్యటనలో ఉన్న పుతిన్.. ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం రష్యా, ఉత్తర కొరియా నూతన సైనిక ఒప్పందంపై సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై దక్షిణ కొరియా మండిపడింది.
మాస్కోపై పోరాడేందుకు ఉక్రెయిన్‌కు ఆయుధాలు అందజేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పుతిన్ మాట్లాడుతూ.. "మా సైనిక ఒప్పందంపై దక్షిణ కొరియా ఆందోళన చెందాల్సిన పనిలేదు. సంతకాలు చేసిన దేశాల్లో ఒక దానిపై దాడి చేసినపుడు మాత్రమే మా ఒప్పందం అమల్లోకి వస్తుంది.
నాకు తెలిసినంత వరకు ఉత్తరకొరియాపై దాడి చేయాలని దక్షిణ కొరియా అనుకోవడం లేదు. ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాల విషయానికొస్తే, అది పెద్ద తప్పిదం అవుతుంది. అది జరగదనే భావిస్తున్నా. జరిగితే మేం కూడా అందుకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకుంటాం. అవి ప్రస్తుత దక్షిణ కొరియా నాయకత్వానికి ఏమాత్రం రుచించవు" అని పుతిన్ తెలిపారు.

త్వరలో పబ్లిక్ ఇష్యూకు జెప్టో!
తాజాగా రూ.5,500 కోట్ల సమీకరణపడాదిలో విలువ మూడింతలు

దిల్లీ: నిత్యావసరాలు సరఫరా చేసే అంకుర సంస్థ జెప్టో తాజాగా రూ.5,500 కోట్ల (665 మిలియన్ డాలర్లు) పెట్టుబడులను సమీకరించింది. కంపెనీ విలువను సుమారు రూ.30,000 కోట్లు (3.6 బిలియన్ డాలర్లు)గా లెక్కగట్టి ఈ నిధుల సమీకరణను పూర్తి చేసింది. ఏడాదిక్రితంతో పోలిస్తే కంపెనీ విలువ సుమారు మూడింతలు కావడం గమనార్హం. అధిక పెట్టుబడి అవసరం ఉండటమే కాకుండా, తక్కువ మార్జిన్ లభించే నిత్యావసరాల సరఫరా రంగంలో పోటీ కూడా తీవ్రంగానే ఉంటుంది. అమెజాన్, బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బిగ్ బాస్కెట్‌తో పోటీ పడేందుకు తాజాగా సమీకరించిన నిధులు జెప్టోకు ఉపయోగపడనున్నాయి. ఈ నిధుల సమీకరణ ప్రక్రియలో ప్రస్తుత వాటాదార్లతో పాటు కొత్త పెట్టుబడిదార్లు పాల్గొన్నాయని జెప్టో వెల్లడించింది.
ఏర్పాటైంది 2021లోనే: స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామ్ అభ్యసించిన ఆదిత్ పాలిచా (21) తన బాల్య మిత్రుడైన కైవల్య వోహ్రాతో కలిసి 2021లో జెప్టోను స్థాపించారు. త్వరలోనే మిగులు నగదు నిల్వల స్థాయికి జెప్టో చేరుకునే అవకాశం ఉంది. సమీప భవిష్యత్‌లో పబ్లిక్ ఇష్యూకు వెళ్లే యోచన లో సంస్థ ఉన్నట్లు తెలుస్తోంది. క్విక్ ఇ-కామర్స్‌గా వ్యవహరించే, 10 నిమిషాల్లో వస్తువుల సరఫరా సేవల విభాగంలో జెప్టోకు 29% మార్కెట్ వాటా ఉంది. సుమారు 40% వాటాతో బ్లింకిట్ ఈ విభాగంలో అగ్రగామిగా కొనసాగుతోంది.

ఎన్‌పీఎస్‌లో కొత్త లైఫ్ సైకిల్ ఫండ్
సెప్టెంబరులో అందుబాటులోకి పీఎఫ్ఆర్‌డీఏ

దిల్లీ: జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో ప్రభుత్వేతర చందాదారుల కోసం కొత్త లైఫ్ సైకిల్ ఫండ్ తీసుకొస్తున్నట్లు పింఛను నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (పీఎఫ్ఆర్‌డీఏ) వెల్లడించింది. సెప్టెంబరు నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని పీఎఫ్ఆర్‌డీఏ ఛైర్మన్ దీపక్ మొహంతి శుక్రవారం వెల్లడించారు. ప్రస్తుతం 35 ఏళ్ల దాటిన వారికి ఈక్విటీల్లో పెట్టుబడులు తగ్గిస్తున్నామని, దీన్ని 45 ఏళ్ల వరకూ పెంచుతున్నట్లు తెలిపారు. దీనివల్ల ఈక్విటీ ఆధారిత పెట్టుబడులకు అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌సీ 75, ఎల్‌సీ 50, ఎల్‌సీ 25 పేర్లతో మూడు లైఫ్ సైకిల్ ఫండ్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కొత్త పథకం సెప్టెంబరులో అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. లైఫ్ సైకిల్ ఫండ్ చందాదారులకు, పెట్టుబడులను ఎంచుకునే స్వేచ్ఛను ఇది అందిస్తుంది. ఈక్విటీ, డెట్ కేటాయింపులను నిర్ణయించుకోవచ్చు.
గత ఆర్థిక సంవత్సరంలో అటల్ పెన్షన్ యోజన(ఏపీవై)లో 1.24 కోట్ల మంది చందాదారులు చేరగా, ఇందులో 52% మహిళలున్నారని తెలిపారు. ఈ పథకంలో మొత్తం 6.6 కోట్ల మంది చేరారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.30 కోట్ల మందిని ఈ పథకంలో చేర్చాలనే లక్ష్యంతో ఉన్నట్లు వివరించారు. 2023-24లో ఎన్‌పీఎస్ కింద 9.7 లక్షల ప్రభుత్వేతర చందాదారులు నమోదు కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 11 లక్షలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. మార్కెట్ సాధారణంగా పనిచేస్తే ఏపీవై సహా మొత్తం నిధి గత ఆర్థిక సంవత్సరంలో ఉన్న రూ.12.4 లక్షల కోట్ల నుంచి ఈ ఆర్థిక సంవత్సరం చివరికి రూ.15లక్షల కోట్లకు పెరుగుతుందని పేర్కొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
23.06.2024

జగిత్యాల డీపీఆర్ఓగా లక్ష్మణ్

జగిత్యాల బ్యూరో (జనంసాక్షి): జగిత్యాల జిల్లా డిపిఆర్ఓగా విధులు నిర్వహించిన భీమ్ కుమార్ ఇటీవల బదిలీ కావడంతో ఆస్థానంలో కరీంనగర్ అసిస్టెంట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్న జి లక్ష్మణ్ కుమార్ కి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఉత్తర్వులను జారీ చేయగా , శనివారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కలెక్టర్ బీ సత్యప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం ఇన్చార్జి డీపీఆర్ఓ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అధికారిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా మిత్రులకు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, అధికారిక సమాచారాన్ని పాత్రికేయులకు చేరవేయడంలో ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ పనితీరును మరింత మెరుగు పరిచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

కేంద్ర మంత్రిని బండిని కలిసిన ఎంపిటిసిల ఫోరం అధ్యక్షురాలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ ను శనివారము మర్యాద పూర్వకంగా కలిసారు.కేంద్ర సహాయ మంత్రిగా నియామకమైన సందర్భంలో కరీంనగర్ లోని అయన నివాసంలో వేములవాడ అర్బన్ మండలం ఎంపీటీసీల అధ్యక్షురాలు బుర్ర లహరికా శేఖర్ గౌడ్ కలిసి పూల బొకేను అందజేశారు.

ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్

ప్రారంభించిన కల్వకుంట్ల సుజిత్ రావు

ఇబ్రహీంపట్నం (జనంసాక్షి): మండలంలోని వేములకుర్తి గ్రామంలో కొంపెల్లి రాజయ్య ఏర్పాటు చేసిన నూతన ఆన్లైన్ సెంటర్ ని కాంగ్రెస్ నాయకులు కులకుంట్ల సుజిత్ రావు ప్రారంభించారు. ఈ సంధర్భంగా సుజిత్ రావు మాట్లాడుతూ గ్రామస్తులు ఆన్లైన్ సెంటర్ ను వినియోగించుకోవాలని కోరారు. కొంపల్లి రాజయ్య , పలువురు సాలువతో సన్మానిం చారు. వారితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన గోవర్ధన్ , కల్లేడ గంగాధర్ , బైండ్ల శ్రీకాంత్ , మాజీ సర్పంచ్ బుడత సుదర్శన్ , దాసరి రాజేందర్ , దొంగారి కిరణ్ , శేఖర్ , అసతి శ్రీను తదితరులు ఉన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం

మల్లాపూర్ (జనంసాక్షి): లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 25న మండల కేంద్రంలోని శ్రీ వాసవి మాత ఆలయ ఆవరణలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరము నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట రాజారాములుఅన్నారు. సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి కంటి వైద్య శిబిరం విజయవంతం చేయగలరని కోరారు. ఇక్కడ లైన్స్ క్లబ్ ఫాస్ట్ అధ్యక్షుడు కనుక సంజీవ్, రీజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, నాయకులు సత్యనారాయణ, మహేష్, నారాయణ, శంకర్, అశోక్ రెడ్డి, జీవన్‌రెడ్డి, రాజేందర్, సంతోష్‌లు పాల్గొన్నారు

45వ డివిజన్‌లో పర్యటించిన మనాలీ ఠాకూర్

గోదావరిఖని(జనంసాక్షి): ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు 45వ డివిజన్ చంద్రశేఖర్‌నగర్‌లో మనాలి రాజ్‌ఠాకూర్ శనివారం పర్యటించారు.శుక్రవారం రాత్రి కురిసిన వర్షాలకి 45వ డివిజన్ చంద్రశేఖర్‌నగర్‌లో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకొని వారి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అతి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు .డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, సతీష్, మహిళ కాంగ్రెస్ నాయకులు శోభ, లావణ్య, జ్యోతి, భారీగా డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన అభిమానం

కేంద్రమంత్రి బండిని కలిసేందుకు భారీ తరలివచ్చిన అభిమానులు

- జన సందోహంతో కిక్కిరిసిన ఎంపీ కార్యాలయం.. శుభాకాంక్షలు వెల్లువ
- బండికి కేంద్రమంత్రి పదవిరాకపై జోష్‌లో కాషాయ సైనికులు
- అటు అధికారులు...ఇటు నేతలరాకతో సందడిగా కార్యాలయం

కరీంనగర్ బ్యూరో, జూన్ 22 (జనంసాక్షి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న బండి సంజయ్ కుమార్ కు శనివారం రోజు కూడా అభినందనలు వెల్లువ కొనసాగింది. గత మూడు రోజులపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటించిన బండి సంజయ్ శనివారం కరీంనగర్ కార్యాలయానికే పరిమితమయ్యారు. దీంతో బండి సంజయ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారులు, నేతలు, అభిమానుల రాకతో ఆ ప్రాంతమంతా జాతరను తలపించింది. బండికి పుష్పగుచ్చాలు అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు కాషాయ శ్రేణులు ఫుల్లక్ష జోష్‌లో ఉన్నారు జనంరద్దీ ఎక్కువ కావడంతో అటువైపు వాహనాలు రాకుండా ఉండేందుకు ఎంపీ ఆఫీస్ కార్యాలయం వెళ్లే నాలుగు వైపులనున్న రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన జన సందోహాన్ని చూస్తే జాతరను తలపించింది. ఉదయం నుండి సాయంత్రం దాదాపు 15 వేల మందికి పైగా తరలి వచ్చినట్లు అంచనా వచ్చిన వారికి ఇబ్బంది లేకుండా భోజన, నీటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు.అధికారుల విషయానికొస్తే...సిరిసిల్ల జిల్లాకు చెందిన కమాండెంట్ శ్రీనివాసరావు, పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి(డీఎస్వో), డీఆర్డీవో, సెర్ప్ తదితరులున్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం, ఫారెస్ట్ అధికారుల సంఘం, ఎల్ఐసీ యూనియన్, ఆడిట్ యూనియన్ అధికారులు సంజయ్ ను కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. ఇక సంఘాల విషయానికొస్తే మత్స్యకారుల సంఘం నాయకులు బండి సంజయ్‌ను కలిసి వల, చేపలను బహుకరించారు. పార్టీలకు అతీతంగా ఇతర పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, సుదగోని క్రిష్ణ మాధవి బండి సంజయ్ ను శాలువాతో సత్కరించారు. కొందరు కేక్ లు కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ జిల్లా అడ్వోకేట్స్ అసోసియేషన్, ఆర్ఎంపీల అసోసియేషన్, గొల్ల కుర్మ అసోసియేషన్, గౌడ సంఘం నాయకులు, మున్నూరు కాపు జిల్లా నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, రెడ్డి సంఘం నాయకులు, ఆర్యవైశ్య అసోసియేషన్, రైస్ మిల్లర్ల సంఘం నాయకులు, ఇలా అనేక సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు బండి సంజయ్ ను కలిసి అభినందనలు తెలిపారు. ఇక బీజేపీ కార్యకర్తలు, నాయకుల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బండి సంజయ్ కు కేంద్ర మంత్రి పదవి దక్కడంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలం నుండి, ప్రతి గ్రామం నుండి శనివారం తరలి వచ్చారు. అభిమాన నాయకుడిని కలిసేందుకు, ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీలు పడ్డారు. ఒక్కో గ్రామం నుండి పదుల సంఖ్యలో, ఒక్కో మండలం నుండి వందల సంఖ్యలో కాషాయ సైనికులు తరలివచ్చి బండికిశుభాకాంక్షలు తెలిపారు.

నేత కార్మికుడి ఆత్మహత్య

అప్పుల బాధతో యాసిడ్ తాగి బలవర్మరణం

సిరిసిల్ల పట్టణం జూన్ 23 (జనంసాక్షి): సిరిసిల్లలో అప్పుల బాధ భరించలేక మరో నేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజీవ్ నగర్ కు చెందిన కుడిక్యాల నాగరాజు(45) నేత కార్మికుడు శనివారం బాత్రూంలో వాడే యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మరమగ్గాలు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న నాగరాజుకు గత ఆరు నెలల నుండి ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై అప్పుల పాలయ్యాడు. రూ.4 లక్షల అప్పు అయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఫస్ట్ ఇయర్ చదువుతున్న అబ్బాయికి కాలేజీ ఫీజు కట్టలేక మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

మృతుడు నాగరాజు

ధరణి సమస్యల సత్వర పరిష్కారం

అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

బోధన్(జనంసాక్షి) : భూ సంబంధిత అంశాలపై ధరణి కింద దరఖాస్తులు చేసుకున్న రైతుల సమస్యలను పరిష్కరించాలనే కృత నిశ్చయంతో బోధన్ నియోజకవర్గ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, కలెక్టర్, క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం నవీపేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులతో ఎమ్మెల్యే, కలెక్టర్ ముఖాముఖిగా భేటీ అయ్యారు. ఒక్కో రైతు వారీగా సమస్యలను అడిగి తెలుసుకుని, అందుకు గల కారణాల గురించి అధికారులను ఆరా తీశారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచనలు చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన జరపాలని ఆదేశించారు. అర్హత కలిగిన వారి దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తూ, వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికను ఆర్డీఓ లాగిన్ కు ఫార్వార్డ్ చేయాలని సూచించారు. వారం వ్యవధిలో అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని గడువు విధించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, నిబంధనలకు అనుగుణంగా అర్హతలు కలిగి ఉన్న ప్రతి రైతుకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని రైతులకు భరోసా కల్పించారు. ఈ దిశగా అధికారులను సన్నద్ధం చేసి, యుద్ధప్రాతిపదికన ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించేలా కృషి చేస్తున్నామని అన్నారు. వివిధ కారణాలతో పెండింగ్ లో ఉంచిన ధరణి దరఖాస్తులను వెంటనే నిశిత పరిశీలన జరిపి అర్హులైన రైతులకు పట్టా పాస్ బుక్కులు, సక్సేషన్, నాలా కన్వర్షన్, ఖాతా మెర్జింగ్, పాస్ పుస్తకాలలో డేటా కరెక్షన్ వంటి సమస్యలను పరిష్కరించేలా అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. రైతులతో భేటీలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఎంపిపి ఎస్.శ్రీనివాస్, నవీపేట తహసీల్దార్ నారాయణ, ఎంపిడిఓ నాగనాథ్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఫార్వర్డ్‌బ్లాక్ ఆవిర్భావ వేడుకలు

జెండా ఎగురవేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్.

కరీంనగర్ బ్యూరో, జూన్ 22 (జనంసాక్షి) :కరీంనగర్ పట్టణంలోని తెలంగాణ చౌక్ లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 85 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జెండాను కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నాడు స్వాతంత్రోద్యమాన్ని ఎంతోగాను ముందుకు తీసుకువెళ్లిన మహోన్నతమైన వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో 1939 వ సంవత్సరంలో ఆనాడు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించడం జరిగిందని తెలిపారు. దేశంలో ఒక ప్రత్యామ్నాయ విధానమే లక్ష్యంగా నిరంతరం ఉద్యమాలు చేస్తూ ప్రజల కోసం పనిచేస్తూ ప్రజా శ్రేయసే లక్ష్యంగా ఫార్వర్డ్ బ్లాక్ ముందుంటుందని తెలిపారు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కురువెల్లి శంకర్, ప్రశాంత్ కుమార్, విద్యార్థి సంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్, యువజన సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రినేత, టియుసిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

విద్యార్థి సంఘాల సంతకాల సేకరణ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 22 (జనంసాక్షి): ఇటీవల నిర్వహించిన నీటి పరీక్ష లీకేజీల కుంభకోణం పై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యుల మీద చర్యలు తీసుకొని నీట్ పరీక్షని రీ కండక్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం సంతకాల సేకరణ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల బాధ్యులు మాట్లాడుతూ నీటి పరీక్షలు నిర్వహించడానికి బిజెపి సర్కార్ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి బాధ్యతలు అప్పగించి, వైఫల్యం చెంది 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడడం సిగ్గుచేటన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను అంగట్లో సరుకుగా మార్చిందన్నారు.పేపర్ల లీకేజ్ వ్యవహారంలో ఒక్కో అభ్యర్థి నుండి రూ.30 లక్షలకు పైగా వసూలు చేసిన నింది తులను వెంటనే అరెస్ట్ చేయాలని,విద్యార్థిని అక్రమంగా వసూలు చేసిన డబ్బులను తిరిగి వారికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇట్టి సంఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే సమగ్ర విచారణ జరిపించి బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పేపర్ లీకేజ్ వ్యవహారంపై మౌనం వీడి స్పందించాలన్నారు. ఈ సంఘటనకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.లేనియెడల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బిజెపి ఎమ్మెల్యేల, మంత్రుల, ఎంపీల ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఎన్ ఆజాద్, ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్, నాయకులు భరత్, మణికంఠ, శ్యామ్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

బూడిద వినియోగంలో పూర్తి నిబద్ధత:ఎన్టీపీసీ

గోదావరిఖని, జూన్ 22, (జనంసాక్షి): పర్యావరణ, అటవీ వాతావరణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం మార్పు, బొగ్గు లేదా లిగ్నైట్ ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్ బాధ్యత వహించాలి.మూడు సంవత్సరాలలో ఉత్పత్తి చేయబడిన సగటు 100 శాతం బూడిదను ఉపయోగించడం సగటున 100శాతం బూడిద వినియోగాన్ని సాధించడానికి ఎన్టీపీసీ రామగుండం అనుసరిస్తోందని తెలిపిందిఈ నిబద్ధత హామీ ఇవ్వడమే కాదు బూడిద వనరుల సమర్థవంతమైన నిర్వహణ.పర్యావరణ బాధ్యత పట్ల రామగుండం తిరుగులేని అంకితభావం,దాని కార్యకలాపాలు అన్ని కోణాలలో నియంత్రణ సమగ్రతతో పనిచేస్తోంది.

రైల్వేశాఖ తీపికబురు

మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇటీవల జరిగిన రైల్వే బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైలు కోచ్‌ల వార్షిక ఉత్పత్తి కంటే అదనంగా 2500 జనరల్ క్లాస్ కోచ్‌లు తయారు చేయనున్నారు. దీంతో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అంచనా వేశారు. కాగా, ప్రస్తుతం రెండు జనరల్ కోచ్‌లు ఉన్న రైళ్లలో వాటి సంఖ్య నాలుగుకు రెట్టింపు అవుతుందని సీనియర్ రైల్వే అధికారి తెలిపారు. జనరల్ కోచ్‌లు లేని రైళ్లకు రెండు సమకూరుతాయని చెప్పారు. ఒక్కో జనరల్ కోచ్‌లో 150 నుంచి 200 మంది ప్రయాణించేలా తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రతి రోజూ అదనంగా ఐదు లక్షలమంది జనరల్ కోచ్‌లో ప్రయాణించవచ్చని అన్నారు. జనరల్ కోచ్‌ల పెంపు ప్రణాళికతో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సామర్థ్యం పెరుగుతుందని రైల్వే అధికారులు తెలిపారు. దీని కోసం 1377 స్లీపర్ క్లాస్ కోచ్‌ల తోపాటు అదనంగా 2500 జనరల్ కోచ్‌లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

కార్మికుల కోసం పోరాడేది ఐఎన్‌టీయూసీనే..

యూనియన్‌ను విమర్శించే అర్హత ఏఐటీయూసీకి లేదు..

గోదావరిఖని, జూన్ 22, (జనంసాక్షి): కారుణ్య నియామకాల వయో పరిమితి పెంపు 35-40కి యాజమాన్యం ప్రభుత్వంతో మాట్లాడి సర్క్యులర్ విడుదల చేసింది ఐఎన్‌టీయూసీ మాత్రమేనని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పి.ధర్మపురి అన్నారు.శనివారం సింగరేణి ఆర్‌జీ-1 ఏరియాలోని జీడీకే.ఓసీపీ-5 గేట్ మీటింగ్‌లో పి.ధర్మపురి మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆదేశానుసారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా కార్మికుల పక్షాన ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నిరంతరం కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతున్నారని, ఇప్పటికే యాజమాన్యం ప్రభుత్వంతో మాట్లాడి అనేక హక్కుల సాధించారని పేర్కొన్నారు.పెండింగ్ ఉన్న కారుణ్య నియామకాల పాత్రలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఇప్పించామని, అపుడే అనేక ఏళ్లుగా పెండింగ్‌లో కారుణ్య నియామకాల 35-40 వయో పరిమితి పెంపు స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రకటన ఇప్పించిన ఘనత ఐఎన్‌టీయూసీదని అన్నారు.కార్మికుల సొంత ఇంటి కలపై అనేక ఏరియాలలో ఉన్న స్థలాల సేకరణ, వాటి సాధ్యాసాదాలు గురించి త్వరలోనే ప్రతి కార్మికునికి సొంత ఇల్లు వచ్చేలా కృషి చేయాలని,అధికారుల వలె పెర్క్స్ మీద ఐటీ యాజమాన్యమే చెల్లించాలని,కారుణ్య నియామకాల కోసం చేసే మెడికల్ బోర్డ్‌లో 24 నెలల నిబంధన తీసేసి దరఖాస్తు చేసుకున్న వారందరికీ పారదర్శకంగా ఎలాంటి డబ్బులు ఖర్చు కాకుండా మెడికల్ అన్ అయ్యేలా చేయాలని సూచించామన్నారు. డైవరిఫికేషన్‌లో భాగంగా కేవలం బొగ్గు ఉత్పత్తి మాత్రమే కాకుండా మెటల్ మైనింగ్, విండ్ పవర్,సోలార్ పవర్ లాంటి వాటిపై దృష్టి సారించాలని ధర్మపురి పేర్కొన్నారు.సింగరేణి వ్యాప్తంగా మేధావులతో,రిటైర్డ్ అధికారులు, కార్మిక సంఘ నాయకులతో ఒక సెమినార్ నిర్వహించాలన్నారు. జనరల్ సెక్రెటరీ లక్ష్మీపతిగౌడ్, ఐఎన్‌టీయూసీ నాయకులు గడ్డం కృష్ణ, ఆంజనేయులు, సమ్మయ్యయాదవ్, సాగర్, నాగరాజు, అంజయ్య, మండ రమేష్, మల్లికార్జున్, బేబీ శ్రీను, పుట్ట రమేష్, తాళ్ళ కుమార్, శ్రీనివాస్, సమ్మయ్య, జనగామ రాజేశం, మోహన్, కృష్ణ, రవీందర్‌రెడ్డి, చారి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీని హర్షిస్తున్నాం

- పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు

సిరిసిల్ల పట్టణం జూన్ 23 (జనంసాక్షి):రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ సీఎం రేవంత్ రెడ్డి చేయడాన్ని హర్షిస్తున్నామని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్ తెలిపారు. సిరిసిల్లాలోని గాంధీ చౌక్ వద్ద పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు రుణమాఫీని హర్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చొప్పదండి ప్రకాష్ మాట్లాడుతూ శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో వాగ్దానం చేసిన విధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిందన్నారు. ఈ రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగుల సత్యనారాయణ గౌడ్, సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, యెల్లె లక్ష్మీనారాయణ,సూర దేవరాజు, మ్యాన ప్రసాద్, వైద్యశివప్రసాద్, కాముని వనిత, అరుణ, రోజా, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

పండితుల కల నెరవేర్చిన ముఖ్యమంత్రి

హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు

వేములవాడ గ్రామీణం, జూన్ 20 (జనంసాక్షి): గత 20 సంవత్సరాలుగా ఉద్యోగంలో చేరిన పండితులకు ఎలాంటి ప్రమోషన్ లేకుండానే ఉద్యోగ విరమణ చేయాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం పండితుల చిరకాల కోరికను తీర్చిందని రాజన్న సిరిసిల్ల జిల్లా పండిత పరిషత్ అధ్యక్షులు జనపాల వెంకటయ్య హర్షం వ్యక్తం చేశారు. శనివారం రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ గ్రామీణ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వట్టెంలలో గురువారం భోజన విరామ సమయంలో పండితుల పక్షాన పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. పండితులకు ప్రమోషన్ కల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పండితుల పక్షాన రుణపడి ఉంటామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సూర్య నారాయణ, ఉపాధ్యాయులు దశరథం, శరత్, రవీందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

జిల్లా ఇంఛార్జి మంత్రిగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి విఫలం ● బాధ్యతలు చేపట్టి 6 నెలలైనా సమస్యలపై సమీక్షించలేదు

- కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ తెచ్చిన ఘనత కేసీఆర్, వినోద్, ఎమ్మెల్యే గంగులదే
- కరీంనగర్ బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్
- కేంద్రమంత్రి బండికి శుభాకాంక్షలు.. నగర అభివృద్ధికి సహకరించాలని వినతి

కరీంనగర్ బ్యూరో, జూన్ 22 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలల 15 రోజులు గడిచిపోయిందని జిల్లా ఇంఛార్జి మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇక్కడి సమస్యలపై ఒక్క సారి కూడా సమీక్ష సమావేశం నిర్వహించలేదని కరీంనగర్ నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ 37వ డివిజన్ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో తెలిపారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఇదేమని అడిగితే ఎలెక్షన్ కోడ్ సాకు చూపిస్తున్నారని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని దరఖాస్తులు బుట్ట దాఖలు చేశారని అర్హులైన పేద (తెల్ల రేషన్ కార్డు అన్న వారు) వారిలో 40 శాతం మందికి గృహ జ్యోతి, ఐదు వందలకు సిలిండర్ పథకాలను అమలు చేయడం లేదని మహిళలకు ఇస్తామన్న రూ.2500 పథకం ఏమైందని వర్షాకాలం ప్రారంభమైంది .. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆపారని ఇప్పటికైనా ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాంత సమస్యలు... అభివృద్ధి... సంక్షేమ పథకాల అమలు పై 2 నెలలకు ఒకసారి సమీక్షించాలని పట్టణాలను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీని తీసుకువచ్చిందనీ స్మార్ట్ సిటీలో భాగంగా తెలంగాణలో హైదరాబాద్ వరంగల్ కు చోటు కల్పించిందన్నారు. హైదరాబాద్ కాదని నాటి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని కరీంనగర్ కు స్మార్ట్ సిటీ హోదా కల్పించాలని కేంద్ర ప్ర

మరోసారి ఒలింపిక్స్‌కు సుమిత్ నాగల్

26 ఏళ్ల భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నాగల్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఈ విషయాన్ని ఆయన సోషల్ నెట్‌వర్క్ లలో ప్రకటించారు. ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం చాలా సంతోషంగా ఉందని నాగల్ తెలిపాడు. 2024 పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా ఇది నాకు అత్యుత్తమ క్షణమని అధికారికంగా ప్రకటించిన ందుకు చాలా సంతోషంగా ఉందంటూ పోస్ట్ చేసాడు. ఒలింపిక్ టార్గెట్ ప్రోగ్రామ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వల్ల నేను దీన్ని సాధించగలిగానని ఆయన ఆతెలిపారు. వారందరికీ చాలా ధన్యవాదాలు అంటూ ఎక్స్ లో పోస్ట్ చేశాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో, లియాండర్ పేస్ తర్వాత వరల్డ్ గేమ్స్‌లో వ్యక్తిగత ఈవెంట్‌లో గెలిచిన మొదటి భారతీయుడిగా నాగల్ చరిత్ర సృష్టించాడు. టోక్యో ఒలింపిక్స్ తొలి రౌండ్‌లో ఉజ్బెకిస్థాన్ కు చెందిన డెనిస్ ఇస్తోమిన్ ను ఓడించిన భారత స్టార్.. రెండో రౌండ్‌లో డేనియల్ మెద్వెదేవ్ చేతిలో ఓడిపోయాడు. 26 ఏళ్ల నాగల్ 2024 సీజన్ ప్రారంభం నుంచి మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్, ఇండియన్ వెల్స్ మాస్టర్స్, మోంటే కార్లో మాస్టర్స్, ఏటీపీ 1000 టోర్నమెంట్ లకు అర్హత సాధించారు. కాగా ప్యారిస్ గేమ్స్‌లో పురుషుల డబుల్స్ లో రోహన్ బోపన, ఎన్. శ్రీరామ్ బాలాజీ జోడీ ఆడనుంది.

టీ20 ప్రపంచకప్ 2024లో రాణించడం లేదు

విరాట్ కోహ్లీపై కోచ్ ఆసక్తికర వ్యాఖ్యలు!

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై భారత బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అఫ్గానిస్థాన్‌పై విరాట్ పరుగులు చేసినా.. తనకు ఆనందంగా లేదన్నాడు. విలువైన పరుగులు చేసిన కోహ్లీ.. భారీ ఇన్నింగ్స్‌గా మలచకుండా ఔట్ కావడం తనను నిరాశపరిచిందన్నాడు. అయితే గత మ్యాచ్‌లతో పోలిస్తే మెరుగైన ఆట తీరును ప్రదర్శించాడని విక్రమ్ రాథోడ్ పేర్కొన్నాడు. ఐపీఎల్ 2024లో పరుగుల వరద పారించిన కోహ్లీ.. టీ20 ప్రపంచకప్ 2024లో రాణించడం లేదు. 4 మ్యాచ్‌ల్లో కలిపి 29 పరుగులు మాత్రమే చేశాడు. అఫ్గాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 24 బంతుల్లో 24 పరుగులు చేశాడు. టీ20ల్లో తక్కువ స్ట్రైక్‌రేట్‌తో విరాట్ కోహ్లీ పరుగులు చేయడం సరైంది కాదనే అభిప్రాయం అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లలో నెలకొంది. నేడు సూపర్-8లో భాగంగా బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా విరాట్ భారీ ఇన్నింగ్స్ ఆడాలని అభిమానులు కోరుకుంటున్నారు. విక్రమ్ రాథోడ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించాడు. 'అఫ్గానిస్థాన్‌పై విలువైన పరుగులు చేసిన కోహ్లీ.. భారీ ఇన్నింగ్స్‌గా మలచకుండా ఔట్ కావడం నాకు సంతోషంగా అనిపించలేదు. అయితే గత మ్యాచ్‌లతో పోలిస్తే మెరుగ్గా ఆడాడు. టీ20 ప్రపంచకప్‌లో సవాళ్లు విసిరే పిచ్‌లపై ఇలా ఆడటం కూడా మంచిదే. బంగ్లాపై విరాట్ మంచి ఇన్నింగ్స్ ఆడుతాడు' అని విక్రమ్ రాథోడ్ ధీమా వ్యక్తం చేశాడు.'భారత్‌లో ఎక్కువగా పరుగులు చేయని బ్యాటర్లు.. ఇక్కడ రాణించడం శుభ పరిణామం. రిషబ్ పంత్ టాప్ ఆర్డర్‌లో దూకుడుగా ఆడుతున్నాడు. ఇదే ఆటతీరును మిగతా మ్యాచుల్లోనూ కొనసాగిస్తాం. పిచ్ పరిస్థితులకు అనుగుణంగానే తుది జట్టు ఉంటుంది. అత్యుత్తమ టీమ్‌తోనే బరిలోకి దిగుతాం. అక్షర్ పటేల్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ లోనూ రాణించడం సానుకూలాంశం. న్యూయార్క్‌లో దారుణమైన పిచ్‌లపై ఆడాం. ఇప్పుడు కరేబియన్‌లో కాస్త మెరుగైన మైదానాల్లో ఆడుతున్నాం. బంగ్లాను తక్కువగా అంచనా వేయడం లేదు. నాణ్యమైన స్పిన్నర్లు ఆ జట్టు ఉన్నారు.

ఇంగ్లండ్‌కు చావోరేవో..

టీ20 వరల్డ్ కప్‌లో డిఫెండింగ్ చాంపియిన్ ఇంగ్లండ్ సెమీస్ రేసులో వెనకబడింది. గ్రూప్ 2 సూపర్ 8 తొలి పోరు ఆతిథ్య వెస్టిండీస్ ను చిత్తుగా ఓడించిన బట్లర్ సేన మలిపోరులో దక్షిణాఫ్రికాపై తడబడింది. దాంతో, అమెరికాతో ఆదివారం జరిగే మ్యాచ్ ఇంగ్లండ్‌కు చావోరేవో లాంటిది. అయితే.. జూన్ 24న బార్బడోస్ వేదికగా జరుగబోయే ఈ మ్యాచ్‌కు వరుణుడి ముప్పు పొంచి ఉంది.

7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై సౌతాఫ్రికా విజయం

టీ20 ప్రపంచకప్ 2024లో సౌతాఫ్రికా జైత్రయాత్ర కొనసాగుతోంది. సూపర్-8లో భాగంగా ఇంగ్లండ్‌తో శుక్రవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా 7 పరుగుల తేడాతో గెలుపొందింది. సూపర్-8 పోరులో వరుసగా రెండో మ్యాచ్ గెలిచి సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 163 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ క్వింటన్ డికాక్ (38 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 65) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా.. డేవిడ్ మిల్లర్ (28 బంతుల్లో, 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 43) విలువైన పరుగులు చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ (3/40) మూడు వికెట్లు తీయగా.. మోయిన్ అలీ, ఆదిల్ రషీద్ తలో వికెట్ తీసారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 156 పరుగులు చేసింది. హ్యారీ బ్రూక్(37 బంతుల్లో 7 ఫోర్లతో 53), లియామ్ లివింగ్‌స్టోన్(17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 33) పోరాడినా ఫలితం లేకపోయింది. చివరి ఓవర్‌లో ఇంగ్లండ్ విజయానికి 14 పరుగులు అవసరమవ్వగా.. క్రీజులో సెట్ అయిన హ్యారీ బ్రూక్ ఉండటంతో విజయం ఖాయమని అంతా అనుకున్నారు. కానీ అతను భారీ షాట్‌కు ప్రయత్నించగా.. మార్క్‌రమ్ వెనక్కి పరుగెత్తుతూ స్టన్నింగ్ క్యాచ్ అందుకున్నాడు. ఆ తర్వాత సామ్ కరన్ పోరాడినా ఫలితం లేకపోయింది. ఈ ఉత్కంఠ పోరులో విజయం సాధించడంతో సౌతాఫ్రికా క్రికెటర్లు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఉబికి వస్తున్న దు:ఖాన్ని ఆపుకోలేకపోయారు. సెమీస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో విజయం దక్కడంతో కసిగా సంబరాలు చేసుకున్నారు. డ్రెస్సింగ్ రూమ్‌లో గట్టిగా అరుస్తూ కన్నీటి పర్యంతమయ్యారు.

నేను ప్రస్తుతం సంతోషంగా ఉన్నాను

కోచ్ ఎంపికపై స్పందించిన గంభీర్

టీం ఇండియా ప్రధాన కోచ్‌కు సంబంధించి కొనసాగు తున్న ప్రకంపనల మధ్య, గంభీర్ స్పందించారు. భారత క్రికెట్ జట్టు తదుపరి ప్రధాన కోచ్‌గా మారే ప్రశ్నపై గౌతమ్ గంభీర్ శుక్రవారం మాట్లాడుతూ.. తాను అంత దూరం చూడడం లేదని అన్నారు. 'ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్' కార్యక్రమానికి గంభీర్ హాజరయ్యారు. గంభీర్ ఈ వారం ప్రారంభంలో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ యొక్క క్రికెట్ సలహా కమిటీకి వర్చువల్ ఇంట ర్వ్యూ ఇచ్చాడు. అతను తదుపరి ప్రధాన కోచ్ పోటీలో ఉన్నారు. టీ20 ప్రపంచకప్ తర్వాత ప్రస్తుత ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగియనుంది. గంభీర్ (42) ఇటీవల కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు మెంటార్‌గా వ్యవహరించాడు. మూడవ ఇండియన్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను గెలుచుకోవడంలో కీలకంగా వ్యవహరించాడు. గౌతం గంభీర్ టీమ్ ఇండియా హెడ్ కోచ్ అయ్యే అవకాశం గురించి అడిగినప్పుడు.. అతను ఈ విధంగా సమాధానమిచ్చాడు.

బాబర్ ఆజం కెప్టెన్సీకి అనర్హుడు

పాకిస్థాన్ మాజీ వెటరన్ క్రికెటర్ షోయబ్ అక్తర్

ప్రపంచ కప్ 2023 తర్వాత 2024 టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్తాన్ నిరాశపరిచే ప్రదర్శన కొనసాగింది. బాబర్ అజామ్ నాయకత్వంలో జట్టు మరోసారి పతనమైంది. ఫలితంగా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాల్సి వచ్చింది. టీ20 ప్రపంచకప్‌లో బాబర్ అండ్ కంపెనీ వైఫల్యంపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు మండిపడుతున్నారు. ఇది మాత్రమే కాదు.. తన కెప్టెన్సీతో పాటు అతని బ్యాటింగ్ ఆర్డర్‌పై నిరంతరం ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పాకిస్థాన్ లో జరిగిన ఓ మీడియా సంస్థతో పాకిస్థాన్ క్రికెట్ జట్టు మాజీ వెటరన్ క్రికెటర్ షోయబ్ అక్తర్ కూడా తన అభిప్రాయాలను పంచుకున్నాడు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో, షోయబ్ అక్తర్, మార్టిన్ గప్టిల్, యూనిస్ ఖాన్ మరియు మహ్మద్ హఫీజ్ కలిసి ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షోయబ్ అక్తర్ మాట్లాడుతూ.. 'బాబర్ ఆజం కెప్టెన్సీకి అర్హుడు కాదు.. బాబర్ ఒత్తిడికి లోనై పాకిస్థాన్‌కు మ్యాచ్‌లు పూర్తి చేయకపోతే వన్డే, టీ20 జట్లలో తన స్థానాన్ని నిలబెట్టుకోలేడు. బాబర్ అజమ్‌కు 4వ నంబర్‌లో బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ని ముగించాలి. ప్రస్తుతం, అతను తరచుగా వైట్ బాల్ క్రికెట్‌లో ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తూ కనిపిస్తాడు. ఇది కాకుండా, టెస్ట్ ఫార్మాట్‌లో అతను నాలుగో నంబర్‌లో బ్యాటింగ్‌కు రావాలి.' అని తన అభిప్రాయాన్ని వ్యక్త పిరిచాడు. దీంతో ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. కాగా.. పాకిస్థాన్ జట్టు ఈ సారి ప్రపంచ కప్‌లో అనుకున్న విధంగా ప్రదర్శన కనబరచలేదు.

బుమ్రా టీమిండియాకు దేవుడిచ్చిన వరం: అంబటి రాయుడు

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్‌లపై మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసల జల్లు కురిపించాడు. బుమ్రా టీమిండియాకు దేవుడిచ్చిన వరమని చెప్పిన రాయుడు.. సూర్యకుమార్ యాదవ్ తన బ్యాటింగ్‌తో క్రికెటర్లందరికి పాఠాలు చెబుతున్నాడని కొనియాడా డు. టీ20 ప్రపంచకప్ 2024లో టీమిండియా అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. వరుసగా 4 మ్యాచ్‌ల్లో విజయా సాధించింది. ఈ నాలుగు మ్యాచ్‌ల్లో బుమ్రా కీలక పాత్ర పోషించాడు. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింటిలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసిన బుమ్రా.. దాయాదీ పాకిస్థాన్‌తో జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్‌లో 3 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్స్ అందుకున్నాడు. అమెరికా జట్టుపై వికెట్లు తీయనప్పటికీ పొదుపుగా బౌలింగ్ చేశాడు. అఫ్గానిస్థాన్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో బుమ్రా నిప్పులు చెరిగాడు. 3 వికెట్లు పడొట్టి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటి వరకు 4 మ్యాచ్‌లు ఆడిన బుమ్రా మొత్తం 8 వికెట్లు తీసాడు. అఫ్గాన్‌తో మ్యాచ్‌లోనూ సూర్యకుమార్ యాదవ్ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. టాపార్డర్ విఫలమైన వేళ కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 'బుమ్రా ఎప్పటిలాగే అద్భుతంగా రాణిస్తున్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే సత్తా అతనికి ఉంది. బుమ్రా వరల్డ్ క్లాస్ పేసర్. భారత జట్టుకు దేవుడు ఇచ్చిన బహుమతి. భారత జట్టులో బుమ్రా ఉండటం భారతీయుల అదృష్టం.సూర్యకుమార్ యాదవ్ కూడా అద్భుతంగా ఆడారు. బ్యాటర్లందరికీ తన బ్యాటింగ్‌తో పాఠాలు చెబుతున్నాడు. ముఖ్యంగా స్లో వికెట్‌పై ఎలా ఆడాలో చూపిస్తున్నాడు. అతను ఫుట్‌వర్క్‌ను బాగా ఉపయోగించుకుంటున్నాడు. వరల్డ్ క్లాస్ స్పిన్నర్లను క్రీజుకు రెండు మీటర్ల దూరం ఉండి ఆడుతున్నాడు.'అని అంబటి రాయుడు చెప్పుకొచ్చాడు. సూపర్-8లో శుభారంభం చేసిన టీమిండియా.. మరికాసేపట్లో బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే టీమిండియా సెమీస్ బెర్త్ ఖరారు అవుతోంది. ఓడితే మాత్రం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుంది.

మాజీ క్రికెటర్లను కోర్టుకీడ్చనున్న పాకిస్థాన్ కెప్టెన్

లాహోర్: అమెరికాలో జరుగుతున్న టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ దారుణమైన పర్ఫార్మెన్స్ ఇచ్చింది. ఆ జట్టు గ్రూప్ స్టేజ్‌లోనే నిష్క్రమించింది. సూపర్-8 దశకు చేరకుండానే ఇంటికి పయనమైంది. దీంతో ఆ జట్టుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇక పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్‌పై అనేక మంది మాజీ క్రికెటర్లు తిట్టిపోశారు. అతని ప్రవర్తన వల్లే జట్టు రెండో దశకు చేరుకోలేక పోయినట్లు ఆరోపించారు. గతంలో బాబర్‌తో ఆడిన అహ్మద్ షెహజాద్‌తో పాటు యూట్యూబర్లు కూడా విమర్శలతో చెలరేగి పోయారు. ఈ నేపథ్యంలో వారందరిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

వీధి కుక్కల స్వైర విహారం...మహిళపై దాడి

రాజేంద్రనగర్, జూన్ 22 (జనం సాక్షి) : చిత్రపురి కాలనీలో ఓ మహిళ పై వీధి కుక్కల సామూహికంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. శనివారం కారు పార్కింగ్ వద్ద స్కూటీ పై వచ్చిన ఓ మహిళలపై గుంపులుగా దాడి చేసే క్రమంలో వాటి నుంచి విడిపించు కోనే క్రమంలో అర గంట పాటు వాటిని వెళ్లగొట్టే ప్రయత్నం చేసినా పైపైకి వచ్చి దాడి చేసిన వీధి కుక్కలు. ఎట్టకేలకు మనోధైర్యం తో వెళ్లగొడుతూ అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఒక్కసారిగా 15 కుక్కల వరకు గుంపులుగా దాడి చేశాయి దీంతో అక్కడికక్కడే క్రింద పడిపోయింది.ఈ ఘటనకు ముఖ్య కారణం అపార్ట్మెంట్ కాలనీ వాసులు మిగిలిన ఆహార పదార్థాలను ప్రతిరోజు సెల్లార్ లో వేస్తుండడంతో సామూహికంగా అక్కడికి చేరి అక్కడ వస్తూ, వెళుతున్న జనాలను కాటు వేస్తున్నాయని ఈ విషయమై గతంలో కూడా మున్సిపాలిటీలో ఫిర్యాదు చేశామని అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆమె ఆవేదం వ్యక్తం చేశారు.గతంలో అదే ప్రాంతంలో తల్లి కొడుకుపై విచక్షణా రహితంగా దాడి చేశాయని , పలు ఫిర్యాదుల తో కేవలం ఒక్కరోజు మాత్రమే సంబంధిత అధికారులు హడావుడి చేశారని మళ్లీ కుక్కల గుంపులు బయటికి వస్తుండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడి నుంచి కుక్కలను తరలించాలని అలాగే సెల్లార్లలో మిగిలిన ఆహార పదార్థాలు పెట్టవద్దని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు.

అక్రమంగా ఆహార వెంచర్ దందా!

- అసైన్డ్ భూములను, నిజాంసాగర్ కెనాల్ కబ్జాకు గురైన వైనం
- అక్రమాన్ని సక్రమంగా చేసేందుకు ప్రజాప్రతినిధులు,అధికారులు కుమ్మక్కు

ఆర్మూర్, జూన్ 22 (జనం సాక్షి): రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువ అనే సామెత తగ్గట్టుగా అధికార నాయకులు, అధికారులు కుమ్మక్కైతే పుట్టగొడుగుల వెలిచే అక్రమ వెంచర్లకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జాతీయ రహదారి వెంబడి నిబంధన లకు తూట్లు పొడిచి అక్రమ పద్ధతిలో ఆహార వెంచర్ దందా వెలించింది. ఒక సామాన్యుడు పదేళ్లు కష్టపడి సంపాదించిన సొమ్మును ఓ ప్లాటు కొనాలన్న కలను నిరుగార్చుతో ఇలాంటి వెంచర్లతో నిలువునా మోసపోతున్నారు.

అసలు విషయం ఏంటంటే ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని జాతీయ రహదారుల జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన ఆహార రియల్ ఎస్టేట్ వెంచర్ ను పెర్కిట్ రెవిన్యూ గ్రామంలోని 3862,3863 సర్వే నంబర్లలో, కోటా ఆర్మూర్ రెవేన్యూ గ్రామానికి చెందిన 412 సర్వే నంబర్ లోని సుమారు 10 గుంటల అసైన్మెంట్ భూమిని.. నిజాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన 822 కాలువ ఉప కాలువకు చెందిన సుమారు 30 గుంటల స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు దర్జాగా కబ్జా చేసుకొని వారి వెంచర్లో కలుపుకొని ప్లాట్లుగా అమాయ క ప్రజలకు అంటగడుతున్నారు. వెంచర్ ఏర్పాటు సమయంలో రెవిన్యూ అధికారులు అసైన్మెంట్, నిజాంసాగర్ కాలువల ప్రభుత్వ స్థలాన్ని తప్పకుండా నాలా కన్వర్షన్‌లో టోంచు మ్యాప్‌లో తప్పకుండా చూపించాల్సి ఉంటుంది.కానీ రెవేన్యూ అధికారులు ఏ తీరుగా చూపించారో ఏమో కానీ.. మున్సిపల్ అధికారులకు వెంచర్ ఏర్పాటు సమయంలో ఎలాంటి పత్రాలు సమర్పించారో తెలియదు కానీ.. వెంచర్ ఏర్పాటు స్థలంలో మాత్రం నిజాంసాగర్ కాలువ, అసైన్మెంట్ భూముల ఆనవాళ్లు కనబడకుండా వెంచర్ స్థలంలో ఆ స్థలాలను కలుపుకొని వెంచర్ నిర్మాణ దారులు దర్జాగా వెంచర్ ను ఏర్పాటు చేశారు. వెంచర్ నిర్మాణదారులు అంత దర్జాగా వెంచర్ ను ఏర్పాటు చేస్తున్నడంపై రెవిన్యూ అధికారులు.. మున్సిపల్ అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు ముట్టి ఉంటాయని ఆర్మూర్లో జనం కోడైకూస్తుంది. ఆర్మూర్ మున్సిపల్ లో ఏర్పాటు చేస్తున్న ఆహార వెంచర్లో జరుగుతున్న అక్రమాలపై స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు భారీ మొత్తంలో ముడుపులు అందుకొని అక్రమాలను సక్రమాలుగా మార్చేందుకు అధికార ప్రజాప్రతినిధులు పాట్లు పడుతున్నట్లు కనబడుతుంది.నిజాంసాగర్ కాలువ స్థలాలు ప్రస్తుతానికి కబ్జాకు గురై రియల్టర్లు దర్జాగా వ్యాపారం చేసుకొని అమ్మకాలు జరిపిన తర్వాత భవిష్యత్తులో ఆయా కాలనీలో కాలువల పూడ్చివేతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి తప్పక ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ రెవిన్యూ అధికారులు కబ్జాకు గురవుతున్న అసైన్మెంట్ భూమి.. నిజాంసాగర్ కాలువ స్థలాలను గుర్తించి,ఆ స్థలాలను కబ్జా చేసి వెంచర్లో కలిపిన సదరు వెంచర్ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

కటిక నిరుపేదలం... కనికరించండి

- ఇంటి స్థలం కేటాయించాలంటూ రోడ్డెక్కిన మహిళలు
- 100, 101 లోని ఖాళీ ప్రదేశంలో గత నాలుగు రోజులుగా మౌన పోరాటం
- మరోవైపు ఆందోళనను అడ్డుపెట్టుకొని రెచ్చిపోయిన కబ్జారాయుళ్లు
- మా పోరాటం భగ్నం చేసుందుకు కొంతమంది బడా నేతల కుట్ర
- వారితో మాకెలాంటి సంబంధం లేదు : మహిళలు

శేరిలింగంపల్లి, జూన్ 22 (జనంసాక్షి) : బ్రతుకుతెరువు కోసం పొట్ట చేత పట్టుకొని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి శేరిలింగంపల్లి మియాపూర్ పరిధి స్టాలిన్ నగర్‌లో నివాసముంటు న్న కొంతమంది నిరుపేద మహిళలు గత నాలుగు రోజులుగా తమకు బ్రతుకు బండిని లాగడానికి ఇళ్లను కేటాయించాలని కోరుతూ మియాపూర్ పరిధి సర్వే నంబరు 100, 101 లోని ఖాళీ ప్రదేశంలో మౌన పోరాటానికి దిగి ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తున్న విషయం విధితమే. అయితే శుక్రవారం రాత్రి హైటెక్ సిటీ ప్రాంతం నుండి ఓ మహిళ భారీ సంఖ్యలో ప్రైవేటు వ్యక్తులను మహిళలు ఆందోళన చేస్తున్న ప్రాంతానికి తరలించి భారీగా గుడిసెలు వేయడంతో కథ ఒక్కసారిగా అడ్డం తిరిగింది. దీంతో పరిస్థితిని అంచనా వేసిన సదరు మహిళలు శనివారం ఉదయం శేరిలింగంపల్లి మండల డిప్యూటీ తహసిల్దార్ కార్యాలయానికి చేరుకొని డిప్యూటీ కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేయడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేక పోవడంతో ఆందోళనకు లోనై అక్కడే బైఠాయించి నిరసనను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గుంపులో నుండి కొందరు ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిందిస్తూ ఓవైపు పోలీసులను, మరోవైపు రెవెన్యూ అధికారులను ప్రతిఘటిస్తూనే పోలీసుల పైకి రాళ్లూరువ్వడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో కొందరు పోలీసులు, మరికొందరు మహిళలు ఇబ్బందులు పడడం గమ నార్హం. ఇందులో భాగంగా నిరసన కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్న కొందరు మహిళలు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. తాము ఇళ్లు లేని నిరుపేదలమని, తమ బ్రతుకు బండిని ఈడ్చుకోవడానికి కొంత స్థలమైన పరవాలేదు.

కనీసం డబల్ బెడ్ రూమ్ ఇళ్లయిన కేటాయించి తమను ప్రభుత్వం ఆదుకోవాలని గత నాలుగు రోజుల నుండి తాము నిరసన కార్యక్రమాన్ని మౌన పోరాటం ద్వారా తెలియజేస్తు న్నామని, కొంతమంది రాజకీయ పెద్దలు ఉద్దేశపూర్వకంగా తమపై కుట్ర పన్ని నిరసన కార్యక్రమాన్ని పటాపంచలు చేయదలచి ఓ మహిళా నాయకురాలి నేతృత్వంలో వందల మంది ప్రైవేటు వ్యక్తులను తాము నిరసన వ్యక్తం చేస్తున్న ప్రదేశానికి తరలించి గుడిసెలు వేయించి ప్రభుత్వానికి తప్పుడు సంకేతాలను పంపించడంతోపాటు తమను కబ్జాకోరులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మియాపూర్ సర్వేనెంబర్ 100 101 లో వెలిసిన గుడిసెలకు తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆమె కేవలం శాంతియుత వాతావరణం లోనే నిరసన కార్యక్రమం వ్యక్తం చేయడం జరిగిందని... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ గోడును అర్థం చేసుకొని తమకు కనీసం ఒక డబల్ బెడ్ రూమ్ ఇల్లు చొప్పున కేటాయిస్తే సరిపోతుందన్న ఉద్దేశంతోనే శనివారం మండల డిప్యూటీ కలెక్టర్ కార్యాలయాన్ని చేరుకోవడం జరిగిందన్నారు.

శేరిలింగంపల్లి పరిధిలో నిరుపేదలు బ్రతక కూడదన్న కొంతమంది బడా నేతల కుట్రలను ప్రభుత్వం అర్థం చేసుకుని తమను ఆదుకుంటే చాలని వారు వేడుకున్నారు.

ఐవిఎఫ్ తెలంగాణా పర్యావరణ పరిరక్షణ

సమితిఛైర్మన్‌గా భావన శ్రీనివాస్ నియామకం

ఎల్బీనగర్, జూన్22 (జనం సాక్షి) : అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ చేస్తున్న అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించి నానాటికి పెరిగిపోతున్న కాలుష్యాన్ని కూడా నియంత్రిం చాలనే తలంపుతో ఐవిఎఫ్ తెలంగాణా రాష్ట్ర విభాగం దానికి తగిన వ్యక్తిగా వనస్థలిపురంనకు చెందిన భాస్కరుని వెంకట (శ్రీనివాసరావు (భావన శ్రీనివాస్) ను గుర్తించి తెలంగాణ రాష్ట్ర విభాగం పర్యావరణ పరిరక్షణ సమితి ఛైర్మన్ గా నియమిస్తూ నిన్న జరిగిన యోగా వేడుకల వేదికగా ఐ వి ఎఫ్ జాతీయ అధ్యక్షులు గంజి రాజమౌళి గుప్త తెలంగాణా విభాగం అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు కలిసి భావన శ్రీనివాస్‌కు నియామకపు పత్రాన్ని భావన శ్రీనివాస్ కు అందించారు.ప్రముఖ సినీ నటులు పసునూరి శ్రీనివాస్ సమక్షంలో జరిగిన ఈ నియామకానికి రంగారెడ్డి జిల్లా ఐ వి ఎఫ్ అధ్యక్షులు చింతల రజనీకాంత్ సంఘీభావం తెలుపుతూ తన వంతు తోడ్పాటు అందిస్తానని అభినందనందించారు.టీఈపీసి ఛైర్మన్ గా తనను ఎంచుకున్న ఉప్పల శ్రీనివాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ తన నియామకానికి స్పందిస్తూ భావన శ్రీనివాస్..పర్యావరణ పరిరక్షణ ఒక నినాదంగా మిగిలిపోకూడదని అది మనిషి జీవన విధానంలో/దినచర్యలో భాగం కావాల్సిన అవసరం ఉందని గ్రహించి పర్యావరణ పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ఎంచుకుని గత 27 సంవత్సరాలుగా వ్యక్తిగతంగాను, 16 సం.లుగా జాగృతి అభ్యుదయ సంఘం స్వచ్ఛంద సంస్థ, ఎల్బీనగర్ నియోజక వర్గ కమిటి ఎల్ ఈపిసి ఛైర్మన్‌గాను పనిచేసి అనేక పర్యావరణ కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు, ఆ అనుభవంతో తోటి ఐవి

ఎకో టూరిజం అభివృద్ధికి కార్యాచరణ, ప్రణాళిక

హైదరాబాద్, జూన్ 22 (జనంసాక్షి) : తెలంగాణ వ్యాప్తంగా ఎకో టూరిజం (ప్రకృతి పర్యాటకం) అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నదని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. పర్యావరణానికి, వన్య ప్రాణులకు ఏ మాత్రం హాని కలగ కుండా, వాటి సహజ ఆవాసాలను పరిరక్షిస్తూ, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ ఎకో టూరిజం పాలసీని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి సురేఖ తెలిపారు. శనివారం డా.బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని అటవీ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎకో టూరిజం కన్సల్టేటివ్ కమిటి ఛైర్మన్, మంత్రి కొండా సురేఖ గారి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కన్సల్టేటివ్ కమిటి మెంబర్లు అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పిసిసిఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) పర్గెయిన్, పిసిసిఎఫ్ (కంపా) సువర్ణ, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఇండియా, స్టేట్ డైరక్టర్ ఫరీదా తంపల్, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పోరేషన్ (ఎకో టూరిజం) ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ రంజిత్ నాయక్‌బీబీ జాయింట్ సెక్రటరీ హరిత, డిప్యూటీ సెక్రటరీ(అటవీ) శ్రీలక్ష్మి, సిసిఎఫ్ క్షితిజ, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ఛైర్మన్ ఇమ్రాన్ సిద్దిక్, ఎండోమెంట్స్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పోరేషన్ జిఎం ఉపేందర్ రెడ్డి, సిఐఐ మెంబర్ శ్రీదేవి రావు, డిఎఫ్ఓలు శివ ఆశిష్ సింగ్, నవీన్ రెడ్డి, సిద్ధార్థ్ వి సింగ్, కిష్టా గౌడ్, రాహుల్ కె జాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఎకో టూరిజం అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సరికొత్తగా ఆవిష్కరించనున్నామని మంత్రి సురేఖ అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 12 సర్క్యూట్ లలో 40 ఎకో టూరిజం స్పాట్లను గుర్తించినట్లుగా మంత్రి సురేఖ తెలిపారు. అడ్వెంచర్, రీక్రియేషన్, ఆధ్యాత్మిక, వారసత్వ, సినీ, వెడ్డింగ్, నేచర్ అండ్ వైల్డ్ లైఫ్, హెరిటేజ్ అండ్ కల్చర్ తదితర అంశాల ఆధారంగా మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటిని ఎకో టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం పాలసీ రూపకల్పనలో అటవీ, దేవాదాయ, రెవెన్యూ, పర్యాటక శాఖలను సమన్వయం చేసుకుంటూ, అడ్డంకులను అధిగమించుకుంటూ సాగాలని అటవీ అధికారులకు మంత్రి సురేఖ సూచించారు. ఆర్కియాలజీ శాఖతో సంప్రదింపులు జరిపి రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాల్లో పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వం ఎకో టూరిజం పాలసీ రూపకల్పన పేరుతో కాలయాపన చేసిందని మంత్రి విమర్శించారు. ఒడిషా, కర్నాటక రాష్ట్రాల్లో అమలవుతున్న ఎకో టూరిజం విధానాలను అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఆ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు గమనించిన పరిస్థితులను ఇక్కడి పరిస్థితులతో బేరీజు వేసుకొని అత్యుత్తమ ఎకో టూరిజం పాలసీల రూపకల్పనకు కృషి చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. 'రాష్ట్రవ్యాప్తంగా ఎకో టూరిజం స్పాట్లను అభివృద్ధి చేసేందుకు పిపిపి పద్ధతిలో నిధులను సమీకరించాలి. రాష్ట్రంలోని ప్రధాన నది అయిన గోదావరి నదీపరివాహక ప్రాంతంలోనూ, జలపాతాలు, నీటివనరులన్న ప్రాంతాల్లో ఎకో టూరిజం స్పాట్లను అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలి. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా పథకాలు రచించాలి. ఎకో టూరిజం స్పాట్లకు సంబంధించిన సమస్త సమాచారాన్ని వెబ్ సైట్లలో అందించాలి. పూర్తిస్తాయిలో ఆన్లైన్ బుకింగ్ సదుపాయాన్ని కల్పించాలి. ఆయా పర్యాటక ప్రదేశాల్లో స్థానికులకు, మహిళా సంఘాలకు ఉపాధిని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలి. అటవీశాఖ ఆధ్వర్యంలో స్టాళ్ళు ఏర్పాటు చేయాలి. సామాజిక బాధ్యతగా ఎకో టూరిజం స్పాట్లకు సెలబ్రిటీల ద్వారా ప్రచారం కల్పించాలి. మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్వహణ ఉండాలి ప్లాస్టిక్ ఫ్రీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలి. ఏ చిన్న ప్రాణికి కూడా హాని కలగని విధంగా ఎకో టూరిజం పాలసీ రూపకల్పనను చేపట్టాలి" అని మంత్రి సురేఖ అధికారులకు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎకో టూరిజం పాలసీని రూపొందించే దిశగా కన్సల్టేటివ్ కమిటి ఒకడుగు ముందుకు వేసిందని మంత్రి సురేఖ తెలిపారు. ఈ సమావేశంలో క్రోడీకరించిన సమాచారాన్ని సీఎం గారి దృష్టికి తీసుకుపోయి విధివిధానాలు ఖరారు చేసిన తర్వాత మరోమారు కన్సల్టేటివ్ కమిటి సమావేశమవుతుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

పుప్పాలగూడలో డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభం

హైదరాబాద్, జూన్ 22 (జనంసాక్షి) : అత్యాధునిక డెంటల్ కేర్‌కు ప్రసిద్ధి చెందిన డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్‌ను హైదరాబాద్‌లోని పుప్పాలగూడలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక డెంటల్ కేర్ హాస్పిటల్‌ను ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ హాస్పిటల్ అంచెలంచెలుగా ఎదిగి ఈరోజు జంట నగరాలలో విస్తరించి ఉందన్నారు. 2013లో మాదాపూర్ బ్రాంచ్, 2014 లో ఇంకో బ్రాంచ్ ఓపెన్ చేశానని తెలిపారు. ఇప్పుడు ఈ బ్రాంచ్ అన్నారు. రోగులకు మంచి సర్వీసు అందజేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ ఈ కుటుంబం అంతా ఈ వృత్తిలోనే ఉందన్నారు. తెలంగాణాలో ఉన్న ప్రముఖులు అందరూ ఈ డెంటల్ క్లినిక్ కు వెళ్తుంటారన్నారు. గవర్నర్, ముఖ్యమంత్రులు ఈ హాస్పిటల్‌కు వస్తూ ఉంటారన్నారు. అందరికీ అందుబాటు ధరలతో ఈ క్లినిక్ ఉంటుందన్నారు. అత్యున్నత సాంకేతికతతో చికిత్స అందజేస్తున్నారని తెలిపారు. ఇతర జిల్లాల్లో కూడా నాణ్యమైన దంత సంరక్షణ క్లినికల్ ఏర్పాటు చేయాలన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ వ్యవస్థాపకుడు, సీఎండీ ఎమ్ఎస్ గౌడ్ మాట్లాడుతూ యాభై ఐదు సంవత్సరాల క్రితం డెంటల్ క్లినిక్ ఏర్పాటు చేసినప్పుడు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నానని చెప్పారు. అంతర్జాతీయ డెంటల్ కాన్ఫరెన్స్ లకు వెళ్లినప్పుడు అక్కడ చూసిన ఆధునిక టెక్నాలజీలను హాస్పిటల్కు తెచ్చేవాడినని తెలిపారు. కొత్త టెక్నాలజీ, కొత్త టెక్నిక్స్ ప్రవేశపెట్టానన్నారు. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామని తెలిపారు. నగరంలో ఇది ఆరో హాస్పిటల్ అన్నారు. హైదరాబాద్‌లో డిజిటల్ డెంటల్ ప్రాక్టీస్‌లో ముందంజలో ఉందన్నారు. పేషెంట్ కేర్, డెంటల్ ట్రీట్‌మెంట్ కచ్చితత్వం కోసం ఏఐని ఉపయోగిస్తున్నామని తెలిపారు. కోటి, సికింద్రాబాద్, బంజారా హిల్స్, మాదాపూర్, గచ్చిబౌలిలో హాస్పిటల్స్ కలవన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ ఆర్థోడాంటిక్స్, డెంటో ఫేషియల్ ఆర్థోపెడిక్స్ సీఈవో డాక్టర్ స్నిగ్ధా గౌడ్ మాట్లాడుతూ డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్1967 నుంచి దంత సంరక్షణలో అగ్రగామిగా ప్రసిద్ధి చెందిందన్నారు. డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ విభిన్న దంత అవసరాలు తీర్చనుందన్నారు. ఐటెరో ఎలిమెంట్ 5డీ ప్లస్ స్కానర్‌లు, ట్రియోస్ 5 స్కానర్‌లు, 3డీ ప్రింటర్లు, సీఏడీ-సీఏఎం ఆధారిత ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి కచ్చితమైన రోగ నిర్ధారణ చేయనుందని చెప్పారు. దంత సంరక్షణలో ఏఐ సాంకేతికతను సమగ్ర పరచడం, రోగి సౌలభ్యం, చికిత్స ఫలితాలు వంటి అధునాతన పద్ధతులను హాస్పిటల్ అమలు చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో నాణ్యతతో కూడిన దంత సంరక్షణ కోసం పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా అధునాతన దంత చికిత్సలను మరింత మందికి అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఈ విస్తరణకు కారణమని తెలిపారు. పుప్పాలగూడ క్లినిక్ అల్ట్రా ఆధునిక దంత సంరక్షణ అందించనుందన్నారు. అందమైన, ఆరోగ్యకరమైన చిరునవ్వుల కోసం రోగులకు స్నేహపూర్వక వాతావరణంలో అత్యుత్తమ సంరక్షణే లక్ష్యమన్నారు. డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్‌ను ఇతరుల నుంచి భిన్నంగా ఉంచేది ఏమిటంటే.. ఆవిష్కరణ, రోగి సంతృప్తి, దంత సంరక్షణలో శ్రేష్ఠత అన్నారు. నగరం అంతటా అనేక కేంద్రాలతో డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ ప్రతి రోగి ప్రత్యేక అవసరాలను తీర్చే సమగ్ర దంత సేవలను అందిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ చీఫ్ కాస్మెటిక్ డెంటల్ ఇంప్లాంటాలజిస్ట్, ఓరల్, మాక్సిల్లోఫేషియల్ ప్రోస్టోడాంటిస్ట్ డైరెక్టర్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ హైదరాబాద్‌లో దంత సంరక్షణలో ముందంజలో ఉందన్నారు. నాణ్యమైన దంత సంరక్షణ అందించాలన్న దృఢ సంకల్పం, అంకితభావం, సాంకేతిక పురోగతితో ముందుకు వెళు ్తందన్నారు. అధునాతన దంత సంరక్షణను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి కట్టుబడి ఉందన్నారు.

జోద్‌పూర్ మత ఘర్షణలో ఇద్దరికి గాయాలు

అల్లర్లను అదుపులోకి తెచ్చిన పోలీసులు

జైపూర్, జూన్ 22 (జనంసాక్షి) : రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో మత ఘర్షణలు జరిగాయి. ఇరు వర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఒక షాపు, రెండు కార్లు, పోలీస్ వాహనానికి నిప్పుపెట్టారు. పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. టియర్ గ్యాస్ షెల్స్ కూడా ప్రయోగించారు. ఈ ఘర్షణలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. జోధ్‌పూర్ సుర్‌సాగర్ ప్రాంతంలోని రాజారాం సర్కిల్ సమీపంలోని ఈద్గా వద్ద కొత్తగా రెండు గేట్లను ముస్లింలు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతున్నది. కాగా, శుక్రవారం రాత్రి 10:15 గంటల సమయంలో ఈద్గా గేట్ల ప్రారంభంపై స్థానిక హిందువులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత ఘర్షణలు జరిగాయి. రెండు వర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఉద్రిక్తతలు పెరుగడంతో ఒక సమూహం స్థానిక దుకాణాన్ని తగులబెట్టింది. పోలీస్ వ్యాన్‌తో సహా రెండు కార్లను ధ్వంసం చేశారు.మరోవైపు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. అలాగే నాలుగైదు రౌండ్ల టియర్ గ్యాస్ షెల్స్ కూడా ప్రయోగించారు. రాళ్ల దాడిలో ఒక పోలీస్ అధికారి, కానిస్టేబుల్ గాయపడినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ ఘర్షణకు సంబంధించి 51 మందిని అరెస్ట్ చేసినట్లు శనివారం వెల్లడించారు.

అయోధ్య విగ్రహప్రతిష్ఠాపన పూజారి ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ కన్నుమూత

వారణాసి, జూన్ 22 (జనంసాక్షి) : అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకకు ప్రధాన పూజారిగా వ్యవహరించిన ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ (86) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. శనివారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. కాశీలో పేరొందిన పండితుల్లో ఒకరిగా గుర్తింపుపొందిన లక్ష్మీకాంత్ స్వస్థలం మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా. అయితే, ఆయన కుటుంబం తరతరాలుగా కాశీలోనే నివసిస్తోంది. మణికర్ణిక ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. లక్ష్మీకాంత్ మృతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు దిగ్భ్రాంతి-రతి వ్యక్తంచేశారు. ఆయన్ను దేశంలోని గొప్ప పండితుల్లో ఒకరిగా పేర్కొన్న ప్రధాని మోదీ.. కాశీ విశ్వనాథ్ ధామ్, అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సంస్కృత భాషకు, భారతీయ సంస్కృతికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని సీఎం ఆదిత్యనాథ్ సంతాపం తెలిపారు. జనవరి 22న ప్రధాని మోదీ చేతులమీదుగా అయోధ్య ఆలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన విషయం తెలిసిందే.

మేడ్చల్ జ్యూవెలరీ షాప్‌లో దోపిడీ

- **24 గంటల్లోనే ఛేదించిన పోలీసులు**
- **సిసి కెమెరాల ఆధారంగా దొంగల గుర్తింపు**

మేడ్చెల్, జూన్ 22 (జనంసాక్షి) : మేడ్చల్‌లో జ్యువెలరీ షాప్ దోపిడీ కేసును పోలీసులు చేధించారు. 24 గంటల్లోనే నిందితులను మేడ్చల్ పోలీసులు పట్టుకున్నారు. జూన్ 20న జగదాంబ జ్యువెలరీ షాప్ లో మాస్క్, బుర్ఖా ధరించి యజమానిని కత్తితో పొడిచి బంగారు ఆభరణాలు దోచుకునే ప్రయత్నం చేసిన సంగతి తెలిసిందే.. షాపు యజమాని ఫిర్యాదుతో సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు పోలీసులు. ఈ కేసులో ముగ్గురి భాగస్వామ్యం ఉందని మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి అన్నారు. ఈ కేసులో నిందితులు హైదరాబాద్ కు సంబంధించిన వారే. ఈ కేసులో ప్రధాన నిందితులు నజీమ్ అజీజ్ కొటాడియా.. షేక్ సోహెల్.. నిందితులు రాబరికోసం చోరీ చేసిన బైక్‌ను వినియోగించారు. నిందితులు దీన్ని ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేశారు. చోరీ చేయడానికి ముందు నిందితులు మూడుసార్లు రెక్కీ నిర్వహించారు. సుమారు పదిచోట్ల రెక్కీ నిర్వహించి మేడ్చల్లో దోపిడీకి యత్నించారు. నిందితులను పట్టుకోవడం కోసం సుమారు 200 సీసీ కెమెరాలు జల్లెడ పట్టాము. బైక్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టినప్పుడు చోరీ చేసిన బైక్ గా గుర్తించాము. ఇటీవల చాధర్ ఘాట్ లో జరిగిన చోరీ నిందితుడు కోటడియా పాత్ర ఉంది. ముందుగా కోటాడియాను అరెస్ట్ చేశాం.. అతని ద్వారా షేక్ సోహెల్ అరెస్ట్ చేశాం. ఇద్దరికీ జైలులో పరిచయం ఏర్పడింది. ఇద్దరు నిందితులకి సహకరించిన మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడని చెప్పారు. జగదాంబ జువెలరీ షాపులోకి మధ్యాహ్నం ఇద్దరు దుండగులు పల్సర్ బైక్ పై వచ్చారు. ఒకరు బుర్ఖా వేసుకోగా మరొకరు హెల్మెట్ పెట్టుకుని వచ్చి.. గోల్డ్ షాపు ఓనర్ శేషారామ్‌ను నగదు, గోల్డ్ బ్యాగులో వేయమని కత్తితో బెదిరించి పొడిచారు. ఆపై ఆభరణాలను దోచు కుంటుండగా.. దొంగల నుంచి తప్పించుకొని నెట్టేసి.. చోర్ చోర్ అంటూ ఓనర్ శేషారామ్ బయటకు పరుగులు తీశారు. దీంతో భయపడిన దొంగలు వచ్చిన బైక్ పైనే పారిపోయారు. ఘటన అంతా సీసీ ఫుటేజ్ లో రికార్డ్ అయింది. షాప్ ఓనర్ కంప్లయింట్ చేయగా పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ ఏసీపీ, మేడ్చల్ సీఐ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. సీసీ టీవీ ఆధారంగా 24 గంటల్లోనే నిందితులను పట్టుకున్నారు. ఆభరణాల దుకాణ యజమానిని కత్తితో పొడిచి పట్టపగలే దోపిడీకి యత్నించిన ఘటన మేడ్చల్‌లో కలకలం సృష్టించింది.

రాజకీయాలకతీతంగా జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

నల్లగొండ బ్యూరో, జూన్ 22 (జనం సాక్షి) : రాజకీయాలకతీతంగా నల్గొండ జిల్లా అభివృద్ధే ధ్యేయంగా అందరూ కలిసి పనిచేయాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నల్గొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బండా నరేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మిషన్ భగీరథ, వ్యవసాయం, విద్యుత్, విద్య తదిత అంశాలపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చించారు. జూలై 4 తో ప్రస్తుత జిల్లా పరిషత్తు కాలపరిమితి ముగియనునందున శనివారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి సభ్యులందరూ పెద్ద ఎత్తున హాజరయ్యారు.ముందుగా సమావేశానికి జిల్లా పరిషత్ చైర్పర్సన్ బండా నరేందర్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ గత 5 సంవత్సరాలు ఏలాంటి ఒడిదుడుకులు లేకుండా జిల్లా పరిషత్తు కార్యక్రమాలను, సమావేశాలను సజావుగా నిర్వహించడంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.మిషన్ భగీరథ పై జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికి మిషన్ భగీరథ తగు నీరు వచ్చేలా చూడాలని,ఇందుకు మిషన్ ఇంజనీరింగ్ అధికారులు గ్రామాలలో తిరిగి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని,అవసరమైతే శాసనసభ్యుల నిధుల ద్వారా చిన్నచిన్న సమస్యలను అధిగమించాలని సూచించారు. వ్యవసాయంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ ఆగస్టు 15లోగా రాష్ట్రంలో సుమారు 31వేల కోట్ల రూపాయలను రైతుల రుణమాఫీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించినట్లు వెల్లడించారు. అదేవిధంగా రైతు భరోసాపై సైతం త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని,2 లక్షల రూపాయలు రైతులకు రుణమాఫీ చేసింది గతంలో ఏ ప్రభుత్వం లేదని అన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథకు సంబంధించిన పెండింగ్లో ఉన్న బిల్లులు చెల్లింపులపై అధికారులు స్పష్టత నివ్వాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సమిష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, తుంగతుర్తి మందుల సామేలు, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, శాసనమండలి సభ్యులు నర్సిరెడ్డి మాట్లాడారు. సమావేశానికి హాజరైన జడ్పిటిసిలు ఎంపీపీ లను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలు శాలువా, జ్ఞాపకాలతో సన్మానించారు. భువనగిర పార్లమెంట్ సభ్యులు ఛామల కిరణ్‌కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,జెడ్పిసిఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, జెడ్పిటిసిలు, ఎంపీపీలు,జిల్లా స్థాయి అధికారులు, తదితరులు హాజరయ్యారు.

సింగరేణి విద్యా సంస్థల్లో 100 శాతం ఫలితాలు సాధించాలి

- **త్వరలో సీబీఎస్ఈ పాఠశాలగా సెక్టర్-3 స్కూల్**
- **విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి**
- **ఖర్చుకు వెనకాడకుండా పాఠశాలల ఆధునికీకరణ**
- **సింగరేణి విద్యా సంస్థల పనితీరుపై సమీక్షలో సీఎండీ ఎన్.బలరామ్**

ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి

సింగరేణి విద్యా సంస్థలను అత్యుత్తమ విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సింగరేణి చరిత్రలో తొలిసారిగా రామగుండం-2 ఏరియాలోని సెక్టర్-3 పాఠశాలలో సీబీఎస్ఈ బోధనను త్వరలోనే ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఇప్పటికే చర్యలు తీసుకోవడం జరిగిందని.. అలాగే సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న 9 పాఠశాలలు, 1 జూనియర్ కళాశాల, 1 డిగ్రీ కాలేజీ, 1 పీజీ కాలేజ్, పాలిటెక్నిక్ కళాశాలల పనితీరుపై తొలిసారిగా శనివారం సాయంత్రం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల్లో గత ఏడాది సాధించిన 10వ తరగతి ఫలితాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించిన సెక్టర్-3 పాఠశాల, భూపాల పల్లి పాఠశాలల యాజమాన్యాలను అభినందించారు. మిగిలిన పాఠశాలలు కూడా విద్యార్థుల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, చొరవ తీసుకోవాలని సంబంధిత పాఠశాలల ప్రిన్సిపళ్లను ఆదేశించారు. సింగరేణి విద్యా సంస్థల్లో దాదాపు 7500 మంది విద్యను అభ్యసిస్తున్నారని.. గత ఏడాది 94 శాతం ఫలితాలు సాధించినట్లు జీఎం(ఎడ్యుకేషన్) నికోలస్ వివరించారు. సింగరేణి విద్యా సంస్థలను దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, ప్రిన్సిపళ్లు, కరస్పాండెట్లపై ఎక్కువగా ఉందని.. అందరూ సమన్వయంతో పనిచేయాలని సీఎండీ పిలుపునిచ్చారు. పాఠశాలల్లో అహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని.. ఖర్చుకు వెనకాడకుండా పాఠశాలల ఆధునికీకరణకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పవిత్రమైన విద్యా సంస్థల్లో పనిచేస్తున్న వాళ్లు మరింత అంకిత భావంతో పనిచేయాలని.. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని , క్రీడాసక్తిని కూడా పెంపొందించేలా బోధన సాగాలన్నారు. సింగరేణి విద్యా సంస్థల్లో ఇతరులను జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని.. సమస్యలు ఉంటే యాజమాన్యం దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్(పర్సనల్, ఆపరేషన్స్) ఎన్.వి.కె.శ్రీనివాస్, జీఎం(కోఆర్డినేషన్) జి.దేవేందర్, జీఎం(ఎడ్యుకేషన్) నికోలస్, అన్ని పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపళ్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370